




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








గురువారం | 31-10-2019 | పేజీలు: 14 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 195 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా. 1.02 తదుపరి పంచమి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 9.32 తదుపరి మూల; వర్జ్యం: రా. 7.57-9.32, తె. 5.39 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.05-10.51, మ. 2.39-3.24; అమృతఘడియలు: మ. 12.54-2.28; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.17; సూర్యాస్తమయం: 5.41 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai




# బంగారం లెక్క చెప్పాల్సిందే!

## ఎవరి దగ్గర ఎంతుందో గుట్టు విప్పాల్సిందే!

పరిమితికి మించిన స్వర్ణంపై పన్ను.. నిర్దిష్ట గడువు తర్వాత భారీగా ఫైన్

కొత్తగా కొనే పసిడి గురించి చెప్పాలి.. రసీదు లేకుండా కొంటే జరిమానా

వివాహితల నగలకు కొంత మినహాయింపు.. కేంద్రం మరో సంచలన నిర్ణయం?

పెద్దనోట్ల రద్దు తర్వాత మరో 'పెద్ద' పథకం

నోట్ల రద్దు తర్వాత సామాన్యులపై భారీ ప్రభావం చూపే అతి పెద్ద నిర్ణయం తీసుకునే దిశగా మోదీ సర్కారు అడుగులు వేస్తోంది. దేశంలో ప్రతి ఇంటా అంతో ఇంతో ఉండే బంగారంపై దృష్టి సారించింది. 'పరిమితి'కి మించి ఉన్న పసిడిపై పన్ను, జరిమానా విధించాలని భావిస్తోంది. ఆ పరిమితి ఎంతనేదానిపై స్పష్టత లేదు.



న్యూఢిల్లీ, అక్టోబరు 30: మహిళల నుంచి మదుపుదారుల దాకా అందరికీ ప్రియమైనది బంగారం! ఇది స్థిరమైన పెట్టుబడి సాధనం. అంతేకాదు... పెద్ద నోట్ల రద్దు తర్వాత నల్ల ధనాన్ని బంగారం రూపంలోకి మార్చడం ఎక్కువైంది. ఇప్పుడు ఇదే బంగారంపై మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం! 'మీ వద్ద ఎంత బంగారం ఉందో చెప్పాలి' అనే కొత్త నిబంధనను తీసుకురానున్నట్లు

మిగతా 13వ పేజీలో...



బుధవారం మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్, మంత్రులు, సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం, అధికారులు

# భూములమ్మి బిల్డ్

## విలువైన ప్రభుత్వ స్థలాల విక్రయం

### నాడు-నేడు, నవరత్నాలకు నిధులు

మౌలిక వసతుల కల్పనకూ మార్గం

ఎన్‌బీసీసీతో కలిసి 'మిషన్ బిల్డ్'

కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం

కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'నవరత్నాలు', ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చే 'నాడు-నేడు'తోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక 'మిషన్' చేపట్టింది. దానిపేరు... 'మిషన్ బిల్డ్'. దీనికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను విక్రయించాలని నిర్ణయించింది. 'ఆపరేషన్ బిల్డ్'ను కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్' (ఎన్‌బీసీసీ)తో కలిసి చేపడతారు. దీనిపై ఎన్‌బీసీసీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. భూముల అభివృద్ధి, భవన నిర్మాణాలు, ఇంకా ప్రభుత్వ భూములను రియల్ వెంచర్లుగా మార్చడంలో ఎన్‌బీసీసీకి అపారమైన అనుభవం ఉంది. భూముల అమ్మకంలో ఈ సంస్థ చాలా కీలకపాత్ర

మిగతా 12వ పేజీలో...

### 'స్టార్టప్'కు స్వస్తి

సీడ్ కేపిటల్ ప్రాజెక్టు నుంచి తప్పుకొనేందుకు సింగపూర్ కన్సార్షియానికి అనుమతి 12

కేబినెట్ భేటీలో చర్చ.. అంగీకరించిన సీఎం

విచారణ లేకుండా వదిలేస్తున్నాం: జగన్

ఆదాయంపై అడిగితే దిక్కులు చూశారు: బొత్స

రద్దుపై ముందుగానే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

# ఇంటర్ వరకూ అమ్మఒడి

## జనవరి నుంచి తల్లుల ఖాతాల్లో డబ్బు

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికే

తెల్ల రేషన్ కార్డు, ఆధార్ తప్పనిసరి

రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం

గర్భిణులు, బాలింతలకు రెట్టింపు పౌష్టికాహారం

తీవ్ర వ్యాధిగ్రస్తులకు నెలవారీ పింఛను

పారిశుధ్య కార్మికుల వేతనాలు 16 వేలకు పెంపు

కృష్ణా, గోదావరి కాలువల శుద్ధికి ప్రత్యేక మిషన్

మాల, మాదిగ, రెల్లి కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్లు

హజ్, జెరూసలెం యాత్రికులకు సాయం పెంపు

147 నియోజకవర్గాల్లో వైఎస్ఆర్ అగ్రిల్యాబ్‌లు

7 నుంచి అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లింపులు

పేదలకు 100 గజాల వరకు రూపాయికే రిజిస్ట్రేషన్

వీబీసీ, లులూ గ్రూపులకు భూకేటాయింపులు రద్దు

ప్రతిభావంతులకు వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అవార్డులు



కేబినెట్ తీర్మానాలను వెల్లడిస్తున్న పేర్ని నాని

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న పేద విద్యార్థులకు అమ్మ ఒడి పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకే దీనిని వర్తింపజేయాలని స్పష్టం చేసింది. పథకం కింద లబ్ధి పొందేవారికి తెల్ల రేషన్ కార్డు, ఆధార్ తప్పనిసరిగా ఉండాలని తేల్చిచెప్పింది. తెల్ల కార్డు లేనివారు.. ఇప్పటికే దాని కోసం దరఖాస్తు చేసి ఉంటే ప్రభుత్వం ఇచ్చే రశీదు ఉన్నా సరిపోతుందని

మిగతా 12వ పేజీలో...

### వ్యతిరేక వార్తలపై కేసులు

శాఖల కార్యదర్శులకు అధికారం 12

జీవో జారీ చేసిన ప్రభుత్వం

### ఆంధ్ర హైకోర్టు జడ్జిగా జస్టిస్ రాకేశ్

పట్నా హైకోర్టు నుంచి బదిలీ

3 హైకోర్టుల సీజేలు కూడా 2

కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్

### 'సచివాలయ' అభ్యర్థులకు లక్కీచాన్స్

ప్రతి విభాగంలోనూ 15 అదనపు మార్కులు

మిగిలిన 25 వేల పోస్టుల భర్తీకి తక్షణ చర్యలు 13








గుంటూరులో గాంధీ సంకల్ప యాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు రాంమాధవ్, కన్నా లక్ష్మీనారాయణ, రావెల కిశోర్ బాబు తదితరులు

ప్రధాని శంకుస్థాపన చేశారు...

# రాజధాని ఎక్కడికీ వెళ్లదు

అయోమయంలో రాజధాని రైతుల బతుకులు

వారి పక్షాన పోరాటానికి బీజేపీ సిద్ధం

రెండు బస్తాల ఇసుక పోయిందంటూ ఫిర్యాదు చేసే స్థాయిలో అవినీతి

ఆంధ్రలో అవినీతి కోసమే పథకాల అమలు

పథకాలన్నీ వైసీపీ వాళ్లకే: రాంమాధవ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

"ప్రధాని శంకుస్థాపన చేసిన రాజధాని. అది ఎక్కడికీ వెళ్లదు. సమస్యను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్తా. పరిష్కారానికి కృషి చేస్తా" అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ హామీ ఇచ్చారు. బుధవారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనను రాజధాని ప్రాంత రైతులు కలిశారు. రాజధాని మార్పు ప్రకటనతో గందరగోళం ఏర్పడిందని, కేంద్రం స్పందించి రాజధానిపై

మిగతా 13వ పేజీలో...

# డెంగీ దడ

## రాష్ట్రమంతా ఒకటే వణుకు

## యంత్రాంగం మాత్రం కునుకు

3 నెలలుగా విజృంభిస్తున్నా అప్రమత్తం కాని వైద్యశాఖ

పైగా మృతులే లేరని వాదన

'తూర్పు'లో డెంగీకి స్వయానా వైసీపీ కార్యకర్త మృత్యువాత

కేసుల నమోదు నామమాత్రం

ప్రైవేటువి అసలే గుర్తించరు

ఆ రోగుల్నీ కలుపుకొంటే ఒక్కోజిల్లాలో వేల కేసులు

ప్రైవేటు ఆస్పత్రులు కిటకిట

నిర్ధారణకు 3 వేలు, చికిత్సకు రూ.50 వేలు చొప్పున బిల్లు



నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన జ్వర బాధితులు



నవ్య, కుమార్తెతో చందు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం కోమరాజులంకకు చెందిన నవ్యను ఐదేళ్లక్రితం చందు వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికీ నాలుగేళ్ల కుమార్తె యోషిత(4) ఉంది. చందు భార్య నవ్య డెంగీ బారిన పడి, ఈనెల 5న మరణించింది. భార్య మరణాన్ని తట్టుకోలేకపోయాడు. అలాగని తాను చనిపోతే తమ కుమార్తె అనాథ అవుతుందని ఆలోచించాడు. దీంతో ముందు పాపను చంపేసి, ఆ తరువాత తానూ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇలా ఒక కుటుంబం డెంగీ విషకాటుకు కూలిపోయింది. నెల్లూరు జిల్లా

మిగతా 2వ పేజీలో...




డాక్టర్ వందన (ఫైల్)

### డెంగీ జ్వరంతో డాక్టర్ మృతి

చికిత్స చేస్తుండగానే విశాఖలో విషాదం

గుంటూరులో యూరాలజిస్ట్ మృత్యువాత



వైసీపీ దాడుల్లో గాయపడ్డారంటూ వారి ఫొటోలు చూపిస్తున్న చంద్రబాబు

# హక్కుల ఉల్లంఘన

స్వేచ్ఛను ఈ ప్రభుత్వం కాలరాస్తోంది

మా నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు

కార్యకర్తలు అఘాయిత్యాలకు పాల్పడొద్దు

నా ప్రాణాలొడ్డయినా కాపాడుకుంటా

ఇది 'జగన్నాటకం'లో మైండ్‌గేమ్ 11

ఆబోతులను తయారుచేసి వదిలారు

ప్రశాంత 'కృష్ణా'లో హత్యా రాజకీయాలా?

అక్రమ కేసులపై కోర్టులకెళ్తాం

తప్పుడు కేసులు పెట్టినోళ్ల అంతుచూస్తాం

టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరిక

విస్తృత భేటీలో బాధితులతో ప్రత్యేక భేటీ

### బాబు, కన్నాకు పవన్ ఫోన్

'లాంగ్‌మార్చ్'కు మద్దతివ్వాలని వినతి 11

లెఫ్ట్, లోక్‌సత్తా, బీఎస్పీ నేతలకు కూడా



పరంజ్యోతి

# అనుగ్రహానికి అవరోధం 'అహంకారం'



*అహంకార వశాదాప దహంకారాద్దు రాధయః*
*అహంకార వశాదీహా నాహంకారాత్పరోరిపుః*

..అహంకార వశముననే ఆపదలు, అహంకారం వల్లనే చెడు ఆలోచనలు, అహంకారం వల్లనే కోరికలు, ప్రయత్నాలు, చేష్టలు.. కాబట్టి అహంకారం కంటె వేరొక శత్రువు లేదని 'మహోపనిషత్తు' సందేశం. అందరిలో ఉన్న 'నేను' ఒకటే అయినప్పటికీ దేహాభిమానంతో భేదాలు పాటిస్తూ, దేహమే 'నేను' అని భావించడం అహంకారమవుతుంది. అంతఃకరణలో మనో, బుద్ధి, చిత్త, అహంకారాలనే నాలుగు వృత్తులున్నాయి. వాటినే అంతరింద్రియాలంటారు. సంకల్పవికల్పాత్మక వృత్తియే 'మనసు' అనబడుతుంది. 'ఇది చేయాలి, ఇది చేయకూడదు' అనే నిర్ణయానికి వచ్చే అంతఃకరణ వృత్తిని 'బుద్ధి' అంటారు. చింతనాత్మకమైన వృత్తి 'చిత్తము'గా పిలువబడుతుంది. అభిమానాత్మక వృత్తియే అహంకారం. 'రూపాహంకారం, ధనాహంకారం, విద్యాహంకారం, అధికార అహంకారం, జ్ఞానాహంకారం.. ఇలా అహంకారాలు బహు విధాలు. ఏదో ఒక అహంకారం ఎల్లప్పుడూ మనిషిని బాధిస్తూ ఉంటుంది. అహంకారాన్ని నశింపజేసుకుంటేనే శాశ్వత జ్ఞానాన్ని పొందవచ్చు. అహంకారం వల్ల ఆత్మశక్తి ఎంతగానో నిరుపయోగం అవుతుంది. అహంకారం రాహుగ్రహం లాంటిది. రాహువు పూర్ణచంద్రుని కప్పి కనబడకుండ చేసినట్లు, అహంకారం జీవుని ఆత్మస్వరూపాన్ని కప్పివేస్తుంది. ఆ అజ్ఞానము తొలగితే ఆత్మజ్ఞానం కలుగుతుంది. అనుగ్రహానికి అవరోధం అహంకారం. అల్పమైన 'నేను' మృతి చెందగానే చిత్త సంక్షోభ హేతువులు మటుమాయమవుతాయి. అహంకారం, అభిమానం, డంబం, కామం, క్రోధాలను వదిలినవాడు, సంగ్రహ బుద్ధి లేనివాడు, మమకార రహితుడు, శాంతుడు అయిన మానవుడు బ్రహ్మస్వరూపాన్ని పొందడానికి సమర్థుడని కృష్ణపరమాత్మ భగవద్గీతలోని మోక్షసన్యాసయోగంలో చెప్పాడు. జీవుడికి దేవుడికి అడ్డుగా ఉన్న తెర.. అహంకారం. అది తొలగితే జీవుడే దేవుడు. ఒకసారి భోజమహారాజు తన ఆస్థానంలో ఉన్న పండితులనుద్దేశించి.. 'మీలో మోక్షానికి ఎవరు పోతారో చెప్పండి' అని ప్రశ్నించాడట. కాళిదాసు లేచి "'నేను' పోతే పోవచ్చును" అన్నాడు. తక్కిన పండితులంతా కాళిదాసుని మోక్షానికి ఎట్లా పోతాడో వివరంగా చెప్పమన్నారు. అప్పుడు కాళిదాసు "'నేను' అనే అహంకారం పోతే ఎవరైనా మోక్షానికి పోవచ్చు' అని వివరించాడు. మన చేతనలో నుంచి అహాన్ని ఎప్పుడైతే వదలిపెట్టి, భగవంతునిలో జీవించడం సాగిస్తామో అప్పుడు మనకు అపారమైన శక్తి లభిస్తుంది. ఎల్లప్పుడూ దైవసన్నిధిలోనే జీవనం కొనసాగిస్తున్నప్పుడు అహం తన శక్తిని కోల్పోతుంది.

**- మేఘశ్యామ(ఈమని), 83329 31376**

## నాలుగు మాసాల్లో.. హక్కుల కమిషన్ ఏర్పాటు చేయండి!

▸▸ **ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మానవ హక్కుల కమిషన్‌ను నాలుగు నెలల్లోగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. హక్కుల కమిషన్ ఏర్పాటు కోరుతూ ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ కార్యదర్శి బి.మోహనరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ కె.వి జయలక్ష్మితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.


### ఉద్యాన వర్సిటీ వీసీ నియామకానికి సమస్యేంటి?

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీకి పూర్తిస్థాయి ఉప కులపతి(వీసీ)ని నియమించడంలో ఏం సమస్యలున్నాయని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఐఎఫ్ఎస్ అధికారికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడాన్ని తప్పుబట్టింది. పూర్తిస్థాయి వీసీ లేకపోవడం వల్ల ఆ వర్సిటీలో చోటు చేసుకునే పరిణామాలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే(సీఎస్) బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సీఎస్ తరపు న్యాయవాదిని ఆదేశిస్తూ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం తదుపరి విచారణను నవంబరు 28కి వాయిదా వేసింది.

## వారంలో గ్రామ న్యాయాలయాలు!

▸▸ **హైకోర్టుకు తెలిపిన ఏజీ.. విచారణ 7కు వాయిదా**

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ న్యాయాలయాలను వారంలోగా ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ ఎస్.శ్రీరాం హైకోర్టుకు వివరించారు. రాష్ట్రంలో గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ కృష్ణాజిల్లాకు చెందిన భిక్షం గత ఏడాది పిల్ దాఖలుచేసిన విషయం తెలిసిందే. దీనిపై బుధవారం మరోమారు హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఏజీ వాదనలు వినిపిస్తూ.. గ్రామ న్యాయాలయాలపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటారని, అందువల్ల న్యాయాలయాల ఏర్పాటుకు పది రోజుల సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే వారం మాత్రమే గడువిచ్చిన ధర్మాసనం తదుపరి విచారణను నవంబరు 7వ తేదీకి వాయిదా వేసింది.



సోమశిల డ్యాం క్రస్ట్ గేట్లు ఎత్తడంతో పెన్నానదిలోకి దూకుతున్న గంగమ్మ



ఒంగోలులోని పేర్లమాన్యం ఎస్టేకాలనీలో వరద నీరు

# నిండు కుండలా సోమశిల!

▸▸ **చరిత్రలో తొలిసారి 78టీఎంసీల నీటిమట్టం**

▸▸ **నాలుగు క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు విడుదల**

నెల్లూరు, కడప, ఒంగోలు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విస్తారంగా కురుస్తున్న వర్షాల ధాటికి నెల్లూరు జిల్లా ప్రధాన జలవనరు సోమశిల జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ నుంచి వరద పోటెత్తడంతో నెల రోజులుగా ఇన్‌ఫ్లో అధికంగా ఉంది. దీంతో 44 ఏళ్ల సోమశిల జాలశయం చరిత్రలో తొలిసారిగా రికార్డు నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా బుధవారం సాయంత్రానికి 77.780 టీఎంసీలతో ప్రాజెక్టు తొణికిసలాడింది. ప్రాజెక్టు అధికారులు బుధవారం 4క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని పెన్నా నదిలోకి వదిలిపెట్టారు. మరోవైపు కండలేరు డ్యాంలోనూ నీటినిల్వ 36 టీఎంసీలుగా ఉంది. సోమశిల నుంచి రోజుకు ఒక టీఎంసీ చొప్పున కండలేరుకు తరలిస్తున్నారు.

### ముంచేసిన బ్యాక్ వాటర్

సోమశిల జలాశయానికి వరద పోటెత్తడంతో ఎగువన ఉన్న కడపజిల్లా అట్లూరు, నందలూరు, పెనగలూరు, గోపవరం, ఒంటిమిట్ట మండలాల్లోని పలు గ్రామాల్లోని పంట చేలల్లోకి నీరు చేరింది. చేతికొచ్చిన వరి, పసుపు పంటలు నీటిపాలయ్యాయి. దాదాపుగా 1250 ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు నష్టపోయినట్లు పేర్కొంటున్నారు. పెట్టుబడి, దిగుబడి రూపంలో రూ.12.50 కోట్లకు పైగా రైతులు నష్టపోయారు. పంటపొలాలతోపాటు గ్రామాల్లోకి కూడా నీళ్లు రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవడంతో పాటు ఇళ్లకు డబ్బులిచ్చి మరోచోట ఇంటి పట్టాలు ఇస్తే ఊళ్లు ఖాళీ చేసి అక్కడ నివాసాలు నిర్మించుకుంటామని గ్రామస్తులు అంటున్నారు. కాగా.. నీట మునిగిన పంట చేలకు ఇప్పటికే భూ పరిహారం చెల్లించామని, పంట నష్టపరిహారం ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు పేర్కొంటున్నారు.

### ఒంగోలును ముంచెత్తిన వాన

ఒంగోలు నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. బుధవారం తెల్లవారుజామున 128.8 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో ప్రధాన రహదారులు వాగులను తలపిస్తున్నాయి. 20కిపైగా కాలనీలు జలమయం అయ్యాయి. జిల్లాలోని 35 మండలాల్లోనూ భారీ వర్షం పడింది. బుధవారం నెల్లూరు జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.

### విస్తారంగా వర్షాలు

అమరావతి/తిరుమల/మచిలీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కొమరిన్ ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ప్రభావంతో దక్షిణ కోస్తాలో బుధవారం భారీవర్షాలు పడ్డాయి. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో అత్యధికంగా 72.5మిల్లీమీటర్లు, తిరుమలలో 72, బాపట్లలో 68.5, నాగాయలంకలో 66.2, భీమవరంలో 56.2, ప్రకాశం జిల్లా ఇంకొల్లులో 42.2మి.మీ. వర్షపాతం నమోదైంది. విజయవాడ, గుంటూరు నగరాల్లో భారీవర్షం కురిసింది. ఈ వర్షాలు పత్తి పైరుకి తీవ్రనష్టం కలిగిస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మినుము, పెసర, కూరగాయ పంటలూ దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు. కాగా, మంగళవారం ఉదయం 9నుంచి బుధవారం ఉదయం 9గంటల వరకు తిరుమలలో 72మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రస్తుత సీజన్‌లో ఒకేరోజు ఇంతవర్షం కురవడం ఇదే ప్రథమం. బుధవారం సాయంత్రం కూడా తేలిక పాటి జల్లులు కురుస్తుండటంతో సహస్ర దీపాలంకరణ సేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు.



## నడి రాత్రిలో.. డోలీతో..!

అది విజయనగరం జిల్లా అటవీ ప్రాంతంలోని ఓ కుగ్రామం. సాలూరు మండలం కొదమ పంచాయతీలో ఉన్న ఆ గ్రామం పేరు సిరివర. అక్కడి నుంచి రోడ్డుకు చేరాలంటే వాగులు వంకలు.. కొండలు గుట్టలతో ఉండే మార్గంలో 12కి.మీ. నడక సాగించాలి. ఆ కుగ్రామంలో బుధవారం తెల్లవారుజామున 2గంటలకు ఓ గర్భిణీకి పురిటినొప్పులు మొదలయ్యాయి. ఆ నడిరాత్రిలో నలుగురు కలిసి డోలీ కట్టి.. ఆమెను మోసుకుంటూ.. 4గంటలపాటు నడిచి దుగ్గేరు చేరుకున్నారు. అప్పటికే సమాచారం ఇవ్వడంతో ఫీడర్ అంబులెన్స్ అక్కడికి చేరుకుంది. దానిలో గర్భిణీని మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ఆమెకు సుఖప్రసవం జరిగి.. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ కష్టాన్నంతా మరచిపోయి భర్త, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

**- సాలూరు రూరల్**

## అప్‌గ్రేడెడ్ పండిట్ పోస్టుల్లో ఎస్జీటీలకూ చాన్స్

▸▸ **ఉత్తర్వులు జారీచేసిన పాఠశాల విద్యాశాఖ**

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అప్‌గ్రేడెడ్ లాంగ్వేజ్ పండిట్, పీఈటీ(స్కూల్ అసిస్టెంట్) పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు అనుమతించిన ప్రభుత్వం.. అందులో అర్హులైన ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లకూ అవకాశం కల్పించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు (జీ.వో.నెం.77) జారీచేశారు. ఈ ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. లాంగ్వేజ్ పండిట్, పీఈటీలకు 100 శాతం ఉన్నతీకరణ చేపట్టాలని పండిట్, పీటీటీ జేఏసీ చైర్మన్ అంకాల్ కొండయ్య ప్రభుత్వాన్ని కోరారు. పదోన్నతుల్లో ఎస్జీటీలకు కూడా అవకాశం కల్పించడం బాధాకరమన్నారు. ఈ జీవోని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, భాషోపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. ఉన్నతీకరించిన పండిట్, పీఈటీ పోస్టుల్లో పదోన్నతుల ద్వారా అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్లకు అవకాశం కల్పిస్తూ జీవో విడుదల చేయడం పట్ల ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్. జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, జి.హృదయరాజు హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్ఆర్, జేఆర్ పోస్టులకు నోటిఫికేషన్

▸▸ **పీజీతో పాటు డీఎన్‌బీ అభ్యర్థులకూ అవకాశం**

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రెసిడెంట్స్(ఎస్ఆర్), జూనియర్ రెసిడెంట్స్(జేఆర్)ల భర్తీకోసం నోటిఫికేషన్ విడుదలైంది. శ్రీకాకుళం, ఒంగోలు, కడప, అనంతపురం, నెల్లూరు జిల్లాలోని పోస్టులను భర్తీ చేయనున్నట్లు డీఎంఈ అధికారులు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ రెండు పోస్టులకు నవంబరు 4, 11తేదీల్లో ఉదయం 11నుంచి 1గంట వరకూ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పీజీ పూర్తిచేసి, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అందించిన ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, అలాగే డీఎన్‌బీ అభ్యర్థులకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి నుంచి అన్ని మెడికల్ కాలేజీల్లో ఎంసీఐ తనిఖీలు ప్రారంభమవుతున్నాయి. ఈ సమయంలో ఎస్ఆర్, జేఆర్‌లు లేకపోతే సీట్లు రద్దయ్యే ప్రమాదం ఉండటంతో అధికారులు తాజా నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇదిలా ఉండగా, జూనియర్ వైద్యులు, ఎస్ఆర్, జేఆర్‌లకు ప్రస్తుతం ఇస్తున్న స్టైఫండ్ చాలా తక్కువగా ఉంది. తెలంగాణలో ఎస్ఆర్‌కు రూ.70వేలకు పైగా ఇస్తుండటంతో చాలామంది విద్యార్థులు ఎన్‌వోసీలు తీసుకుని వెళ్లిపోతున్నారు. దీంతో రాష్ట్రంలో ఎస్ఆర్, జేఆర్‌ల కొరత తీవ్రమైంది. తెలంగాణ తరహాలోనే ఏపీలో కూడా స్టైఫండ్ పెంచాలని జూనియర్ వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

# డెంగీ దడ

(మొదటి పేజీ తరువాయి)

కావలి మండలం రుద్రకోటలో వీఆర్‌వో మాల్యాద్రి భార్య లక్ష్మమ్మ డెంగీ బారినపడ్డారు. వైద్యం అందిస్తుండగానే ఆమె మరణించారు. ఆ తరువాత కొద్దిరోజులకే ఆ మాయదారి రోగం వీఆర్‌వోకూ వచ్చింది. ఆయన చెన్నైలో చికిత్స చేయించుకొని ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇదే జిల్లా కలిగిరి మండలం గుడ్లదొన గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు డెంగీతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలోని పీహెచ్‌సీలు, జిల్లా ప్రభుత్వ వైద్యశాలలు, ప్రాంతీయ ఆస్పత్రులు మొదలు ప్రైవేటు ఆస్పత్రుల దాకా.. డెంగీరోగులతో నిండిపోతున్నాయి. మూడు నెలలుగా వందలాది కేసులు నమోదవుతున్నాయి. పదుల సంఖ్యలో కడతేరిపోతున్నారు. అయినా రాష్ట్రంలో డెంగీ మరణాలే లేనే లేవని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ వైఖరితో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలే విభేదిస్తుండటం గమనార్హం. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులకు కొదవ లేదు. వేల కోట్ల రూపాయలు ఏటా ఈ ఆస్పత్రులపై ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. కానీ, ఆపదలో ఆదుకొని, ఆయువు నిలిపే వ్యవస్థ ఇక్కడ పెద్దగా అందుబాటులో లేదు. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టానుసారం బిల్లు వేస్తున్నాయి. డెంగీ నిర్ధారణ పరీక్షలకే రూ.మూడు వేలు నుంచి రూ. ఐదు వేలు తీసుకొంటున్నారు. పాజిటివ్‌గా తేలితే వైద్యానికి రూ. 30నుంచి రూ. 50వేలు వరకు బిల్లు వేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డెంగీ రోగ నిర్ధారణ పరీక్ష(ఎలీజా) చేయాలంటే కాకినాడ జీజీహెచ్‌లోనే ల్యాబ్ ఉంది. డెంగీ రోగుల తాకిడి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువగా ఉండటానికి ఇదే కారణం. అయితే, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదయిన వాటినే ప్రభుత్వం డెంగీ కేసులుగా గుర్తిస్తోంది. ఉదాహరణకు విశాఖ కేజీహెచ్‌లోని బయోకెమిస్ట్రీ విభాగంలో పాజిటివ్ వచ్చిన కేసులనే ప్రభుత్వం డెంగీగా పరిగణిస్తూ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నవారిని లెక్కలోకి తీసుకోవడం లేదు.

### చనిపోతున్నా.. లెక్కే లేదు!

డెంగీ అనుమానిత కేసులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీసుకొంటున్నారు. పాజిటివ్ అని తేలితే ఎంతోకొంత వైద్యం అందిస్తున్నారు. ఆ కేసుల్లో ఎవరైనా మరణిస్తే అంతా ఆ వివరాలు నమోదు కాకుండా జాగ్రత్త పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో గడిచిన నెలన్నర రోజుల్లో దాదాపు ఆరుగురు డెంగీతో మృతి చెందారు. అయినా, ఒక్క మరణాన్నీ వైద్య ఆరోగ్య శాఖ గుర్తించ లేదు. ప్రకాశం జిల్లాలో ముగ్గురు విషజ్వరంతో చనిపోగా, అవి మరణాలే కానట్టు వ్యవహరిస్తున్నారు. కడప జిల్లాలోని రాయచోటి, గాలివీడు, సంబేపల్లె, సుండుపల్లె, రైల్వేకోడూరుల్లో చోటుచేసుకొన్న తొమ్మిది మరణాలను అధికారికంగా గుర్తించడానికి నిరాకరిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో12 మంది మరణించినట్లు ప్రైవేటు ఆసుపత్రుల వర్గాలు చెబుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రూరల్ మండలంలో ఈనెల 28న వైసీపీ కార్యకర్త డెంగీతో మరణించినా, అనుమానిత కేసుగానే పరిగణిస్తున్నట్టు సమాచారం. గుంటూరు జిల్లాలో రోజూ ఐదారు మంది జ్వరంతో మృతి చెందుతున్న సంఘటనలు రెండు నెలలుగా నమోదౌతున్నాయి. కనీసం యాభై మంది జ్వరం కారణంగా మృతి చెందారు. వీరిలో ఎక్కువమందిలో డెంగీ లక్షణాలు కనిపించాయని ప్రైవేటు ఆస్పత్రులు చెబుతున్నాయి. కానీ, ఒక్క డెంగీ మరణాన్నీ ఈ జిల్లాలో అధికారులు నమోదు చేయలేదు.

### 'జీరో' జిల్లాలో చిన్నారి మృతి

కర్నూలు జిల్లా డోన్ ప్రాంతంలోని కామగానికుంట్ల గ్రామానికి చెందిన వైష్ణవి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతోంది. దసరా సెలవులకు గ్రామానికి వెళ్లి డెంగీ బారిన పడింది. కర్నూలులో వైద్యం అందిస్తుండగానే, వారం క్రితం చనిపోయింది. ఇలాంటి కేసులను ప్రభుత్వం కప్పిపుచ్చుతున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైష్ణవి మరణం సంభవించిన డోన్‌ను జీరో డెంగీగా నమోదు చేయడం..ఈ సందేహాలను బలపరుస్తోంది.

### బలైన బాల..య్య నటుడు

టీవీ ఆర్టిస్టుగా పేరు తెచ్చుకొన్న మాస్టర్ గోకుల్ సాయికృష్ణను డెంగీ బలిగొంది. టీవీ షోల్లో నటుడు బాలయ్య డైలాగులు, అభినయంతో సాయికృష్ణ గుర్తింపు పొందాడు. మదనపల్లెకి చెందిన ఈ చిన్నారి కొద్దిరోజుల క్రితం డెంగీ బారిన పడ్డాడు. బెంగళూరులో వైద్యం పొందుతూ చనిపోయాడు.

### జ్వరం పట్టిన జిల్లాలు..

విశాఖ జిల్లాలో ఇప్పటివరకు 809 మంది ఆస్పత్రుల్లో చేరగా, ఈ నెలలోనే 322 కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకూ కర్నూలు జిల్లాలో 60, ప్రకాశం జిల్లాలో 170, కడప జిల్లాలో 75 డెంగీ కేసులు నమోదయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం చిత్తూరు జిల్లాలో 141 మంది డెంగీ చికిత్స పొందుతున్నారు. ఇందులో 16 మంది చిన్నారులే. తూర్పుగోదావరి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 24 వరకు 471 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

## వరుసగా డెంగీ దాడి..

▸▸ **విశాఖలో వైద్యురాలు మృతి**

▸▸ **గుంటూరులో యూరాలజిస్ట్ మృత్యువాత**



డాక్టర్ వందన

విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వందన (50) డెంగీతో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. కొద్దిరోజులు కిందటే ఈ వ్యాధికి చికిత్స చేయించుకోవడంతో కోలుకున్నారు. మళ్లీ జ్వరం రావడంతో ఈ నెల 23న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. డెంగీగా నిర్ధారించి, చికిత్స ప్రారంభించిన గంటల వ్యవధిలో పరిస్థితి విషమించింది. వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించినా ఫలితం లేదు. కిడ్నీ ఫెయిల్యూర్ అయినట్టు వైద్యులు గుర్తించి డయాలసిస్ ప్రారంభించారు. శరీరంలో అంతర్గత రక్తస్రావం జరిగి బుధవారం సాయంత్రం మృతిచెందారు. వందన కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల నుంచి ఈ ఏడాది జూలైలో జరిగిన బదిలీల్లో కేజీహెచ్‌కు వచ్చారు. ఆమె స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట. అలాగే, డెంగీ జ్వరంతో గుంటూరు నగరానికి చెందిన యూరాలజిస్ట్, ఐఎంఏ నగర మాజీ అధ్యక్షుడు డాక్టర్ అలపర్తి లక్ష్మయ్య 20రోజుల క్రితం మృతి చెందారు.

# ఆంధ్ర హైకోర్టు జడ్జిగా జస్టిస్ రాకేశ్‌కుమార్

▸▸ **పట్నా హైకోర్టు నుంచి బదిలీ**

▸▸ **3 హైకోర్టుల సీజేలు కూడా**



న్యూఢిల్లీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాకేశ్ కుమార్ ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేయడంతో బుధవారం ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చేనెల 13లోపు బాధ్యతలు స్వీకరించాలని పేర్కొంది. కాగా.. మూడు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను, మరో ముగ్గురు న్యాయమూర్తులను బదిలీ చేసినట్లు న్యాయశాఖ తెలిపింది. పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అమరేశ్వర్ ప్రతాప్ సాహిని మద్రాసు హైకోర్టు సీజేగా, త్రిపుర హైకోర్టు సీజే సంజయ్ కరోల్‌ను పట్నా హైకోర్టుకు, మేఘాలయ హైకోర్టు సీజే జస్టిస్ అజయ్‌కుమార్ మిత్తల్‌ను మధ్యప్రదేశ్ సీజేగా బదిలీచేశారు. మధ్యప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక సీజేగా ఉన్న జస్టిస్ సంజయ్ యాదవ్‌ను పంజాబ్-హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. పంజాబ్-హరియాణా సీజే జస్టిస్ అమిత్ రావల్‌ను కేరళ హైకోర్టుకు బదిలీ చేశారు.

### 12 ఏళ్లు సీబీఐకి స్టాండింగ్ కౌన్సిల్

జస్టిస్ రాకేశ్‌కుమార్ 1959 జనవరి 1న జన్మించారు. ఎల్ఎల్‌బీ పట్టభద్రుడైన ఆయన.. 1983 మార్చి 8న న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. పట్నా హైకోర్టులో 26ఏళ్ల పాటు పనిచేశారు. 12ఏళ్ల పాటు సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించి పలు కీలక కేసులు చేపట్టారు. బిహార్ ప్రభుత్వ న్యాయవాదిగా అక్కడి హైకోర్టులో పనిచేశారు. అకౌంటెంట్ జనరల్, బీఎస్ఎన్ఎల్‌తో పాటు కేంద్ర ప్రభుత్వానికి అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. 2009 డిసెంబరు 25న పట్నా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన.. 2011 అక్టోబరు 24న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

## లోకం తీరు




పేదరికం గురించి పీజీ వరకు చదివాను సార్... ఇప్పుడు టీ అమ్ముకుంటున్నా...!

### వానా కాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 21.6 | 29.1 |
| కడప | 22.0 | 31.0 |
| ఒంగోలు | 22.7 | 26.5 |
| అనంతపురం | 23.0 | 31.0 |
| ఏలూరు | 23.0 | 32.0 |
| శ్రీకాకుళం | 24.0 | 32.0 |
| నెల్లూరు | 24.2 | 27.2 |
| విశాఖపట్నం | 24.6 | 32.2 |
| విజయవాడ | 25.0 | 30.4 |
| గుంటూరు | 25.2 | 31.2 |



## అయోధ్య కేసు ప్రపంచంలోనే అతి ముఖ్యమైనది

అయోధ్య భూ వివాదం కేసు చాలా ముఖ్యమైనది. ప్రపంచంలోనే కీలకమైనది. ప్రపంచ వ్యాప్తంగా అతి ముఖ్యమైన కేసుల్లో ఒకటి. రాజ్యాంగ పరమైన అంశాలను పరిష్కరించడానికి త్వరలోనే ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. జడ్జిల పదోన్నతి, బదిలీలకు సంబంధించి కొలీజియం జరిపే చర్చలన్నీ బహిరంగపరచాలన్న వాదనలతో నేను ఏకీభవించలేను.

**- సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎస్ఏ బోబ్డే**



## అయోధ్య తీర్పును అందరూ ఆమోదించాలి

రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై సుప్రీం కోర్టు త్వరలో ఇచ్చే తీర్పుని దేశంలోని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తి గా అంగీకరించాలి. అయోధ్యపై ఎలాంటి తీర్పు వచ్చినా దానికి కట్టుబడి, మతసామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

**- ఆరెస్సెస్**



## ఊబకాయాన్ని మిరప ఎలా తగ్గిస్తుందంటే!

న్యూఢిల్లీ, అక్టోబరు 30: మిరపకాయల్లో ఉండే కప్సయ్‌సిన్ అనే పదార్థం శరీరంలోని కొవ్వును కరిగించి, ఊబకాయాన్ని నిరోధిస్తుందని తెలుసు. అయితే ఇది ఎలా పనిచేస్తుందో భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. కప్సయ్‌సిన్ శరీరంలోని ఒబెస్టాటిన్ అనే హార్మోన్‌పై ప్రభావం చూపిస్తుందని, జీర్ణక్రియను వేగవంతం చేస్తుందని వారు తెలిపారు. తద్వారా మనం తీసుకొనే ఆహారంపై నియంత్రణ ఏర్పడుతుందని చెప్పారు. కప్సయ్‌సిన్, ఒబెస్టాటిన్ రెండింటినీ కలిపి ఒకేసారి తీసుకొన్నప్పుడు శరీరంలో కొవ్వు కరిగే వేగం పెరుగుతుందని వారు వెల్లడించారు.

## జీర్ణక్రియను ప్రభావితం చేసే నిద్ర

వాషింగ్టన్, అక్టోబరు 30: శరీరం పోషకాలను గ్రహించే సామర్థ్యానికి, నిద్రకు మధ్య సంబంధం ఉంటుందని శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో తేలింది. చాలినంత నిద్ర లేకపోతే ఆ ప్రభావం మెదడు పనితీరుతో పాటు, జీర్ణక్రియ మీద కూడా పడుతుందని ఈ అధ్యయనం నిర్వహించిన పరిశోధకులు తెలిపారు. తద్వారా రోగనిరోధక శక్తి తగ్గిపోవడం, మానసిక సమస్యలు, పార్కిన్సన్ లాంటి తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

# ఏసీబీ తప్పటడుగు


రవీంద్రనాథ్

## విశాఖలో మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ బదిలీకి కుట్ర





1. డబ్బులు కనిపించకుండా చేయి అడ్డం పెట్టుకున్న సీఐ గఫూర్
2. రికార్డు రూములో డబ్బులు పెట్టడానికి కానిస్టేబుల్ ప్రయత్నం

- ఆకస్మిక తనిఖీకి బయట నుంచి డబ్బు తెచ్చిన సీఐ
- సబ్ రిజిస్ట్రార్ బదిలీకి డీఐజీ ఆఫీసుకెళ్లి ఒత్తిడి
- ఓ డీఎస్పీ స్థలం రిజిస్ట్రేషన్ గొడవే కారణం!
- రిజిస్ట్రేషన్ల డీఐజీ రవీంద్రనాథ్ సస్పెన్షన్

విశాఖపట్నం, అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఏసీబీ అధికారులు తప్పటడుగు వేశారు. తమ మాట లెక్కచేయడం లేదని మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ టి.తారకేశ్‌ను అక్కడి నుంచి బదిలీ చేయించేందుకు వారు పన్నిన కుట్ర సీసీటీవీలో రికార్డవడంతో గుట్టు రట్టైంది. ఈ నెల 9న ఏసీబీ అధికారులు మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆ రోజు రికార్డు రూములో, డాక్యుమెంట్ రైటర్ల దగ్గర రూ.1.05 లక్షల నగదు దొరికిందని విశాఖ ఏసీబీ డీఎస్పీ కె.రంగరాజు ప్రకటించారు. తారకేశు విధులను వదిలేసి మధ్యలో వెళ్లిపోతున్నారని, తమ దగ్గర ఆధారాలున్నాయని కూడా పేర్కొన్నారు. ఈ విషయాలన్నీ ఆ శాఖ ఉన్నతాధికారులకు పంపుతామని, వారు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. అయితే, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రవీంద్రనాథ్ సెలవులో ఉండడంతో వారు ఊహించినట్టు జరగలేదు. దీంతో ఆయన రాగానే 14వ తేదీన ఇద్దరు ఏసీబీ అధికారులు డీఐజీ కార్యాలయానికి వెళ్లారు. తారకేశ్‌ను అక్కడి నుంచి బదిలీ చేయాలని కోరారు. ఏసీబీ అధికారులు ఎదురుగా కూర్చొని ఒత్తిడి చేయడంతో ఆయన తారకేశ్‌ను అప్పటికప్పుడు శ్రీకాకుళం జిల్లా టెక్కలికి బదిలీ చేశారు. తనకు జరిగిన అన్యాయంపై తారకేశ్ నేరుగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్లశాఖ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు సుదీర్ఘ లేఖ రాశారు. ఏసీబీ తనిఖీల రోజున కార్యాలయంలో సీసీ టీవీ పుటేజీని కూడా ఆ లేఖతో పంపించారు. దీంతో తారకేశ్‌ను బదిలీ చేయకూడదని డీఐజీ రవీంద్రనాథ్‌ను మంత్రి ఆదేశించడంతో బదిలీ ఆదేశాలను అబెయెన్స్‌లో పెట్టేశారు. అయితే అప్పటికే బదిలీ వార్తలు పత్రికల్లో వచ్చేశాయి. కానీ తారకేశ్ ఆ కార్యాలయంలోనే ఇంకా పనిచేస్తుండడంతో ఏసీబీ అధికారులకు, డాక్యుమెంట్ రైటర్లకు మింగుడుపడలేదు. ఈ నేపథ్యంలో తారకేశ్ దగ్గర భారీగా లంచం తీసుకొని బదిలీ ఆపేశారని కొంతమంది ప్రచారం మొదలుపెట్టారు. ఇందులో మంత్రికీ వాటా ఉందని ప్రచారం చేశారు. ఈ పంచాయితీ మొత్తం అమరావతికి చేరడంతో మంత్రి సీరియస్ అయ్యారు. డీఐజీ రవీంద్రనాథ్ కూడా ఏసీబీ అధికారులతో కుమ్మక్కయినట్టు భావించి ఆయన్ని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

### సీసీ కెమెరాలు ఆపేయించినా..

ఆకస్మిక తనిఖీలకు వచ్చిన ఏసీబీ సీఐ గఫూర్ మధ్యాహ్నం 1.30 గంటలకు కార్యాలయంలోని సీసీటీవీ కెమెరాలను ఆపేయించారు. అయితే అవి 24/7 రికార్డింగ్ కెమెరాలు. ఆపినా ఆగవు. ఆ విషయం వారికి తెలియక రికార్డింగ్ అవడంలేదనుకుని వారికి నచ్చినట్టు వ్యవహరించారు. సీఐ గఫూర్ బయటకు వెళ్లి, అక్కడ డాక్యుమెంట్ రైటర్ నారాయణరావు దగ్గర డబ్బులు తీసుకొచ్చారు. రికార్డుల గదిలో నుంచి ఓ కానిస్టేబుల్ తీసుకొచ్చిన ఓ పుస్తకంలో ఆ డబ్బు పెట్టించారు.

### తెరవెనుక డాక్యుమెంట్ రైటర్

మధురవాడలో సీనియర్ డాక్యుమెంట్ రైటర్‌గా నారాయణరావు చలామణి అవుతున్నారు. ఆయనపై ఫోర్జరీ కేసులున్నాయి. ఆయన ఎటువంటి డాక్యుమెంట్ తెచ్చినా రిజిష్టర్ చేయాల్సిందే. అయితే, తారకేశు అక్కడ బాధ్యతలు చేపట్టిన తరువాత అన్ని పత్రాలు సక్రమంగా వుంటేనే రిజిష్టర్ చేస్తున్నారు. దాంతో నారాయణరావు ఆదాయం గత మూడు నెలల్లో బాగా పడిపోయింది. దాంతో కక్ష గట్టి ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారులు తిరిగి బయటకు వెళ్లిపోతున్నప్పుడు నారాయణరావు వారి కారుకు అడ్డంపడి తమ డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని గొడవ చేశాడు.

### దోపిడీ దొంగలే నయం

- పిల్లి సుభాష్‌చంద్రబోస్

**విశాఖ** ఏసీబీ అధికారుల తీరు కంచే చేను మేసినట్లుగా ఉందని ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'విశాఖ ఏసీడీ డీఎస్పీ, సీఐ, కానిస్టేబుళ్ల కన్నా దారి దోపిడీ దొంగలే చాలా బెటర్' అన్నారు. వారిని వెంటనే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. 'ఏమిటీ అన్యాయం? సామాన్యులు తప్పు చేస్తే క్రిమినల్ కేసులు ఎలా పెడతారో ఇక్కడ తప్పు చేసిన ఏసీబీ అధికారులపైనా కేసులు నమోదు చేయాలి' అన్నారు. ఈ ఘటనను బట్టి ఏసీబీ అధికారులు అమాయకులను కూడా బుక్ చేస్తున్నారేమో అనిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఘటనపై ఇప్పటికే హోంమంత్రికి వివరించామని చెప్పారు. ఏసీబీ అధికారులు చెప్పిందే తడవుగా సబ్ రిజిస్ట్రార్‌ను బదిలీ చేసిన రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రవీంద్రనాథ్ కుట్ర కూడా ఇందులో ఉండొచ్చన్నారు.

### మామూళ్లు నిరాకరించినందుకే..



**ఏసీబీ** అధికారులకు ఇంతకు ముందు నెలకు రూ.50 వేలు మామూళ్లుగా ఇచ్చేవారట. ఆ విషయం నాకు తెలియదు. నేను వచ్చి మూడు నెలలవుతోంది. నన్ను కూడా నెలనెలా డబ్బులు పంపాలని ఆ శాఖ తరఫున కొందరు వచ్చి అడిగారు. మేము లంచాలు తీసుకోవడం లేదని, ఎవ్వరికీ మామూళ్లు ఇవ్వలేమని చెప్పేశాను. పది రోజుల తర్వాత పర్యావరణ వారోత్సవాలకు ఏసీబీ డీఎస్పీ డబ్బులు అడిగారంటూ కొందరు వచ్చారు. ఇవ్వలేమని చెప్పి పంపేశాను. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఆ కోపంతోనే నన్ను ఇరికించాలని ప్రయత్నించారు. తనిఖీల రోజు జూనియర్ అసిస్టెంట్‌ను బయటకు తీసుకువెళ్లిపోయారు. రెండు గంటలు బాగా కొట్టి, లంచాలు తీసుకుంటున్నట్టు ఒప్పుకోవాలని ఒత్తిడి తెచ్చారు.

-టి.తారకేశు, సబ్‌రిజిస్ట్రార్

### అసలు కారణం ఇదీ..

ఏసీబీలోనే పనిచేస్తున్న ఓ డీఎస్పీ మధురవాడ పరిధిలో ఓ స్థిరాస్తి కొనుగోలు చేశారు. దానిని రిజిస్ట్రేషన్‌కు పంపుతున్నామని, చేసి పెట్టాలని తారకేశ్‌ను కోరారు. తీరా ఆ సర్వే నంబరు ప్రభుత్వ భూముల జాబితా 22-ఏలో ఉంది. కుదరదని తారకేశ్ వెనక్కి పంపించేశారు. వారం తరువాత అదే డాక్యుమెంట్ ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద నగరంలోని మరో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మధురవాడకు వచ్చింది. అందులో సర్వే నంబరు మార్చేశారు. దాని ప్రకారం ఆ సర్వే నంబరుపై ఎటువంటి అభ్యంతరాలు లేవని తారకేశు సమాచారం పంపడంతో రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. తమకు కూడా పనులు చేయరా? అనే ఇగో ఫీలింగ్‌తోనే ఏసీబీ అధికారులు ఇలా ఆకస్మిక తనిఖీలంటూ కుట్ర చేసి అడ్డంగా బుక్ అయిపోయారు.

## నేడు శారదా పీఠాధిపతి జన్మదినం

- వేడుకలకు హాజరుకానున్న గవర్నర్

పెందుర్తి, అక్టోబరు 30: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి జన్మదిన వేడుకలు గురువారం చినముషిడివాడలోని పీఠంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. పీఠాధిపతి జన్మదిన వేడుకలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పీఠం శ్రీకార్యం తెలిపింది. శారదాపీఠం, శారదా పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్మదిన వేడుకలను ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షిస్తున్నారు.



**AP CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
**E PROCUREMENT TENDER NOTICE**
NIT No. 14/PROC(19)/MAU61-ADMN0SD(VI)/18/2019-SD Dated. 26.10.2019
Name of Work: "Operation and Maintenance of Street Lighting for the Reaches (1) from IGC to Malkapuram Junction, (2) Mandadam to Krishnayapalem (3) Krishnayapalem to Yerrabalem (4) Krishnayapalem to Penumaka, (5) Undavalli to Penumaka, (6) from 'Chief Minister's Residence to KWD Regulator and (7) from 'Chief Minister's Residence to Mandadam - Krishnayapalem Road via Venkatapalem (8) from Krishnayapalem to IGC (Z Road) - (9) High court Nelapadu to Y junction Rayapudi for the year 2019-20"- ECV - Rs. 32,02,340/-.
The bid can be downloaded on AP e-procurement portal from 31.10.2019 to 19.11.2019 up to 14.00 Hrs. Due date for submission of Bid 19.11.2019 up to 15.00 Hrs, Technical bid opening 19.11.2019 @16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA

**VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)**
**'e' PROCUREMENT NOTICE**
No. Rc. E9-136216/2019 Dt. 30-10-2019

| Sl. No. | Name of Work | Estimate Amount (in Rupees) |
|---|---|---|
| 1 | Supply and fixing of Firefighting equipment to VMC Main Office 3 Circle offices & 33 Community Halls in Vijayawada Municipal Corporation | 7,30,000/- |
| 2 | Supply and Fixing of Firefighting Equipment to 29 high Schools & 77 Primary Schools in Vijayawada Municipal Corporation | 16,60,000/- |
| 3 | Supply, Delivery and Installation of 6000 LPH Capacity RO Plant at Head Water Works | 13,00,000/- |

Contact : Executive Engineer P.D-II, VMC, Vijayawada - 520 001.
Further details can be seen@ 'e'procurement market place @ www.tender.apeprocurement.gov.in
Download of bid documents starts 31-10-2019 @ 3.30 P.M
Last date / time for receipt of Tenders 14-11-2019 upto 4.00 PM.
EXECUTIVE ENGINEER, P.D-II







## తాళి కట్టిన వాడే చేతులు నరికేశాడు!

రైల్వేకోడూరు, అక్టోబరు 30: భార్య ప్రవర్తన సరిగా లేదంటూ తరచూ ఘర్షణపడుతూ చివరికి ఆమె చేతులు నరికేశాడో భర్త. కడప జిల్లా రైల్వేకోడూరు మండలం లక్ష్మీగార్డెన్స్‌లో మంగళవారం రాత్రి జరిగిన సంఘటనకు సబంధించి స్థానికులు తెలిపిన వివరాలు...లక్ష్మీగార్డెన్స్ గ్రామానికి చెందిన గిరిజనుడైన చౌడవరం శివయ్యకు ఐదుగురు పిల్లలు. ఐదో కాన్పు సమయంలో మొదటి భార్య కమల మృతిచెందింది. దీంతో అతను నాలుగేళ్ల క్రితం పద్మావతిని రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు కూడా ఇది రెండో వివాహం. వీరికి పిల్లలు లేరు. పద్మావతికి వివాహేతర సంబంధాలు ఉన్నాయంటూ శివయ్య పెద్ద మనుషుల వద్ద పంచాయితీ నిర్వహించాడు. అయినా ఆమెలో మార్పు రాలేదంటూ తరచూ భార్యతో ఘర్షణపడేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం కనిపించకుండా వెళ్లి రాత్రి వేళలో పద్మావతి ఇంటికి వచ్చింది. ఆగ్రహానికి గురైన శివయ్య భార్యపై కత్తితో దాడి చేసి కుడిచేతిని పూర్తిగా నరికేశాడు. ఎడమ చేతిని కూడా తీవ్రంగా గాయపరిచి పారిపోయాడు. స్థానికుల సమాచారంతో రైల్వేకోడూరు ఎస్సై-2 వెంకటనరసింహం సిబ్బందితో వెళ్లి గాయపడిన పద్మావతికి వైద్య సేవలు చేయించారు. అనంతరం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విశాఖ-సికింద్రాబాద్ మధ్య 2నుంచి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య వారాంతపు ప్రత్యేక రైలు నడపాలని తూర్పు కోస్తా రైల్వే నిర్ణయించింది. ఈ రైలు నవంబరు రెండవ తేదీ నుంచి 30వ తేదీ వరకు నడుస్తుంది. ట్రైన్ నంబర్ 08521 విశాఖలో ప్రతి శనివారం 10.50 గంటలకు బయలుదేరుతుంది. మరుసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. తిరుగుపయనంలో నంబర్ 08522 సికింద్రాబాద్‌లో ప్రతి ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 4.50 గంటలకు విశాఖ చేరుతుంది. నవంబరు 3వ తేదీ నుంచి డిసెంబరు ఒకటవ తేదీ వరకు ఈ రైలు అందుబాటులో ఉంటుంది.

## 5న సీఎంల సమావేశానికి రండి

- జగన్‌కు కేరళ సీఎం ఆహ్వానం

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శబరిమలలోని శ్రీధర్మశాస్త దేవాలయంలో నవంబరు 17 నుంచి మండల, మకరవిల ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పన, ఇతర అంశాలపై చర్చించేందుకు నవంబరు 5న తిరువనంతపురంలో ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి కేరళ సీఎం పినరయి విజయన్ ఆహ్వానం పంపారు.

### డిసెంబర్ 6న 'సెరికల్చర్ ఆఫీసర్స్' ఇంటర్వ్యూలు

అమరావతి, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): సెరికల్చర్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీ కోసం ఈ ఏడాది మే 28,29 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన మెయిన్స్ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు డిసెంబర్ 6న ఇంటర్వ్యూలు జరుగుతాయని ఏపీపీఎస్సీ సెక్రెటరీ పీఎస్ఆర్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్స్ ఫలితాల నోటిఫికేషన్ https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ఆయన పేర్కొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నాగార్జునరెడ్డి

సింహాద్రిపురం, అక్టోబరు 30: అప్పుల బాధకు మరోరైతు బలయ్యాడు. కడప జిల్లా సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామానికి చెందిన అన్నవరం నాగార్జునరెడ్డి (48) తనకున్న 4 ఎకరాల పొలం సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఏటా సాగులో నష్టాలు చవి చూస్తున్నాడు. దీనికితోడు గతంలో అదే పొలంలో చీనీ చెట్లు సాగుచేసి వాటిని దక్కించుకోవడం కోసం పలుమార్లు బోరుబావులు తవ్వి లక్షలు వెచ్చించాడు. అయినా బోరుబావుల్లో నీరు రాకపోవడంతో చీనీ చెట్లు ఎండిపోయాయి. అప్పటి నుంచి పంటల దిగుబడి లేక చేసిన అప్పులు తీర్చలేక వడ్డీలు పెరిగి దిక్కుతోచని పరిస్థితుల్లో బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

## శ్రీశైలం 2 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటివిడుదల

శ్రీశైలం, అక్టోబరు 30: శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద స్వల్పంగా తగ్గడంతో 2 క్రస్ట్‌గేట్ల ద్వారా మాత్రమే నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు, నీటి నిల్వలు 215.8070 టీఎంసీలు. బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి 884.60 అడుగులు, జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 213.4011 టీఎంసీలుగా నమోదయ్యాయి. జలాశయానికి 1,28,866 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కుడి, ఎడమగట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ జలాశయం నుంచి 73,045 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. డ్యాం 2 రేడియల్ క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 55,782 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి 1,84,429 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.

# 11 వేల కోట్లు కావాలి

*20 వేల ఎకరాలు సేకరించాలి.. ఇళ్ల స్థలాల ఖర్చుపై రెవెన్యూశాఖ నివేదిక*

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవరత్నాలులో భాగంగా 'పేదలందరికీ ఇళ్లు' పథకం బడ్జెట్ భారీగా పెరిగిపోతోంది. ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే రెట్టింపు స్థాయికి చేరుకుంటోంది. రెవెన్యూశాఖ తాజా అంచనాల ప్రకారం, కేవలం భూసేకరణ కోసమే రూ.11వేల కోట్లపైగా నిధులు అవసరమని తేలింది. తాజాగా జరిగిన సమావేశంలో రెవెన్యూశాఖ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. తొలుత భూ సేకరణ ఖర్చు రూ.7వేల కోట్లు ఉండొచ్చని రెవెన్యూశాఖ అంచనావేసింది. దీంతో ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.5వేల కోట్లను ప్రభుత్వం కేటాయించింది. తాజా గణాంకాలను పరిశీలిస్తే టార్గెట్‌ను అందుకోవడానికి అదనంగా మరో రూ.6వేల కోట్లకుపైగా సమకూర్చాల్సి ఉంటుందని తేలింది. భూసేకరణ ఖరీదైన ప్రక్రియగా మారుతున్న నేపథ్యంలో భూమి సమీకరణ(ల్యాండ్ పూలింగ్) చేపట్టాలని ప్రభుత్వం ఇప్పటికే జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. అయితే, ఇది ఆశించిన ఫలితాలు ఇస్తుందా? లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలావుంటే, ఇళ్లు కావాలంటూ కొత్తగా మరో 3.43 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలిస్తే, ఇప్పటి వరకూ గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య పెరగొచ్చు. ఆ మేరకు సేకరించాల్సిన భూమి కూడా పెరగనుంది. జిల్లాల వారీగా ఇళ్లు కోరుతూ వచ్చిన దరఖాస్తులను రెవెన్యూశాఖ పలు దశల్లో వడపోస్తోంది. తాజా నివేదిక ప్రకారం 17,82,026 మంది అని తేల్చారు. ఇందులో పట్టణప్రాంతాల్లో 8,04,200, గ్రామాల్లో 9,77,826 మంది లబ్ధిదారులు. ఇళ్లస్థలాల కోసం ఇప్పటిదాకా 21,262 ఎకరాల భూమి ఉన్నట్లు రెవెన్యూశాఖ చెప్తోం ది. దేవదాయ, అసైన్డ్, ఇతర మార్గా ల్లో వచ్చిన భూమిని ఇందులోనే చూపిస్తున్నట్లుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంతాల్లో సెంటు భూమిని ఇంటిస్థలం కోసం ఇవ్వాలని ఇటీవలే ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో భూమి కొరత మరీ తీవ్రంగా ఉంటేనే బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు(జీ+3) నిర్మించాలని చెప్పింది. ఇప్పుడున్న లబ్ధిదారుల లెక్క ప్రకారం అందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నా, పట్టణాల్లో జీ+3 అపార్ట్‌మెంట్ల కోసం మొ త్తంగా 45వేల ఎకరాలపైనే భూమి కావాలి. ప్రభుత్వం వద్ద ఉన్నది 21,262 ఎకరాలే. దీంతో, ప్రైవేటు భూమిని కొనుగోలు చేయడం ద్వారానే ఎక్కువగా భూమిని సేకరించాల్సి ఉంది. భూముల కొనుగోలుకు కనీసం రూ.11వేల కోట్లపైనే ఖర్చు కానుందని తాజాగా సీఎంకు ఇచ్చిన నివేదికలో రెవెన్యూశాఖ పేర్కొంది.

### ఏ జిల్లాలో ఎంత?

**భూముల** ధరలను పరిగణనలోకి తీసుకుని వేసిన అంచనా ప్రకారం... కడప జిల్లాలో రూ.170 కోట్లు ఖర్చుకానుంది. ఇదే అతి తక్కువ. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో రూ.3293 కోట్లు ఖర్చుకానుందని రెవెన్యూశాఖ చెప్తోంది. కృష్ణాజిల్లాలో 1883 కోట్లు, గుంటూరు జిల్లాలో 1812 కోట్లు, పశ్చిమగోదావరిలో 1690 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ జరగనుందన్న వార్తల నేపథ్యంలో పట్టణం, పల్లె అనే తేడా లేకుండా భూముల ధరలు పెరిగిపోయాయి. పట్టణాల్లో భూములు కొనుగోలు చేసే పరిస్థితి లేదని చెబుతున్నారు. దీంతో, దాతలు, పెద్ద మనుషులను ఒప్పించి భూ సమీకరణ జరిగేలా చొరవ తీసుకోవాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు ఇచ్చింది

## నాటుసారా, గంజాయి నిషేధం అమలుకు చర్యలు

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 30 : రాష్ట్రంలో నాటుసారా, గంజాయి నిషేధం అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ పి.హరికుమార్ తెలిపారు. బుధవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 15 నుంచి నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అక్రమంగా బెల్టుషాపులు, నాటు సారా, గంజాయి కలిగి ఉంటే పీడీ యాక్టు ప్రయోగిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నాటుసారా విక్రయిస్తున్న వారిపై 1314 కేసులు నమోదు చేసి 851 మందిని అరెస్టు చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణా కింద 18 కేసులు నమోదు చేసి 36 మందిని అరెస్టు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 43 బార్లపై కేసులు నమోదు చేశామన్నారు. ఏజెన్సీలో సమస్యాత్మకంగా ఉన్న ఐదు మండలాలు పెద్దబాయిలు, ముంచుకుట్టు, చింతపల్లి, జి.మాడుగల, గూడెం కొత్తవీధి మండలాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

## నియామక పత్రాలు ఇచ్చారు సరే... పోస్టింగ్స్ ఏవీ?

- సచివాలయ పోలీస్ నియామకాల్లో గందరగోళం

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 30: తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ సచివాలయాల పోస్టుల నియామకానికి సంబంధించి గందరగోళం కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా మహిళా పోలీస్ అభ్యర్థుల నియామకాల్లో స్పష్టత కరువైంది. సుమారు 250 మందికి ప్రొవిజనల్ ఆర్డర్లు ఇచ్చినా పోస్టింగ్‌లు కేటాయించలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఈ సమస్యపై జడ్పీ అధికారులను కలిస్తే వారి నుంచి సమాధానం రాలేదు. తర్వాత కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అందరూ సమావేశమయ్యారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తి చేసి నియామక పత్రాలు అందజేసినా పోస్టింగ్‌లు కేటాయించలేదన్నారు. అధికారులకు విన్నవిస్తే బయటకు చెప్పవద్దని హెచ్చరిస్తున్నారని వాపోయారు. తమకు అధికారులు న్యాయం చేయాలని కోరారు.




## అతిథుల కితాబు

**కశ్మీర్‌లో** రెండురోజులపాటు పర్యటించిన యూరోపియన్ యూనియన్ ఎంపీల బృందం ప్రభుత్వం ఆశిస్తున్న రీతిలోనే చక్కని మాటలు చెప్పింది. భారత ప్రభుత్వ చర్యలకు సంపూర్ణంగా మద్దతు పలికింది. ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరును ప్రశంసించింది. కశ్మీర్‌లో తీవ్ర నిర్బంధం కొనసాగుతున్నట్టుగా అంతర్జాతీయ మీడియా దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో, ఈ పర్యటన తమ కళ్ళు తెరిపించిందన్నారు కొందరు. సిరియా, అఫ్ఘానిస్థాన్‌లను ప్రస్తావిస్తూ కశ్మీర్‌కు ఆ దుస్థితి పట్టనివ్వకూడదన్నారు మరికొందరు. ఈ పర్యటన తొలిరోజునే ఐదుగురు కార్మికులను మిలిటెంట్లు కాల్చిచంపడంతో ఆ ఘటననూ ఖండిస్తూ, మా భయమంతా ఈ ఉగ్రవాదం గురించే, ఆర్టికల్ 370 కేముంది, అది భారత్ అంతర్గత విషయం అని కూడా ప్రకటించారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను కోల్పోయి, కేంద్రపాలిత ప్రాంతాలుగా అవతరించబోతున్న ముందురోజు జరిగిన ఈ పర్యటన మోదీ ప్రభుత్వం ఆశిస్తున్న రీతిలో మిగతా ప్రపంచాన్ని ఎంత ప్రభావితం చేయగలదో చూడాలి.

కశ్మీర్‌కు పోనివ్వకుండా సొంత ఎంపీలను, రాజకీయనాయకులను అడ్డుకుంటున్న ప్రభుత్వం విదేశీ ఎంపీలను ఎందుకు పంపిందని విపక్ష నాయకుల ప్రశ్న. కశ్మీర్ భారత అంతర్గత అంశమని వాదిస్తూనే ఈ విదేశీయుల పర్యటనకు రెడ్‌కార్పెట్ పరవడం ఏమిటని వారి ప్రశ్న. కశ్మీర్‌లో పరిస్థితులు సజావుగా ఉన్నాయన్నప్పుడు ఇలా ఎంపిక చేసుకున్నవారినే ఎందుకు పంపుతున్నట్టు అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఇక, ఈ విదేశీ ఎంపీల సంఖ్య కూడా ఆదిలో అనుకున్నదానికంటే బాగా తగ్గి 23మంది మాత్రమే చివరకు పర్యటించారు. భారీ భద్రత మధ్య, సైనికాధికారులు, పోలీసు అధికారుల వివరణల మధ్య వారి పర్యటన సాగింది. మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో గెలిచిన కొందరు ఎంపిక చేసిన వ్యక్తులతో ముచ్చట్లు తప్ప స్థానిక ప్రజలను వీరు కలవలేదు. నియంత్రణ రేఖ సందర్శన, సైనిక ప్రధాన కార్యాలయంలో భేటీలు, చివరగా స్థానిక మీడియాకు ఆహ్వానంలేని విలేఖరుల సమావేశం ఈ పర్యటన ప్రధానాంశాలు. దాల్ సరస్సులో బోటింగ్ సందర్భంగా ఈ బృందం అతి సమీపంలో దాటిన సెంటార్ హోటల్‌లోనే 30మంది నాయకులు నిర్బంధంలో ఉన్నారు. రోడ్డుమీద కాస్తంత ట్రాఫిక్ ఉండేట్టు చూసేందుకు ఈ రెండు రోజులూ ప్రభుత్వం పరీక్ష వేళల్లో కొన్ని మార్పులు కూడా చేసింది.

ఈ పర్యటన ఎంపీల వ్యక్తిగత వ్యవహారమనీ, తనకు సంబంధం లేదని ఈయూ తేల్చేసింది. వచ్చిన ఎంపీల్లో కాస్త పేరున్నవారెవ్వరూ లేరనీ, అత్యధికులు మితవాద పార్టీలకు చెందినవారేనన్న విమర్శలూ ఉన్నాయి. తాను కశ్మీర్‌లో ఎక్కడైనా తిరగడానికీ, ప్రజలతో మాట్లాడటానికీ స్వేచ్ఛ ఇవ్వాలనీ, సైనికాధికారుల స్థానంలో స్వతంత్ర జర్నలిస్టులు తనతో రావాలని బ్రిటన్ ఎంపీ క్రిస్ డేవిస్ నిబంధనలు పెట్టడంతో అతడి ఆహ్వానం రద్దయింది. మీరు చెప్పిన చోట్లతో మాత్రమే తిరిగి 'ఆల్ ఈజ్ వెల్' అనేది లేదని గట్టిగా చెప్పడంతో తన పేరు తొలిగించారని ఆయన వాదన. ఇక, ఈ పర్యటనలో యూరప్‌కు లేదా కనీసం తమ దేశాలకు ప్రాతినిధ్యం వహించకుండా కేవలం వ్యక్తిగత హోదాలో ఎంపీలు జరిపిన ఈ పర్యటనవల్ల భారత్‌కు చేకూరే లబ్ధి ఏమిటో అర్థంకావడం లేదు. వారు తిరిగిపోయి అంతా సవ్యంగా ఉన్నదని ఏ నివేదికలూ ఇవ్వలేరు, అధికారిక హోదాలో చెప్పేది కూడా ఏమీ ఉండదు. కశ్మీర్‌లోకి విదేశీ ప్రతినిధులను అనుమతించడం లేదని అమెరికన్ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా విమర్శించిన నేపథ్యంలో, ఇలా ఎంపిక చేసుకున్న కొందరికి రెడ్ కార్పెట్ పరిచినంత మాత్రాన విశ్వాసం కలుగుతుందని అనుకోలేం. ఈ పర్యటన జరుగుతున్న నాడే ఐక్యరాజ్యసమితి కశ్మీర్ స్థితిగతులపై ఆందోళన వ్యక్తంచేస్తూ, ప్రజల హక్కులు కాపాడమని విజ్ఞప్తిచేసింది.

పాకిస్థాన్ దుష్ప్రచారాన్ని తిప్పిగొట్టేందుకు ఈ పర్యటన ఉపకరిస్తుందన్నది ప్రభుత్వ ఆలోచన కావచ్చు. కానీ, దీని తరువాత కశ్మీర్‌పై మిగతా ప్రపంచం దృష్టి మరింత పెరుగుతుందన్న వాదన కూడా ఉన్నది. తమనూ కశ్మీర్‌లో స్వేచ్ఛగా పర్యటించనివ్వమని అమెరికా, యూరప్ దేశాల ప్రతినిధులనుంచి విజ్ఞప్తులు వస్తే ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాలి. కశ్మీర్ అంతర్గత వ్యవహారమని ఇంతకాలమూ చేస్తున్న వాదన ఈ పర్యటనతో వీగిపోయి అది అంతర్జాతీయం అయిపోయిందన్న విమర్శలూ ఉన్నాయి. ప్రధానితో భేటీ, ఫైవ్‌స్టార్ ఆతిథ్యం వంటి భారీ నజరానాలతో, బ్రెజిల్‌కు చెందిన మాడి శర్మ ఆధ్వర్యంలో నడుస్తున్న ఒక ప్రభుత్వేతర సంస్థ ఆధ్వర్యంలో, మరో ఢిల్లీ సంస్థ ఖర్చులతో, విదేశాంగ శాఖకు సంబంధంలేకుండా సాగిన ఈ మొత్తం విన్యాసం కశ్మీర్ విషయంలో మరో తప్పటడుగు కారాదని కోరుకోవాలి.

## బాగ్దాదీ అంతం ఉగ్రవాదానికి ముగింపేనా?

**ఉ**గ్రవాదులైనా, తీవ్రవాదులైనా నాయకత్వం బలంగా వుంటేనే వారు తలపెట్టిన కార్యక్రమాలు చేయగలుగుతారు. 2014లో ఇస్లామిక్ స్టేట్ (ఐ.ఎస్.) పేరిట టెర్రరిస్టు సంస్థకు అధిపతిగా అవతరించిన అబూ బకర్ అల్–బాగ్దాదీ ఘోరంగా మరణించటంతో ఆ సంస్థ అంతరించినట్లుగా భావించవచ్చు. సంస్థాపక నాయకుడైన బాగ్దాదీ మరణం ఉగ్రవాద సంస్థను ఘోరంగా దెబ్బతీసినట్లుగానే భావించక తప్పదు. అంతర్జాతీయంగా భయంకర గుర్తింపును తెచ్చుకున్న యీ సంస్థ నాయకుడు ఒక మసీదులో (మోసల్ గ్రాండ్ అల్ నూరీ మాస్క్) వెలుగులోకి వచ్చి కొత్త 'కాలీఫాత్' అధినాయకుడిగా 2014లో తనను తాను ప్రకటించుకొని అగ్రదేశాలను ఒక్క ఊపు ఊపాడు. చివరకు యు.ఎస్. ప్రత్యేక సైనిక దళాలు యీ క్రూర నాయకుడిని సిరియా ప్రాంతంలో ఒక చిన్న గ్రామంలోని సొరంగంలో వెతికి వేటాడినప్పుడు తట్టుకోలేక తన వెంట వున్న కుమారులతో సహా భయంకరంగా కాల్చి చంపుకొని ఒక దారుణ హింసా శకానికి తెర దించాడు. అల్ బాగ్దాది చేతిలో దారుణ అత్యాచారానికి, చిత్రహింసలకు, తుట్టతుదకు హత్యకు గురైన అమెరికా మానవతా కార్యకర్త 'ఖైలా ముల్లర్‌ను యీ ఆపరేషన్‌కు పేరుగా పెట్టి డెల్టా ఫోర్స్‌గా పిలవబడే ప్రత్యేక దళం బాగ్దాదీని తుదముట్టించటంతో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్‌తోపాటు సన్నగిల్లుతున్న ఉగ్రవాద పోరాట చరిత్రలో కలిసిపోయాడు బాగ్దాదీ!

అల్‌ఖైదా అగ్రనాయకుడు బిన్‌లాడెన్‌కూ ఐ.ఎస్. అధినేత బాగ్దాదీకి తేడా వుంది. అల్‌ఖైదాకు భిన్నమైన విధానంతో రాజ్య విస్తరణనే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ఎన్నో దేశాల సమగ్రతను చావు దెబ్బ తీయాలనే దృక్పథంతో ఐ.ఎస్. పనిచేయటంతో ఆయా దేశాలు పొంచివున్న ముప్పుతో నానా యిబ్బంది పడటమేకాక, బాగ్దాదీ హింసాకాండతో దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డాయి. అదృష్టవశాత్తూ బాగ్దాదీ అంతం కావటంతో తీవ్ర దమనకాండను ఎదుర్కొన్న దేశాలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. మన దేశం మీద కూడా యీ సంస్థ కన్ను వేసింది. ఖురస్థాన్ యిస్లామిక్ రాజ్య స్థాపన లక్ష్యంగా గుజరాత్ సహా ఆ ప్రాంతమంతా ఆక్రమించుకోగలమని అయిదేళ్ళ క్రితమే ప్రకటించింది. అప్పుడే అల్‌ఖైదా కూడా బంగ్లాదేశ్, కశ్మీరు లాంటి ప్రదేశాలను తాము స్వాధీనపర్చుకోగలమని, బిన్ లాడెన్ చనిపోయిన తరువాత కూడా, ఐ.ఎస్. ప్రకటనకు పోటీగా చెప్పటం గమనార్హం.



విశ్వవ్యాప్తంగా విస్తరణ కాంక్షను వెల్లడించిన యీ ఉగ్రవాద సంస్థలను– బాధిత దేశాలతోపాటు బలంగా వున్న అమెరికా లాంటి దేశాలు గూడా, తమ స్వార్థ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికేది అవసరమో అదే చేయటంతో, పూర్తిగా అదుపు చేయలేకపోయాయి. పాకిస్థాన్‌లోనే కదా బిన్‌లాడెన్‌ను తుదముట్టించింది. వ్యూహాత్మక భాగస్వామిగా చాలాకాలం పాకిస్థాన్‌ను అమెరికా చూడటంతో ఉగ్రవాద చర్యలు, తాలిబన్ల హింస తారాస్థాయికి చేరుకున్నాయి. గత్యంతరంలేని పరిస్థితుల్లోనే బిన్ లాడెన్ హింసావాద చరిత్రను అమెరికా అంతమొందించగలిగింది. అదీ తమ స్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే అన్న విషయం అందరికీ తెలిసిందే!

> **అస్తవ్యస్త పరిస్థితుల్లో దారితప్పిన యువత మళ్ళీ సూదంటురాయి లాంటి మరో నాయకుడి మాటలకూ ఆకర్షణకూ లొంగితే, మరో ఉగ్రవాద సంస్థ ఈ పేర్లతోనో మరో పేరుతోనో ఉద్భవించి విశ్వవ్యాప్తంగా అశాంతిని రేపితే, పరిస్థితి యథాతథం! అందుకే అగ్రదేశాలతో సహా అన్ని దేశాలు యిప్పుడే బాగ్దాదీ అంతమొందిన వేళ సరియైన యుద్ధ ప్రణాళికలతో ఉగ్రవాదాన్ని తుదముట్టించే పనిలో పడాలి.**

బాగ్దాదీ కార్యకలాపాలను అదుపు చేసామని అమెరికా దేశం మార్చి నెలలో ప్రకటించిన తర్వాతనే చాలా చోట్ల ఐ.ఎస్. మారణ హోమానికి శ్రీలంక గురైంది. మిలిటెంట్ల తయారీ ఖురస్థాన్ స్థాపన కోసమే అని నమ్మిన యువకులు చాలామంది బాగ్దాదీ మాటలకు ఆకర్షితులై ఉగ్రవాదానికి చేయూతనిచ్చారు. సంస్థ వేళ్ళూని వటవృక్షంలా విస్తరించిన తర్వాత ఆ సంస్థ కార్యకలాపాలు నాయకులు చనిపోయినా కొన్నాళ్ళపాటే నిలవరించగలరు కానీ సంపూర్ణంగా తుదముట్టించలేరు. అగ్రదేశాల సమిష్టి కృషితో, పకడ్బందీ వ్యూహంతోనే అది సాధ్యమేమో! ఉగ్రవాదానికి తుదిఘట్టం ఆసన్నమైంది అని చెప్పలేమని, అమెరికా విధానాలు ఆ విషయంలో విఫలమయ్యాయని అప్పట్లో అక్కడి హోంలాండ్ సెక్యూరిటీ కమిటీ ఛైర్మన్ చెప్పటం గమనార్హం. అందుకే బాగ్దాదీ అంతంతో ఐ.ఎస్. అంతమైందని అనుకోవటం తొందరపాటుతనమే అవుతుంది.

2014లో బాగ్దాదీ ప్రారంభించిన యీ కాలీఫత్ కొన్నాళ్ళలోనే ఇరాక్–సిరియా దేశాల సరిహద్దుల్లో గ్రేట్ బ్రిటన్‌కున్నంత భూభాగాన్ని ఆక్రమించుకొని అగ్రదేశాలకు నిద్రలేకుండా చేసిన మాట వాస్తవం. సిరియా–ఇరాక్ జాతీయ వాదులతో తలపడటమే గాక, చాలామంది తాము చెప్పిన విధంగా వుండటం లేదని హతమార్చటం కూడా పచ్చి నిజం! మధ్యయుగం నాటి మతపరమైన యుద్ధాలను జ్ఞప్తికి తెచ్చే విధంగా బాగ్దాదీ తను స్థాపించిన సంస్థను మృత్యుకాండకు ఉపయోగించుకున్నాడు. అదృష్టవశాత్తూ కాలీఫత్ మెరిసినట్లు మెరిసి మాయమైంది. చాలా ప్రాంతాలు ఐ.ఎస్. స్వాధీనంలోంచి తిరిగి సంబంధిత దేశాలు స్వాధీనపరుచుకున్నాయి. ఇప్పుడు బాగ్దాదీ మృతి చెందటంతో ఐ.ఎస్. కార్యకలాపాలు మరింత సన్నగిల్లటం ఖాయం.

బిన్ లాడెన్ మరణంతో అల్‌ఖైదా అంతమొందిందని అప్పుడు అగ్రదేశాలు అనుకోవటం ఎంత పొరపాటో, బాగ్దాదీ మరణంతో ఐ.ఎస్. కార్యకలాపాలు అంతమొందుతాయని ఇప్పుడు అనుకోవటం కూడా అంతే పొరపాటు. అల్‌ఖైదాకు, ఐ.ఎస్.కు కొట్టొచ్చినట్టు కనపడే భేదం ఒకటుంది. అల్‌ఖైదా పూర్తిగా నాయకుడి మీద ఆధారపడిన సంస్థ. అయినా గూడా ఇరాక్‌లో పట్టణ ప్రాంతంతో అల్‌ఖైదా తన ఉనికిని కోల్పోయింది కానీ గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా పట్టు కోల్పోలేదు. సిరియాలో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడినప్పుడు 2011లో బాగ్దాదీ నాయకత్వంలో అల్‌ఖైదాను కలుపుకొని మరింత హింసాత్మక ఉగ్రవాద సంస్థగా ఐ.ఎస్.ఐ.ఎస్. పేరుతో ఎదిగింది. ఇప్పుడు ఐ.ఎస్.కు జరిగినదే అప్పుడు అల్‌ఖైదాకు జరిగింది. సిరియా, ఇరాక్‌లు మేలుకొని ఉగ్రవాద సంస్థలను కలుపుకొనే మరో నాయకుడు భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఎదగకుండా చూడటమే కాకుండా, తమ రెండు దేశాలు హింసావాదం బారిన పడకుండా కాపాడుకోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఏర్పడింది. కావాల్సినంత డబ్బు యీ సంస్థలు, వ్యక్తులు, సంస్థలకు సంబంధించిన నాయకుల చేతుల్లో వుంది. అస్తవ్యస్త పరిస్థితుల్లో దారితప్పిన యువత మళ్ళీ సూదంటురాయి లాంటి మరో నాయకుడి మాటలకూ ఆకర్షణకూ లొంగితే, మరో ఉగ్రవాద సంస్థ యీ పేర్లతోనో మరో పేరుతోనో ఉద్భవించి విశ్వవ్యాప్తంగా అశాంతిని రేపితే, మళ్ళీ పరిస్థితి యథాతథం! అందుకే అగ్రదేశాలతో సహా అన్ని దేశాలు యిప్పుడే బాగ్దాదీ అంతమొందిన వేళ సరియైన యుద్ధ ప్రణాళికలతో ఉగ్రవాదాన్ని తుదముట్టించే పనిలో పడాలి.

■ రావులపాటి సీతారాంరావు

# ప్రజారవాణా 'బరువు' ప్రభుత్వానిదే!

**సందర్భం**



■ కె. శ్రీనివాస్

**మె**ట్రో చార్జీలు 30 పెసోలు పెరిగాయని చిలీలో ఉద్యమం రాజుకున్నది. మెరుగైన జీవితం కోసం, ప్రజాస్వామ్యం కోసం మహాపోరాటంగా అది మలుపు తిరుగుతున్నది. ఇంతకీ 30 పెసోలు అంటే ఎంత, రెండు రూపాయల ఎనభై పైసలు. చిలీ ఆర్థిక వ్యవస్థలో ఆ మొత్తమే జీవితాలను అతలాకుతలం చేయగలదు. సోషలిస్టు అలెండీ ప్రభుత్వాన్ని సైనిక కుట్రతో కూల్చివేసి, దేశాన్ని పెద్ద బందిఖానాగా మార్చిన నియంత పెనోచెట్ 1980లలో తానే ఒక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రాసి దేశం మీద రుద్దాడు. అమెరికాకు అత్యంత ప్రియమైన, మార్కెట్ ఆర్థిక వ్యవస్థగా మార్చాడు. బంగారం లాంటి రాగి గనులను ధారాదత్తం చేశాడు. అయినా అతని పతనం తప్పలేదు. ప్రజాస్వామ్యం అంటూ ఒకటి రాకతప్పలేదు. రాజ్యాంగం మాత్రం సైనిక నియంత రాసిందే కొనసాగుతున్నది.

పెడతోవ పట్టకుండా దారికి వచ్చిన లాటిన్ అమెరికన్ దేశంగా చిలీని అంతర్జాతీయ ద్రవ్య, ఆర్థిక సంస్థలు బాగా ముద్దు చేస్తున్నాయి. వృద్ధిరేటును బాగా చూపుతున్నాయి. కానీ, చిలీలో సగం జనాభా 550డాలర్లు (అంటే 4లక్షల పెసోలు) నెలవారీ ఆదాయం మీద బతుకుతున్నది. భారతీయ ప్రమాణాల ప్రకారం నెలకు 36వేల రూపాయల జీతం అధికం కావచ్చును కానీ, అక్కడ మాత్రం మూడు రూపాయల చార్జీ హెచ్చింపునకు కూడా దేశం అతలాకుతలమయ్యేంత దుస్థితి. దేశంలో ప్రైవేటీకరణ ఎంతగా విశ్వరూపం తీసుకున్నా, శాంటియాగో మెట్రో మాత్రం ప్రభుత్వ రంగంలోనే ఉన్నది. నిర్వహణ వ్యయం పెరిగితే ప్రభుత్వం ఆ లోటును భర్తీచేయాలి తప్ప చార్జీలు పెంచడానికి వీలు లేదని జనం కోరుతున్నారు.

ఆధునిక జీవనంలో ప్రయాణం ఒక అత్యవసర భాగం. పల్లెటూళ్లలో పిల్లలు చదువుకోవాలన్నా, జబ్బుపడితే ఆస్పత్రికి వెళ్లాలన్నా, కొనుగోళ్లకు, పనులకు పట్నం పోవాలన్నా రోడ్లూ ఉండాలి, ప్రయాణ సదుపాయాలూ ఉండాలి. ముఖ్యంగా వ్యవసాయ దినుసులన్నీ మునుపటి వలె స్వావలంబితం కాకపోవడంతో రైతుకు కూడా ప్రయాణం తప్పనిసరి. పట్నాలలో అయితే చెప్పనక్కరలేదు. ఇంటికీ ఉపాధికీ మధ్య ప్రయాణమే. విశ్రాంతికీ వినోదానికీ మధ్య ప్రయాణమే. దూరాభారాలు పెరిగాక చార్జీలు తప్పనిసరి పద్దులు అవుతాయి. రైలో బస్సో ఆ తరువాత ఆటోనో టేక్సీనో, ఇంకా ఎక్కడైనా మిగిలితే రిక్షానో– అవసరమే. మనిషిని తరలించగలిగే సాధనాలు లేనప్పుడు, వ్యాపారం వ్యవహారం ఎట్లా నడుస్తాయి? ప్రజాజీవనానికి జీవనాడి లాంటి జనరవాణా, కొందరు కార్మికులకు, ఒక యాజమాన్యానికీ సంబంధించినది మాత్రమే కాదు. దానికయ్యే ఖర్చు దాని నుంచే రావాలనుకోవడానికి అది పక్కా వ్యాపారం కాదు. అది మౌలిక సదుపాయాలలో ఒకటి. అది అనేక ఆర్థిక కార్యక్రమాలకు సానుకూలత కల్పించే వేదిక. ప్రయాణీకులు మాత్రమే కాదు, చిన్న, పెద్ద వ్యాపారులు, దుకాణదారులు, సినిమావినోద కేంద్రాల వారు, వృత్తిపనివారు అందరూ లబ్ధి చెందుతారు. అందరికీ అవసరమైన ఒక ఉమ్మడి వ్యవస్థను, ఉమ్మడిగానే నిర్వహించుకోవాలి.

నెలరోజులు కావస్తున్నా తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ సమ్మె వల్ల ప్రభావితులయినది ఎవరెవరు? కార్మికులు, ఉద్యోగులు సరే. వారిది జీవన్మరణ సమస్య. కలవరంతో భయంతో నిస్పృహతో ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు. వారు, పరిష్కారం అత్యవసరంగా అవసరమయిన వారు. తక్కిన అన్ని ప్రజాశ్రేణులు కూడా ఈ సమ్మెవల్ల ప్రభావితులవుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్ల సంఖ్య సమ్మె కాలంలో 30శాతం తగ్గిపోయిందని ఒక అధ్యయనంలో తేలింది. వారు కాక, మరో ఇరవయి శాతం మంది అయినా ప్రజారవాణాను ఉపయోగించుకునేవారుంటారు, అత్యవసర కారణాలతో ఎక్కువ వ్యయానికి సిద్ధపడి ఆస్పత్రులకు చేరగలిగి ఉంటారు. అట్లాగే, రకరకాల వ్యాపారాలు కూడా ప్రజారవాణా లేమి వల్ల దెబ్బతిని ఉంటాయి. గ్రామీణ జీవనానికి అవసరమైన కనెక్టివిటీ, నగరజీవనానికి అవసరమైన వేగం– ఈ రెంటినీ ప్రజారవాణా వ్యవస్థలు నెరవేరుస్తాయి. వాటిని లాభనష్టాల ప్రాతిపదికమీద నిర్వహిస్తారా?

ఇప్పుడు ఆందోళన జరుగుతున్న శాంటియాగోలోనే కాదు, న్యూయార్క్, లండన్ వంటి మహానగరాలలో ప్రజారవాణావ్యవస్థ ప్రభుత్వ కార్పొరేషన్ల చేతిలోనే ఉన్నది. లండన్‌లో నిర్వహణ వ్యయంలో కేవలం 92 శాతం మాత్రమే ప్రయాణీకుల చార్జీల ద్వారా వస్తున్నది. తక్కిన 8 శాతం ప్రభుత్వమే భరిస్తున్నది. న్యూయార్క్‌లో మెట్రో, సిటీబస్, తదితర నగర ప్రజారవాణాసాధనాలన్నీ ఒకే సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తాయి. ఆ సంస్థలో భాగస్వాములెవరంటే, న్యూయార్క్ రాష్ట్రప్రభుత్వం, న్యూయార్క్ నగరపాలక సంస్థ, న్యూయార్క్‌లోని పోర్ట్ అథారిటీ. ఈ బహుళ ప్రజారవాణాసంస్థకు వరుసగా నష్టాలు వస్తున్నాయి. వాటిని న్యూయార్క్ రాష్ట్ర ప్రభుత్వమే భర్తీ చేస్తున్నది.



ప్రభుత్వంలో విలీనం చేయాలి అన్నది ఒక డిమాండ్. కానీ, ఆ డిమాండ్ వెనుక ఉన్న కారణాలు ఇక్కడ పరిశీలించాలి. నిర్వహణ వ్యయంలో వస్తున్న లోటును భర్తీ చేయడం, కొత్త పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలకు పరిహారం ఇవ్వడం, ప్రభుత్వోద్యోగులతో కార్పొరేషన్ ఉద్యోగులకు ఉన్న వేతన వ్యత్యాసాలను లేకుండా చేయడం. ఈ కారణాలను భర్తీ చేయగలిగితే, విలీనమే జరగవలసిన పనిలేదు. అది ఒక సాంకేతిక అంశం మాత్రమే. ప్రభుత్వ కార్పొరేషన్లు తమ నిర్వహణను తామే సొంతంగా చేసుకోవాలన్నది ఒక సంప్రదాయమే అయినప్పటికీ, ప్రజారవాణాను ఆ కోవలోకి చేర్చకూడదు. సింగపూర్‌లో అనేక ప్రైవేట్ సంస్థల చేతిలో ప్రజారవాణా ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఏటా 400 కోట్ల సింగపూర్ డాలర్ల మేరకు సబ్సిడీలు ఇస్తున్నది. మౌలిక వ్యవస్థల కల్పనలో, కొత్త బస్సుల కొనుగోలులో కూడా పెట్టుబడులు పెడుతున్నది. ఇంగ్లండ్‌లో లండన్ మెట్రో ప్రభుత్వ నిర్వహణలోనే ఉన్నా, సిటీబస్సులను జిల్లాలకు, దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల నిర్వహణను 1980లలోనే, థాచర్ కాలంలో, ప్రైవేటీకరించారు. అయినా ఇప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం ఏటా 250 కోట్ల పౌండ్లకు మించి సబ్సిడీలు ఇస్తున్నది. ప్రైవేటీకరణ నుంచి వెనుకకు రావాలని, కిలోమీటరుకు ఇంత చొప్పున వేలం ద్వారా నిర్ణయించి, ఆ మేరకు ఆపరేటర్లకు చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టాలని బ్రిటన్‌లో ఆలోచిస్తున్నారు. చార్జీల నిర్ణయం ప్రభుత్వం చేతిలో ఉంటుంది. ఇతర వస్తుసేవల ధరలలాగా, రవాణా చార్జీలను మార్కెట్ లేదా నిర్వహణ వ్యయం ఆధారంగా నిర్ణయించడం కుదరదని, అవి అంతిమంగా రాజకీయంగా నిర్ణయించవలసిందేనని బ్రిటన్ కూడా గుర్తించింది. రాజకీయ నిర్ణయాల భారాన్ని కార్పొరేషన్ల నెత్తిన పడేయకూడదన్న తెలివిడి కూడా ఆ ప్రతిపాదనలో ఉన్నది.

> **ప్రభుత్వ కార్పొరేషన్లు తమ నిర్వహణను తామే సొంతంగా చేసుకోవాలన్నది ఒక సంప్రదాయమే అయినప్పటికీ, ప్రజారవాణాను ఆ కోవలోకి చేర్చకూడదు. సింగపూర్‌లో అనేక ప్రైవేట్ సంస్థల చేతిలో ప్రజారవాణా ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఏటా 400 కోట్ల సింగపూర్ డాలర్ల మేరకు సబ్సిడీలు ఇస్తున్నది. ఆర్థికాభివృద్ధి ప్రజారవాణాతో ముడిపడి ఉంటుంది. ఆర్థికచక్రం వేగవంతంగా తిరగాలంటే, ప్రజారవాణా ఉండాలి. వినియోగదారుడిని దుకాణానికి, విద్యార్థిని పాఠశాలకు, ఉద్యోగిని కార్యాలయానికి వారి జేబులను పెద్దగా బాధించకుండా తరలించగలిగే సాధనాలు ఉన్నప్పుడే ప్రభుత్వానికి పన్నుల ఆదాయం.**

ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వానికి బరువు తగ్గుతుందనుకోవడం పొరపాటు. ఆర్టీసీని వృత్తిపరంగా సమర్థవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవడానికి ఎవరూ వ్యతిరేకులు కారు. కార్మికులు ఇప్పటికే నిర్ణీత సమయానికి మించి పని చేస్తున్నారు. ఇంకా చేయగలరు కూడా. వారికి న్యాయమైన వేతనాలు ఇవ్వడం, ప్రజారవాణాలో రాజకీయ అవసరాల కోసం ఇస్తున్న రాయితీలను భర్తీచేయడం, ప్రైవేటు ఆపరేటర్లకు ఇస్తున్న అనవసర ప్రాధాన్యాలను ఉపసంహరించడం– చేస్తే సంస్థ గాడిన పడుతుంది. ప్రభుత్వోద్యోగులతో ఉన్న వేతనాల అంతరాన్ని తగ్గించేందుకు ప్రయత్నించండి. ప్రజలకు చవుక రవాణా ఇవ్వడం కోసం శ్రమను చవుకగా కొనాలని చూడవద్దు. రెంటి మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయండి. రాష్ట్రప్రభుత్వమో, స్థానికసంస్థనో, కార్పొరేషనో ఏదో ఒకటి సమష్టి యాజమాన్యం కింద ఉన్న రవాణావ్యవస్థతో ప్రజలకు ఒక అనుబంధం ఉంటుంది. ప్రగతికి చక్రం చిహ్నమే నిజమే, దానితో పాటు ప్రజాసేవయే మాకర్తవ్యము– అన్న నినాదమూ ఆర్టీసీదే. బాధ్యత లేని వ్యాపారస్తుల చేతిలో దాన్ని పెట్టకండి.

ఆర్థికాభివృద్ధి ఆ రాష్ట్రంలో లేదా దేశంలో ఉన్న ప్రజారవాణాతో ముడిపడి ఉంటుంది. ఆర్థికచక్రం వేగవంతంగా తిరగాలంటే, ప్రజారవాణా ఉండాలి. విద్యార్థిని పాఠశాలకు, వినియోగదారుడిని దుకాణానికి, ఉద్యోగిని కార్యాలయానికి వారి జేబులను పెద్దగా బాధించకుండా తరలించగలిగే సాధనాలు ఉన్నప్పుడే ప్రభుత్వానికి పన్నుల ఆదాయం. ■

# యానిమేషన్ గురుబ్రహ్మ

**ఒ**కప్పుడు భిన్నమయిన కళా రూపంగా ఉన్న యానిమేషన్ ఇప్పుడు సాంకేతిక ప్రతిభకే పరిమితమయిందని వేదనపడ్డ కళాకారుడు రామ్మోహన్. యానిమేషన్ అన్నది భిన్న మాధ్యమం, ఆ మాధ్యమంలో కథ చెప్పడానికి ఆకట్టుకునే కథలతో పాటు కొత్తగా చెప్పే విధానమూ అవసరమని భావించిన సుప్రసిద్ధ యానిమేటర్ ఆయన. ఆ రంగంలో విశేషంగా కృషి చేసి 'భారతీయ యానిమేషన్ రంగ పితామహుడు'గా పేరొందిన కళాకారుడు. కొత్త కథలూ, కథ చెప్పే కొత్త విధానాలూ రావాలి, అప్పుడే భారతీయ యానిమేషన్ రంగం మరెంతో అభివృద్ధి చెందుతుందని నొక్కి చెప్పిన రామ్మోహన్ ఈ నెల 11న తన 88వ ఏట ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు.

**నివాళి**



> **భారతీయ యానిమేషన్ రంగ పితామహుడు రామ్మోహన్. విద్యా విషయిక అంశాల ఆధారంగా యానిమేషన్ చిత్రాల నిర్మాణానికి ఆద్యులలో ఆయన ఒకరు. పద్మశ్రీ పురస్కార గ్రహీత అయిన రామ్మోహన్ విఖ్యాత చలనచిత్ర స్రష్టలు సత్యజిత్ రే, మృణాల్ సేన్ సినిమాలకూ యానిమేటర్‌గా పనిచేశారు.**

ఆరేడు దశాబ్దాల క్రితమే యానిమేషన్‌ను తన భావ వ్యక్తీకరణ మాధ్యమంగా ఎంచుకుని ఫిల్మ్స్ డివిజన్‌లో తన కెరీర్‌ను రామ్మోహన్ ఆరంభించారు. ఎంతో ఆసక్తితో యానిమేషన్‌ను నేర్చుకుని దేశంలో దాని అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. యువ యానిమేటర్స్‌కు ప్రేరణగా నిలిచిన రామ్మోహన్ దేశవ్యాప్తంగా ఎంతో మంది విఖ్యాత యానిమేటర్లకు గురు సమానుడు.

1931 ఆగస్టు 26న జన్మించిన రామ్మోహన్ మద్రాస్ విశ్వవిద్యాలయ పట్టభద్రుడు. విద్యాభ్యాసం అనంతరం బాంబేలోని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వారి ఫిల్మ్స్ డివిజన్‌లో కార్టూన్ యూనిట్‌లో చేరారు. 1956–59 సంవత్సరాల మధ్య వాల్ట్ డిస్నీ స్టూడియోకు చెందిన క్లెయర్ హెచ్ వీక్స్ ఆధ్వర్యంలో యానిమేషన్‌లో రామ్మోహన్ ప్రత్యేక శిక్షణ పొందారు. 1960 నుంచి 1967 దాకా రామ్మోహన్ ఫిల్మ్స్ డివిజన్‌లో కార్టూన్ సినిమాల రూపకల్పన, వాటి నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు. తర్వాత ప్రసాద్ ప్రొడక్షన్స్ వారి యానిమేషన్ విభాగ అధిపతిగా చేరారు. 1972లో తన సొంత నిర్మాణ సంస్థ 'మోహన్ బయోగ్రాఫిక్స్' ఏర్పాటు చేసుకొని యానిమేషన్ రంగంలో ముమ్మరకృషి చేశారు. ప్రతిభావంతమైన యానిమేటెడ్ సినిమాలను రూపొందించిప్రశంసలు పొందారు. 1974లో మొట్టమొదటిసారిగా విద్యావిషయక అంశాల్ని తీసుకుని 'డౌన్ టు ఎర్త్' యానిమేషన్ చిత్ర పరంపరను ఆయన నిర్మించారు. అదే కాలంలో 'తారు' లాంటి అనేక యానిమేటెడ్ సినిమాలు రూపొందించారు. జపాన్‌కు చెందిన నిప్పన్ సంస్థ యుగో సాకో దర్శకత్వంలో నిర్మించిన 'రామాయణ: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామా' సినిమాకు సహ దర్శకత్వం వహించారు. 'యు సెడ్ ఇట్' అన్న తన యానిమేషన్ సినిమాకు 1971లో జాతీయ ఉత్తమ చిత్రం అవార్డును, 1983లో 'ఫైర్ గేమ్స్' అన్న సినిమాకు మరోసారి జాతీయ అవార్డును అందుకున్నారు. ముంబై అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో రామ్మోహన్‌కు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. ఇలా అనేక అవార్డులు రివార్డులు అందుకున్న రామ్మోహన్ హిందీ సినిమా రంగంలో కూడా వివిధ సినిమాలకు తన ప్రతిభతో యానిమేషన్ మెరుపులద్దారు. ముఖ్యంగా సత్యజిత్ రే 'షత్రంజ్ కే కిలారి', మృణాల్ సేన్ రూపొందించిన 'భువన్ షోమ్', బి.ఆర్.చోప్రా 'పతి పత్నీ ఔర్ వో' ల గురించి చెప్పుకోవాలి. ఇంకా 'బీవీ ఓ బీవీ', 'దో ఔర్ దో పాంచ్', 'కామ్ చోర్' లాంటి అనేక సినిమాలకు యానిమేటర్‌గా ఆయన పని చేశారు. 2006లో ముంబైలో గ్రాఫిటి స్కూల్ ఆఫ్ యానిమేషన్‌ను స్థాపించి యువతకు యానిమేషన్ శిక్షణను ఇవ్వడం ఆరంభించారు.


ఈ విధంగా భారతీయ యానిమేషన్ చిత్ర రంగంలో తనదయిన ముద్రను వేసిన రామ్మోహన్ 'పెరిగిన సాంకేతికత యానిమేషన్ రంగంలో వేగాన్ని పెంచిందని, చేతిలో ఇమిడే స్థాయికి తెచ్చిందని' చెప్పేవాడు. ఒక నాడు అంతా చేతి తోనే రేఖా చిత్రాలు వేసి యానిమేట్ చేయాల్సి వచ్చేదని ఒక నిముషం చిత్రం తీయడానికి నెలన్నరకు పైగా సమయం పట్టేదని, అయితే ఇవ్వాళ అదే సినిమాను సాంకేతికత అందించిన సౌకర్యాలతో చాలా తక్కువ సమయంలో రూపొందించడం సులభసాధ్యమయిందని రామ్మోహన్ చెప్పేవారు.

యానిమేషన్ రంగంలో విశేష ప్రతిభతో పాటు అకుంఠిత దీక్షతో కృషి చేసిన రామ్మోహన్ మృతి ఆ కళా రంగానికి తీరని లోటు. ఆయనకు సమస్త భారతీయ చలనచిత్ర యానిమేషన్ కళాకారులు ఘనంగా నివాళులర్పించారు.

■ వారాల ఆనంద్

# నవ్యాంధ్ర పండుగకు వేళాయె!

**దే**శంలోని అన్ని రాష్ట్రాలలోనూ ఆయా రాష్ట్రాల అవతరణదినోత్సవ వేడుకలు జరగటం మనకు తెలుసు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అయిదేళ్ళుగా రాష్ట్రావతరణ దినోత్సవాల ఊసే లేదు. వాటిని నిర్వహించాలన్న ధ్యాస కూడా ఏలికలకు లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత దేశంలో కొత్తగా ఏర్పడ్డ 29వ రాష్ట్రం తెలంగాణ. ఆ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సారథ్యంలో జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనాతి ఘనంగా జరుపుకున్నారు. అయితే అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర అవతరణ వేడుకలు ఏ తేదీన నిర్వహించాలి అన్న సందిగ్ధ పరిస్థితిలో ఉండిపోయింది. అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలూ రాష్ట్ర అవతరణ వేడుకల సంగతి పట్టించుకోకుండా ప్రతి ఏటా జూన్ 2 నుండి 8వ తేదీ వరకు వారం రోజుల పాటు అయిదేళ్ళూ నవనిర్మాణ దీక్షలను చంద్రబాబు నిర్వహించారు. అవతరణ వేడుకలను సైతం రాజకీయం చేసి విభజనకు ప్రధాన కారణమై, 2014 ప్రజా కోర్టులో శిక్షింపబడ్డ కాంగ్రెస్ పార్టీని మరోమారు 'బోను'లో నిలబెట్టి తిట్టిపోసే పనిని చేశారు. ఇందుకు లక్షల కొద్దీ ప్రజా సొమ్మును ఖర్చు చేశారు. అలా చంద్రబాబు తిట్టి తూర్పారబట్టిన కాంగ్రెస్ పార్టీతో 2018 తెలంగాణ ఎన్నికల్లోనూ, 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ 'చెలిమి' చేశారు. దీనితో రాజకీయ విశ్వసనీయత కొరవడి నవనిర్మాణ దీక్షల సారమంతా బూడిదలో పోసినట్లయ్యింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘోర పరాజయానికి ఈ 'అలౌకిక' స్నేహ హస్తం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అక్టోబర్ 1న జరపాలా? నవంబర్ 1న జరపాలా? లేదా విభజన తేదీ జూన్ 2వ తేదీన జరపాలా? అన్న మేధోమథన చర్చలను పరిగణనలోకి తీసుకొని వారికి ప్రభుత్వం తరపున ఒక దిశానిర్దేశం ఐదేళ్ళపాటు చేయలేకపోయారు. దీనితో ఆంధ్రప్రదేశ్ ప్రజలు అయిదేళ్ళుగా అవతరణ ఉత్సవాలకు దూరమయ్యారు. అవతరణ వేడుకలు లేకపోవటంతో రాష్ట్రాభిమానుల గుండెలు క్షోభించాయి. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఎలాంటి తటపటాయింపులకు, వాదోపవాదనలకు తావు లేకుండా నవంబర్ 1నే ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలు జరపాలని నిర్ణయించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత 56 ఏళ్ళుగా ఏ తేదీన అవతరణ ఉత్సవాలుగా జరుపుకుంటున్నామో, అదే తేదీని అవతరణ దినోత్సవ తేదీగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి తేల్చేశారు. విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంపై పలురకాల భిన్నస్వరాలు ఉన్నా, నవంబర్ 1నే అవతరణ పండుగ జరుపుకోవటం అందరికీ ముదావహం. ఎందుకంటే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి చీలిపోయి కొత్తగా ఏర్పడ్డది తెలంగాణ రాష్ట్రం మాత్రమే. దేశంలో ఏర్పడ్డ 29వ కొత్త రాష్ట్రం కూడా అదే. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ఏర్పడ్డ 1953 నాటి ఆంధ్రరాష్ట్రం మాత్రం విభజింపబడలేదు. అయితే కొంతమంది మద్రాసు నుండి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం విడివడిన అక్టోబర్ 1 తేదీనే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినంగా ప్రకటించాలని అన్నారు. ఇంకొందరు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని రెండు రాష్ట్రాలుగా విభజింపబడిన జూన్ 2వ తేదీన అవతరణ దినంగా గుర్తించాలని అంటున్నారు. కానీ, ఈ రెండు వాదనలు తప్పే. ప్రజాస్వామ్య దేశంలో కేంద్రంలో గానీ, రాష్ట్రాలలోగానీ ప్రభుత్వాల మార్పును ఎలా స్వాగతిస్తామో, రాష్ట్రాల పునర్విభజనను, నైసర్గిక స్వరూప మార్పులను, చేర్పులను కూడా స్వాగతించాలి.



> **ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ తేదీన రాష్ట్ర అవతరణ ఉత్సవాలు జరుపుకున్నామో, అదే తేదీన నవ్యాంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాలు నిర్వహించుకోవాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారు. విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంపై పలురకాల భిన్న స్వరాలు ఉన్నా, నవంబర్ 1 నే అవతరణ పండుగ జరుపుకోవటమే సముచితం, ముదావహం.**

అంతమాత్రం చేత గత 56 ఏళ్ళుగా జరుపుకుంటూ వస్తున్న నవంబర్ 1 అవతరణ తేదీని మార్చాల్సిన పనిలేదు. ఆంధ్రప్రదేశ్ అవతరణకు ఉన్న ఔన్నత్యాన్ని తగ్గించుకోవాల్సిన పనీ లేదు. పైగా, ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ ప్రాంతం వైదొలగిందే కానీ, తెలంగాణ ప్రాంతం నుండి ఆంధ్ర ప్రదేశ్ వైదొలగలేదు. తెలంగాణ రాష్ట్రాభిమానులు ఆ రాష్ట్రం ఏర్పడ్డ జూన్ 2వ తేదీని అవతరణగా జరుపుకోవటం ఎంత సమంజసమో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు తాము 56 ఏళ్ళుగా జరుపుకుంటున్న నవంబర్ 1వ తేదీని అవతరణగా జరుపుకోవటం అంతే సమంజసం. నవంబర్ 1వ తేదీని ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరపాలని ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించాయి. అందువల్ల అవతరణ తేదీని వివాదాస్పదం చేయకుండా, అశేష తెలుగు ప్రజల మొట్ట మొదటి ఉమ్మడి తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో అసలైన పండుగ రోజుగానే నవంబర్ 1ని నవ్యాంధ్ర అవతరణ పండుగగా జరుపుకోవాలి. ఇది తెలుగు ప్రజలందరికీ ఆమోదయోగ్యం. గర్వకారణం.

■ వసంత నాగేశ్వరరావు
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోం శాఖామాత్యులు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

బిగ్ షో

'బిగ్‌బాస్' సీజన్ 3 తుది సమరానికి కౌంట్ డౌన్ మొదలైంది. 17 మంది కంటెస్టెంట్స్‌తో ప్రారంభమైన ఈ రియాల్టీ షోలో ఫైనలిస్టులుగా ఐదుగురు మిగిలారు. శ్రీముఖి, బాబా భాస్కర్, రాహుల్ సిప్లిగంజ్, అలీ రెజా, వరుణ్ సందేశ్ ... వీళ్లలో ఈ వారం ఫైనల్స్‌లో విజేతగా నిలిచేది ఎవరు? రూ. 50 లక్షల ప్రైజ్ మనీని గెలుచుకొనేదెవరు?



శ్రీముఖి
రాహుల్
వరుణ్ సందేశ్
బాబా భాస్కర్
అలీ రెజా

# విజేత ఎవరు?

ఎన్నో అంచనాలతో జూలై 22న ప్రారంభమైన 'బిగ్‌బాస్' సీజన్ 3కు ఈ ఆదివారం (నవంబర్ 3న) శుభం కార్డు పడనుంది. అనేక మలుపులు, టాస్క్‌లతో వంద రోజులకు పైగా సాగుతున్న 'బిగ్' రియాల్టీ షో ఇది. 17 మంది సభ్యులు 'బిగ్‌బాస్' హౌస్‌లోకి అడుగుపెట్టారు. వారం వారం జరిగే వడపోతల్లో 12మంది ఎలిమినేట్ అవగా చివరికి ఐదుగురు మిగిలారు. ఎట్టకేలకు ఆట అంతిమ ఘట్టానికి చేరుకొంది. వీళ్లలో ఒకరికి మాత్రమే రూ. 50 లక్షలు గెలుచుకొనే అవకాశం ఉండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. మొదట్లో మూడు నాలుగు వారాలు మాత్రమే 'బిగ్‌బాస్' షోను చూసి దూరంగా జరిగిన ప్రేక్షకులు సైతం మళ్లీ టీవీల ముందుకు చేరుతున్నారు. విజేత అయ్యే అవకాశాలు ఎవరికి ఉన్నాయో చర్చించుకొంటున్నారు. ఇక సోషల్ మీడియాలో జరిగే చర్చ గురించి చెప్పక్కర్లేదు.

### నాగార్జునే కారణం...

'బిగ్‌బాస్' సీజన్ 1కి జూనియర్ ఎన్టీఆర్, సీజన్ 2కు నాని వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. తమదైన శైలిలో షోను రన్ చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచారు. ఇక మూడో సీజన్‌లో ప్రేక్షకులను అలరించడానికి, ఇంటి సభ్యుల్ని క్రమశిక్షణలో ఉంచడానికి ఎవరు అతిథిగా వస్తారా? అనే విషయం మీద రకరకాల ఊహాగానాలు వినిపించాయి. జూనియర్ ఎన్టీఆరే మళ్లీ ఆ బాధ్యత స్వీకరిస్తారని వార్తలొచ్చాయి. ఆ ఊహలకు తెర తీస్తూ వ్యాఖ్యాతగా నాగార్జున ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇంతకుముందు 'మా' టీవీ నిర్వహించిన 'మీలో ఎవరు కోటీశ్వరుడు' ప్రోగ్రామ్‌తో అందరినీ ఆకట్టుకొన్న నాగార్జున 'బిగ్‌బాస్' సీజన్ 3 వ్యాఖ్యాతగా ప్రారంభం నుంచే మంచి మార్కులు సంపాదించుకొన్నారు. తప్పు చేసిన ఇంటి సభ్యుల్ని మందలించారు. టాస్కుల్లో ప్రతిభ చాటిన వారిని అభినందించారు. ఎంతో హుందాగా ఈ షోను నిర్వహిస్తూ తన ప్రత్యేకత చాటుకుంటున్నారు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకులే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని వారూ 'బిగ్ బాస్ 3' షోను ఆసక్తికరంగా చూస్తున్నారంటే దానికి కారణం నాగార్జునే అంటున్నాయి 'స్టార్ మా' వర్గాలు. 'బిగ్ బాస్ 3' పుణ్యమాని 'స్టార్ మా' పాపులారిటీలో ఇప్పుడు దేశంలోనే మూడో స్థానంలో ఉందట. బీహార్‌కు చెందిన 'దంగల్ టీవీ' ప్రథమ స్థానంలో, తమిళనాడుకు చెందిన 'సన్ టీవీ' రెండో స్థానంలో ఉన్నాయి. ఒక తెలుగు ఛానల్ దేశవ్యాప్తంగా మూడో స్థానంలో ఉండడం చాలా అరుదైన విషయమని టాప్ 5, టాప్ 10 లో ఉండే ఛానల్ ఈ స్థాయికి రావడానికి కారణం 'బిగ్ బాస్ 3' అని 'స్టార్ మా' యాజమాన్యం చెబుతోంది. 1108 జీఆర్‌పీ (గ్రాస్ రేటింగ్ పాయింట్స్)తో 'బిగ్‌బాస్ 3' రియాల్టీ షో దూసుకుపోతోంది.

## ఫైనల్ వేదికపై మెగాస్టార్?

నాని వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'బిగ్‌బాస్ సీజన్ 2' గ్రాండ్ ఫినాలేకు విక్టరీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసారి ఫైనల్ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవిని ఆహ్వానించారనీ, అందుకు ఆయన అంగీకరించారనీ సమాచారం. మూడు గంటల పాటు కన్నుల పండువగా జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ హీరోయిన్ల నృత్య ప్రదర్శనలు, బిగ్‌బాస్ ఇంటి సభ్యుల డ్యాన్సులు ప్రత్యేక ఆకర్షణ. ఫైనల్‌గా చిరంజీవి చేతుల మీదుగా విజేతకు ప్రైజ్ మనీ అందచేస్తారు.

### ఎలిమినేషన్స్‌పై ముందే లీకులు!

'బిగ్‌బాస్ 'టీమ్ ఎన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నా ఎలిమినేషన్స్ విషయంలో లీకులు మాత్రం ఆగడం లేదు. 'ఈ వారం హౌస్ నుంచి బయటకు వచ్చేది వీళ్లే' అని రెండు రోజుల ముందే సోషల్ మీడియాలో ప్రచారం జరిగిపోతోంది. ఆ ప్రకారమే ఎలిమినేషన్స్ ఉండడంతో ప్రేక్షకులు సోషల్ మీడియాను ఎక్కువగా ఫాలో అవడం ప్రారంభించారు.


బిగ్‌బాస్ హౌస్‌లో నాగార్జున

ఎలిమినేషన్స్ రౌండ్ నటి హేమతో మొదలైంది. ఎన్నో చిత్రాల్లో నటించిన కేరెక్టర్ ఆర్టిస్ట్ హేమ తొలి వారంలోనే 'బిగ్‌బాస్' హౌస్ నుంచి బయటకు వచ్చేయడం ఆమెనే కాదు చాలామందిని ఆశ్చర్యపరిచింది. రెండో వారంలో టీవీ జర్నలిస్ట్ జాఫర్, మూడో వారంలో తమన్నా సింహాద్రి, నాలుగో వారంలో రోహిణి, ఐదో వారంలో అషూ రెడ్డి ఎలిమినేట్ అయ్యారు. ఆరో వారం 'బిగ్‌బాస్' ఎవరినీ ఎలిమినేట్ చేయకపోవడంతో హౌస్‌లో ఉన్న సభ్యులందరూ సేఫ్ అయ్యారు. మళ్లీ ఏడో వారం నుంచి ఎలిమినేషన్ ప్రక్రియ మొదలైంది. ఏడో వారంలో అలీ రెజా (వైల్డ్ కార్డ్ ద్వారా రీఎంట్రీ ఇచ్చాడు), ఎనిమిదో వారంలో శిల్పా చక్రవర్తి, తొమ్మిదో వారంలో హిమజ, పదో వారంలో రవి, పదకొండో వారంలో పునర్నవి, పన్నెండో వారంలో మహేశ్ విట్టా, పదమూడో వారంలో వితిక, పద్నాలుగో వారంలో శివజ్యోతి... ఇలా ఒక్కొక్కరు సూట్ కేసు చేత్తో పట్టుకొని 'బిగ్‌బాస్' హౌస్ నుంచి బయటకు వచ్చేశారు.

### వినోదం లోపించిందా?

మొదటి రెండు సీజన్లతో పోలిస్తే ఈ సీజన్‌లో వినోదం తగ్గిందనే విమర్శలు వినిపించాయి. ప్రేమలు, గొడవలు, ఎమోషన్స్‌కు పెద్ద పీట వేసి, 'బిగ్‌బాస్' ఎంటర్‌టైన్‌మెంట్ తగ్గించాడన్నది చాలా మంది అభిప్రాయం. 'బిగ్‌బాస్' సీజన్ 1 విన్నర్ శివబాలాజీ కూడా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాగే రెండు సీజన్లతో పోలిస్తే ఈ సీజన్‌లో ఇంటి సభ్యులు చాలా వీక్‌గా ఉన్నారని అంటున్నారు. భార్యాభర్తలైన వరుణ్‌సందేశ్, వితిక ఇంటి సభ్యులుగా రావడం ఓ టాపిక్ అయ్యింది.

### వైల్డ్ కార్డ్ ఎంట్రీలు కూడా వీకే!

ఇంటి సభ్యులకు మరింత హుషారు కలిగించడానికి అప్పుడప్పుడు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా సినీ ప్రముఖుల్ని హౌస్‌లోకి పంపించడం 'బిగ్‌బాస్'కు అలవాటే. అయితే ఈ సారి వైల్డ్ కార్డ్ ఎంట్రీల విషయంలో కూడా 'బిగ్‌బాస్' విఫలమయ్యాడని చెప్పాలి. శ్రద్ధా దాస్, హెబ్బా పటేల్, ఈషా రెబ్బ వంటి గ్లామర్ హీరోయిన్లు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా హౌస్‌లోకి ప్రవేశిస్తారని ప్రచారం జరిగింది కానీ ఎందుకో అది వర్కవుట్ కాలేదు. వీళ్లే కాకుండా మరి కొంతమంది హీరోయిన్ల కోసం 'బిగ్‌బాస్' టీమ్ ప్రయత్నించింది కానీ రకరకాల కారణాల వల్ల సాధ్యపడలేదు. చివరికి ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి, యాంకర్ శిల్పా చక్రవర్తి వైల్డ్ కార్డ్‌తో హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. కానీ వచ్చిన రెండు వారాల్లోనే వారు తిరుగుముఖం పట్టారు. ఇక ఏడో వారంలో ఎలిమినేట్ అయిన అలీ రెజా వైల్డ్ కార్డ్‌తో మళ్లీ ఎంట్రీ ఇచ్చి ఇప్పుడు ఫైనల్‌కు చేరుకొన్నారు.

## వివాదాలు...

బిగ్‌బాస్ హౌస్‌లో జరిగిన విషయాల గురించి బయటకు వచ్చిన తర్వాత సభ్యులెవరూ విమర్శలు చేయకూడదనేది 'బిగ్‌బాస్' నిబంధన. కానీ తొలి వారంలోనే బయటకు వచ్చేసిన నటి హేమ ఇంటి సభ్యులపై, 'బిగ్ బాస్'పై తీవ్ర వ్యాఖ్యలు చేసి సంచలనం సృష్టించారు. ఇటీవల మరోసారి ఆమె 'బిగ్‌బాస్'పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైనల్స్‌కు రమ్మని ఆహ్వానిస్తే, తనకు అవమానం జరిగిన చోటుకి రానని తేల్చి చెప్పేశారు హేమ. ఎలిమినేట్ అయి బయటకు వచ్చిన సభ్యులు అప్పుడప్పుడు విమర్శలు చేస్తూనే ఉన్నారు.

### శ్రీముఖి, రాహుల్.. పోటీ వీళ్ల మధ్యేనా?

ఫైనల్లో పోటీ ప్రధానంగా శ్రీముఖి, రాహుల్ మధ్యే ఉంటుందని అంటున్నారు. శివజ్యోతి ఎలిమినేట్ కావడానికి ముందు ఆమె కానీ, శ్రీముఖి కానీ ప్రైజ్ మనీ గెలుచుకొనే అవకాశం ఉందని చాలామంది భావించారు. సీజన్ 1, సీజన్ 2లో మగవారికే ప్రైజ్ మనీ రావడంతో ఈసారి తప్పకుండా మహిళలకు అవకాశం ఉంటుందనీ, శ్రీముఖి, శివజ్యోతి.. వీరిలో ఒకరికి ఆ ఛాన్స్ దక్కవచ్చని ఊహించారు. అయితే 14 వారాలు పోరాటం చేసిన శివజ్యోతి చివరికి తక్కువ ఓటింగ్ కారణంగా ఎలిమినేట్ కావడం శ్రీముఖికి ప్లస్ అయ్యిందని అంటున్నారు. 'బిగ్‌బాస్' సీజన్ 2లో ప్రైజ్ మనీ గెలుచుకోవడానికి కంటెస్టెంట్ కౌశల్ తరుపున 'కౌశల్ ఆర్మీ' ఎంతో హడావిడి చేసింది. అది కౌశల్‌కు అనుకూలించింది.

ఇప్పుడు అదే మార్గాన్ని శ్రీముఖి మిత్రబృందం అనుసరిస్తోంది. టాప్ యాంకర్‌గా ఆమెకు ఉన్న ఇమేజ్ ఓటింగ్ పెరగడానికి కారణం అవుతుందని చెబుతున్నారు. అలాగే 'బుల్లితెర రాములమ్మ'గా పేరు తెచ్చుకొన్న శ్రీముఖిని గెలిపించమని పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియాలో పోస్టింగ్స్ పెడుతున్నారు. అయితే శ్రీముఖి క్లోజ్ ఫ్రెండ్, యాంకర్ రవి మాత్రం తన స్నేహితురాలిని కాకుండా అలీ రెజాను గెలిపించమని ప్రచారం చేస్తున్నారు. అలీ రెజా తనకు అత్యంత సన్నిహితుడు కావడంతో అతని గెలుపు తనకు అవసరమని రవి చెబుతున్నారు.

ఇక శ్రీముఖి తర్వాత మిగిలిన వారిలో రాహుల్‌కు మాత్రమే గెలిచే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ప్రైజ్ మనీ గెలిచిన తర్వాత ఆ డబ్బుతో 'బార్బర్ షాప్' పెడతానని రాహుల్ ప్రకటించడంతో అతడికి సింప్లిసిటీ, కులవృత్తి మీదున్న గౌరవాన్ని అందరూ అభినందిస్తున్నారు. అలాగే పదమూడో వారం ఎలిమినేట్ అయిన వితిక మాత్రం తన భర్త వరుణ్ సందేశ్ తప్పక గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. ఫైనల్‌కు చేరిన అయిదుగురిలో రూ.50 లక్షల ప్రైజ్ మనీ గెలుచుకొనేది ఎవరన్నది ఈ ఆదివారం తేలిపోతుంది.

• వినాయకరావు

---

ఫ్యామిలీ కౌన్సెలింగ్



# నన్ను పట్టించుకోవడం లేదు...

నా వయసు 26 సంవత్సరాలు. నా వివాహమై 8 నెలలయ్యింది. మాది ప్రేమ వివాహం. నా తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే పారిపోయి పెళ్లి చేసుకున్నాం. నా భర్త నాతో మాట్లాడినట్లే ఇంకో ఆరుగురు అమ్మాయిలతో మాట్లాడేవాడు. వాళ్లని కూడా ప్రేమించానని నమ్మించాడు. చివరకు నన్ను పెళ్లి చేసుకున్నాడు. ఈ నిజం ఆలస్యంగా తెలిసినా మారతాడనే ఆశతో ఉన్నాను. కానీ పెళ్లయ్యాక అతనిలో మార్పు వచ్చింది. సరిగ్గా మాట్లాడటం లేదు. నన్ను పట్టించుకోవడం లేదు. నేను ఎం.ఎ., బీఈడీ చేశాను. టీచర్ ట్రైనింగ్ కూడా పూర్తయ్యింది. అతను పది వరకే చదివాడు. ఈ పరిస్థితుల్లో నన్నేం చేయమంటారు?

-నవీన

అంత చదువుకున్నారు. కాలం కలిసొస్తే ప్రభుత్వోద్యోగం కూడా వస్తుంది. రాకపోయినా టీచర్‌గా ఎక్కడైనా అవకాశం దొరుకుతుంది. ఇప్పుడు అర్థమైందా అతను మిమ్మల్ని ఎందుకు పెళ్లి చేసుకున్నాడో? మరి మీకు అతనిలో అంతగా ఏం నచ్చిందో, పెద్దలను కాదని పారిపోయి ఎందుకు చేసుకున్నారో రాయలేదు. పైగా మీతో పాటు ఇంకో ఆరుగురు అమ్మాయిలనూ ఇలాగే మోసగించాడన్నారు. తెలియక తప్పు చేస్తే క్షమించవచ్చు. తెలిసీ మోసం చేసిన అతడు మారతాడని మీరెలా అనుకున్నారు! మీరు కాకపోతే మరొకరు అని అతని ధీమా. బహుశా అందుకే మిమ్మల్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కళ్లు తెరవండి. మీకు ఉద్యోగం వస్తే హాయిగా మరింత జల్సాలు చేస్తాడు. రేపొద్దున భావి పౌరులకు పాఠాలు చెప్పాల్సిన మీరు ఇంత అమాయకంగా ఉంటే ఎలా? వీలైనంత త్వరగా అతనికి విడాకులివ్వండి. అమ్మానాన్నల సహాయం తీసుకోండి. ప్రేమించడం తప్పుకాదు. కానీ అందుకు అర్హులేనా? కాదా? అన్నది పెళ్లికి ముందైనా ఆలోచించాలి. దురదృష్టవశాత్తూ చదువుకున్న అమ్మాయిలే ఇలాంటి మోసాలకు ఎక్కువగా గురవుతున్నారు. జీవితంలో స్థిరత్వం లేని వారికి, కోరుకోని వారికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. మంచి నిర్ణయంతీసుకోండి.

• కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

---

ఇలా చేయండి!

వేగంగా ఆహారం తింటున్నప్పుడు, నీళ్లు లేదా ఇతర పానియాలు గబగబా తాగుతున్నప్పుడు వెక్కిళ్లు వచ్చే అవకాశం ఎక్కువ. అలాంటప్పుడు ఏం చేయాలో పాలుపోదు. అయితే వంటగదిలోని చక్కెర, ఐస్‌వాటర్, తేనె వంటి పదార్థాలు వెక్కిళ్లను క్షణాల్లో మాయం చేయగలవు. ఎలాగో చూద్దాం...

# వెక్కిళ్లు తగ్గేందుకు...!



**చెమ్చాడు చక్కెర:** ఒక స్పూను చక్కెర వెక్కిళ్ల నుంచి సత్వర ఉపశమనాన్ని ఇస్తుంది. వెక్కిళ్లను ఆపేందుకు చాలామందికి తెలిసిన పద్ధతి ఇది.

**తేనె, వేడినీళ్లు:** నాలుక కింది భాగంలో కొద్దిగా తేనె కలిపిన నీళ్లను కొద్దిసేపు ఉంచుకొని మింగాలి. అలానే కొద్దిసమయం శ్వాస ఆపి ఉంచితే వెక్కిళ్లు తగ్గిపోతాయి.

**ఐస్ వాటర్:** కొద్దిగా ఐస్‌వాటర్‌ను నోట్లో వేసుకొని పుక్కిలించాలి. ఇలాచేస్తే కండరాలు అకస్మాత్తుగా పట్టేయడం తగ్గి, వెక్కిళ్ల సమస్య తగ్గుతుందని న్యూయార్క్‌కు చెందిన కార్డియాలజిస్టులు చెబుతున్నారు.

**నిమ్మరసం:** వెక్కిళ్లు వచ్చినప్పుడు నిమ్మపండు కొరికి రసం తాగితే చాలు చిటికెలో ఉపశమనం లభిస్తుందని ఒక పరిశోధనలో వెల్లడయింది.

---

పేరెంటచ్




# పిల్లల మనసుల్లోకి...!

ఉన్నట్లుండి కొంతమంది పిల్లలు గుంభనంగా ఉండిపోతారు. ఎవరైనా పలకరిస్తే, మొక్కుబడిగా సమాధానం చెబుతుంటారు. 'ఏమయ్యింద'ని అడిగితే 'ఏమీ లేద'ని అంటారు. వారికేమయ్యింది అనేంత వరకే తల్లిదండ్రులు ఆరా తీస్తారు. వారికి వచ్చిన కష్టనష్టం ఏమీ లేదని తెలియగానే వదిలేస్తారు. వాళ్ల మౌనం ఎక్కువ రోజులు అలాగే కొనసాగితే 'ఏదో మాయరోగం వచ్చిందేమిటి?' అంటూ అందరి ముందూ అసహనాన్ని వ్యక్తం చేస్తారు. ఇంకా కోపం వస్తే 'ఏం పుట్టింది నీకు?' అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తారు. దాంతో పిల్లలు కన్నీరు మున్నీరవుతారు కానీ తమ బాధను వ్యక్తం చేయకుండానే ఉండిపోతారు. ఎందుకంటే తనకు జరిగిన కష్టనష్టాలే తప్ప తన ఆత్మీయుల బాధలేవీ పెద్దలకు పట్టవనే భావనతో చాలామంది పిల్లలు ఉంటారు. అందువల్ల తన ఆప్తమిత్రుల బాధ గురించి చెబితే, ఎగతాళిగా నవ్వుతారేమో అనుకుంటారు. 'వాడికేదో అయితే నీకేమయ్యింది?'అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడతారని బాధనంతా గుండెలోనే దాచుకుని తల్లిదండ్రుల ముందు మౌనంగా ఉండిపోతారు. సరిగ్గా అలాంటి స్థితిలో పిల్లలు ఎందుకంతగా కలతపడుతున్నారో కాస్త లోతుగా పరిశీలించాల్సిన బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలి.

నిజానికి తమ ఆత్మీయ మిత్రులకు సంబంధించి జరగరానిది ఏదైనా జరిగినప్పుడు ఆ లేత హృదయాలు విలవిల్లాడిపోతాయి. పిల్లల హృదయాలు కేవలం అమ్మమ్మలూ నానమ్మలకే పరిమితమై ఉండవు. వాళ్లకు ఆవల ఉన్న మరెంతో మంది స్నేహితులతో ముడిపడి ఉంటాయి. వాళ్లకేదైనా అయితే వీళ్ల గుండె బరువెక్కిపోతుంది. కారణం ఏదైతేనేం... మిత్రుల కళ్లల్లో కన్నీరు ఉబికినా పిల్లల గుండె తడిసిపోతుంది. తిండి తినరు... సరిగా నిద్రపోరు. అందుకే వారి ముఖం వాడిపోయి, కళ్లు వాలిపోయి ఉంటాయి. అలాంటప్పుడు ప్రత్యక్షంగా పిల్లలకు ఏమయ్యింది? అనే విషయానికే పరిమితమైపోకుండా, వారి ఆత్మీయ మిత్రులకు ఏమయ్యిందో కూడా తల్లిదండ్రులు తెలుసుకోవాలి. పెద్దవాళ్లకు తమదైన ఒక ప్రపంచం ఉన్నట్లే, చిన్న పిల్లలకు కూడా వారిదైన ఒక చిన్న ప్రపంచం ఉంటుంది. అందులో ఎక్కడ ఏం జరిగినా వారి మనసులు కల్లోలానికి లోనవుతాయి. ఎవరి కంటా పడకుండా కన్నీటి పర్యంతం అవుతుంటారు. అలాంటప్పుడు తలితండ్రులు వాళ్లకు ఓదార్పునిచ్చే నాలుగు మాటలు చెప్పగలగాలి. వీలైతే వారి ఆప్తమిత్రుల ఇళ్లకు పిల్లల్ని తీసుకు వెళ్లాలి. అంతమాత్రాన వాళ్ల కలత పూర్తిగా తొలగిపోతుందని కాదు గానీ, కొంతలో కొంత గుండె బరువు తగ్గుతుంది. ఆ బాధనుంచి కాస్త తొందరగా కోలుకునే మానసిక స్థితి ఏర్పడుతుంది. దీనికి తోడు తల్లిదండ్రులు తన బాధను అర్థం చేసుకున్నారనే గొప్ప సంతోషమూ పిల్లలకు కలుగుతుంది. అందుకే కేవలం తమ పిల్లలపైనే కాకుండా, పిల్లల ఆప్తమిత్రుల పట్ల కూడా కొంత మనసు పెడితే అది నిజంగా గొప్ప విషయమే అవుతుంది.

'అల్ ఖైదా' అధినేత ఒసామా బిన్ లాడెన్, 'ఐసిస్' చీఫ్ అబూ బకర్ అల్ బాగ్దాదీ లాంటి ఉగ్రవాదులకూ, సద్దామ్ హుస్సేన్, కల్నల్ గడాఫీ లాంటి పాలకులకూ పోలిక ఏమిటి? వ్యక్తిగత సిద్ధాంతాలు, చేసిన పోరాటాలు వేరైనా, అగ్రరాజ్యం అమెరికాతో వైరం... ఆఖరి దశలో మరణం! ఆ నలుగురి కథలో క్లైమాక్స్ ఇదే...



# అందరి క్లైమాక్స్ అదే!

### అబూ బకర్ అల్ బాగ్దాదీ

'ఇస్లామిక్ స్టేట్' (ఐసిస్) పేరిట ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేసి, వేల మందిని బలితీసుకున్న ఉన్మాది అబూ బకర్ అల్ బాగ్దాదీ. అతడి చేతిలో అత్యాచారానికి, దారుణ హత్యకు గురైన అమెరికా మానవతావాది 'ఖైలా ముల్లర్' పేరుతో నిర్వహించిన ఆపరేషన్‌లో బాగ్దాదీ మరణించాడు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌కు ఉత్తరాన ఉన్న సమర్రాలో 1971లో అబూ బకర్ పుట్టాడు. 2010లో బాగ్దాదీ ఇరాక్‌లోని అల్‌ఖైదాకు నాయకుడయ్యాడు. 2013లో దాని నుంచి విడిపోయి, 'ఐసిస్'కు బీజం వేశాడు. ఇరాక్‌లో షియా నేతృత్వంలోని ప్రభుత్వం, దానికి మద్దతునిస్తున్న అమెరికా సంకీర్ణ బలగాలపై దాడులు చేశాడు. దీంతో అమెరికా, ఇరాక్, కుర్దు సేనలు వెంటబడటంతో ప్రాణ భయంతో ఎవరికీ అనుమానం రాకుండా సాధారణ వాహనాల్లో ప్రయాణించడం మొదలుపెట్టాడు.

**సొరంగంలోకి పారిపోయినా...**

బాగ్దాదీ కోసం తీవ్రంగా గాలింపు మొదలుపెట్టిన అమెరికా నిఘా వర్గాలు... బారిషా గ్రామంలోని ఓ ఇంట్లో అతడు ఉన్నాడని తెలుసుకున్నాయి. ఎనిమిది హెలికాప్టర్లలో డెల్టా ఫోర్స్ కమెండోలు ఆ ప్రాంగణాన్ని చుట్టుముట్టారు. ప్రహరీ పేల్చి లోపలికి ప్రవేశించారు. కమెండోల కాల్పుల్లో అతడి అనుచరులు మరణించారు. భయంతో వణికిపోయిన బాగ్దాదీ ఆ ఇంట్లోని సొరంగంలోకి పారిపోయాడు. రక్షణ కవచంగా తన ముగ్గురు సంతానాన్నీ తీసుకెళ్లాడు. సైనిక జాగిలం తరమడంతో సొరంగం చివరకు వెళ్లి, తనను తాను పేల్చుకుని చచ్చిపోయాడు.

### ఒసామా బిన్ లాడెన్



ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్ ప్రపంచానికి కంటిపై కునుకు లేకుండా చేశాడు. 1957 మార్చి 10న సౌదీ అరేబియాలోని రియాద్‌లో పుట్టిన లాడెన్... పాకిస్థాన్‌లోని ముజాహిదీన్ దళంలో చేరాడు. అఫ్ఘనిస్థాన్‌లో సోవియట్ యూనియన్ దళాలపై పోరాటం చేస్తున్న ముజాహిదీన్‌లకు లాడెన్ అరబ్ దేశాల నుంచి ఆయుధాలు, డబ్బు సరఫరా చేసేవాడు. తరువాత 1998లో అల్‌ఖైదా అనే ఉగ్రవాద సంస్థను స్థాపించాడు. ఆ వెంటనే అమెరికాపై యుద్ధం ప్రకటించాడు. అమెరికా దౌత్య కార్యాలయంపై బాంబులు కురిపించాడు. అన్నింటి కన్నా 2001 సెప్టెంబర్ 11న న్యూయార్క్‌లోని 'ట్విన్ టవర్స్'పై చేసిన విమాన దాడి యావత్ ప్రపంచాన్నీ వణికించింది. నాలుగు అమెరికా ప్యాసింజర్ విమానాలను హైజాక్ చేసిన అల్‌ఖైదా ఉగ్రవాదులు... రెండింటితో 'వరల్డ్ ట్రేడ్ సెంటర్'లోని ట్విన్ టవర్స్‌ను కూల్చివేశారు. ఈ ఉదంతంలో 2,977 మంది పౌరులు బలయ్యారు. దీంతో లాడెన్ పేరును మోస్ట్ వాండెట్ లిస్టులో పెట్టింది అమెరికా!

**చావు ఎలా వచ్చిందంటే...**

'నావల్ స్పెషల్ వార్‌ఫేర్ డెవలప్‌మెంట్ గ్రూప్' (సీల్) అతడి కోసం 'ఆపరేషన్ నెప్ట్యూన్ స్పియర్' పేరిట వేట మొదలుపెట్టింది. చివరకు పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో ఉంటున్నట్టు పసిగట్టిన 'సీల్'... పాక్ ఆర్మీ సహకారంతో లాడెన్ ఇంటిని గుర్తించింది. 2011 మే 1న అర్ధరాత్రి వేళ దాడికి సిద్ధమైంది. ఊహించని ఈ దాడితో లాడెన్ ఇంట్లో పరుగులు తీశాడు. అతడిని వెంటాడిన కమెండోలు... తుపాకీ గుళ్ల వర్షం కురిపించారు. లాడెన్‌ను అంతం చేశారు.

### గడాఫీ



'కల్నల్ గడాఫీ' 1962 జూన్ 6న ఇటాలియన్ లిబియాలోని సిర్టేలో పుట్టాడు. ఆ తరువాత అరబ్ జాతీయుడిగా మారాడు. నాలుగు దశాబ్దాలకు పైగా లిబియాను పరిపాలించాడు. తనను తాను విప్లవానికి మార్గదర్శకుడిగా, రారాజుగా ప్రకటించుకున్నాడు. భారీగా అవినీతి సొమ్ము సంపాదించి, దానిని విదేశీ బ్యాంకుల్లో దాచుకున్నాడనే ఆరోపణలు అతడిపై ఉన్నాయి. 1977లో ప్రజా విప్లవాన్ని ప్రకటిస్తూ... 'లిబియన్ అరబ్ రిపబ్లిక్'గా ఉన్న దేశం పేరును 'గ్రేట్ సోషలిస్ట్ పీపుల్స్ లిబియన్ అరబ్ జమాహిరియా'గా మార్చాడు. లండన్‌లోని లిబియన్ ఎంబసీ ముందు మహిళా పోలీస్‌ను చంపిన ఉదంతంతో... గడాఫీ ప్రభుత్వంతో బ్రిటన్ సంబంధాలు తెంచుకుంది. పెచ్చరిల్లిన అవినీతి, నిరుద్యోగ సమస్యలతో 2011లో లిబియాలో పెద్ద ఎత్తున అంతర్యుద్ధం మొదలైంది. గడాఫీ వ్యతిరేక 'నేషనల్ ట్రాన్సిషనల్ కౌన్సిల్' (ఎన్‌టీసీ) ఆయుధాలతో దాడులకు తెగబడింది.

**డ్రైనేజీ పైపుల్లో దాక్కున్నా...**

చావు తప్పదని తెలుసుకున్న గడాఫీ స్థావరాలు మారుస్తూ పారిపోయేందుకు ఎత్తులు వేశాడు. నాటో బాంబు దాడుల నుంచి తప్పించుకోవడానికి డ్రైనేజీ పైపుల్లో దాక్కున్నాడు. అతడి భద్రతా సిబ్బంది రెబల్స్‌తో పోరాడుతుండగా... ఓ గ్రెనేడ్ పేలి అతడి తలకు తీవ్ర గాయమైంది. బట్టలు చినిగిపోయాయి. అర్ధనగ్నంగా పడివున్న అతడిని ఆస్పత్రికి తరలించే లోపు మృతిచెందాడు. తిరుగులేని నియంతగా విలాసవంతమైన జీవితం గడిపిన గడాఫీ ప్రస్థానం 2011 అక్టోబర్ 20న ముగిసింది.

### సద్దాం హుస్సేన్



దాదాపు రెండున్నర దశాబ్దాలు ఇరాక్ అధ్యక్షుడిగా అప్రతిహిత పాలన సాగించిన సదాం హుస్సేన్ 1937 ఏప్రిల్ 28న జన్మించాడు. విదేశీ యాజమాన్యంలో ఉన్న ఇరాక్ ఆయిల్ కంపెనీలను జాతీయాకరణ చేయడం దేశంలోని సామ్రాజ్యవాదులకు మింగుడు పడలేదు. ఆయన ఇరాక్‌లో మైనారిటీలైన సున్నీ ముస్లిం కావడంతో షియాల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. వీటికితోడు ఇరాక్ కమ్యూనిస్టు పార్టీ, కుర్ద్ తిరుగుబాటుదారులు కూడా ఆయనను వ్యతిరేకించారు. వీరందరినీ సద్దామ్ తీవ్రంగా అణచివేసే ప్రయత్నం చేశాడు.

**చివరకు ఏం జరిగిందంటే...**

అమెరికా సైన్యం 2003 ఏప్రిల్‌లో ఇరాక్ ఆక్రమణ కోసం 'ఆపరేషన్ రెడ్ డాన్' నిర్వహించింది. ఈ యుద్ధంలో శత్రు సేనల ధాటికి సద్దాం ఎదురు నిలవలేకపోయాడు. ప్రాణాలు కాపాడుకొనేందుకు రాజసౌధం విడిచి పారిపోయాడు. అమెరికా సైన్యం వేటాడింది. ఓ ఫామ్‌హౌస్‌లో ఉన్న బంకర్‌లో తలదాచుకున్న సద్దామ్‌ను బందీగా పట్టుకుంది. కాల్పుల్లో అతడి కుమారులు ఉదయ్, ఖుసే, మనవడు ముస్తఫా మరణించారు. ఇరాక్ న్యాయస్థానం సద్దాంపై విచారణ చేపట్టింది. 2006 డిసెంబర్ 30న ఉరితీసింది.

**వినూత్నం**

# మొక్క నాటితే బిల్లు తగ్గిస్తారు!

విహారయాత్రలకు వెళ్లినప్పుడు హోటళ్లు, రిసార్టుల్లో బస చేయాలంటే అంత ఖర్చు పెట్టడం అవసరమా అని ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తాం. కానీ లండన్‌లోని 'న్యూ ఫిన్నిష్ రిసార్ట్'లో తక్కువ ఖర్చుతోనే ఆతిథ్యం స్వీకరించవచ్చు. తమ రిసార్ట్‌కి వచ్చిన అతిథులు ఒక మొక్క నాటినా లేదా విద్యుత్‌ను పొదుపుగా వాడినా బిల్లులో భారీ తగ్గింపు కూడా ఇస్తారు. ఫిన్లాండ్ మున్సిపాలిటీ పరిధిలో 450 కిలోమీటర్ల దూరంలో ఉందీ రిసార్ట్. 2022లో ప్రారంభం కానున్న 'ఆర్కిటిక్ బ్లూ రిసార్ట్' కస్టమర్లు వినియోగించే నీటి పరిమాణం, విద్యుత్ వాడకం, ఆహార అలవాట్లను గమనించి వారికి బిల్లులో సగానికి సగం తగ్గింపును ఇస్తారు. సమీపంలోని అడవిలో ఒక మొక్క నాటితో అదనంగా 5శాతం తగ్గింపు పొందొచ్చు. ప్రకృతికి ఏమాత్రం హాని చేయకపోవడం, కాలుష్యం కారణంగా పర్యావరణానికి జరుగుతోన్న నష్టాన్ని తగ్గించడం ఈ రిసార్ట్ ఉద్దేశం. 'మా రిసార్ట్‌కు ఎవరైనా రావొచ్చు. మా గెస్టులను ఎకోఫ్రెండ్లీ లైఫ్ స్టయిల్ అనుసరించాలనే ఉద్దేశంతోనే వారికి బిల్లులో డిస్కౌంట్ ఇస్తున్నాం" అంటారు మార్కెటింగ్, కమ్యూనికేషన్ స్ట్రాటజిస్ట్ సిమన్ బొసెడి.



**రెన్యూవబుల్ ఎనర్జీ...**

"మా రిసార్ట్ ప్రశాంత వాతావరణానికి మారు పేరుగా ఉండాలనుకున్నాం. అందుకే అతిథులను డిజిటల్ వస్తువులకు దూరంగా ఉండేలా ప్రోత్సహిస్తాం"అని అంటారు ఆర్కిటిక్ బ్రాండ్స్ వైస్-ప్రెసిడెంట్ మిక్కో స్నూఫ్. ఈ రిసార్ట్‌లో సొంత నీటి నిర్వహణ వ్యవస్థ ఉంది. రెన్యూవబుల్ ఎనర్జీ వాడతారు. సీజన్‌లో స్థానికంగా లభించే పదార్థాలతో వండిన భోజనాన్నే అతిథులకు రుచి చూపిస్తారు. "పర్యావరణ సంరక్షణ బాధ్యతను చాటిచెప్పడంలో ఆర్కిటిక్ బ్లూ రిసార్ట్‌ను ముందంజలో నిలపడం, పర్యాటకం మీద నెగటివ్ ప్రభావం పడకుండా చూడడం మా లక్ష్యం" అంటున్నారు స్థానిక మేయర్ జెరే పెంట్టిలా. పర్యావరణహితంగా, పర్యాటకులకు బడ్జెట్ పరంగా ఉన్న ఈ రిసార్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది.

**తెలుసా!**

# స్ట్రీమింగ్‌తో చేటే!

ఇంట్లో కూర్చుని నెట్‌ఫ్లిక్స్‌లో సినిమా చూస్తున్నారా? అమెజాన్ ప్రైమ్‌లో వెబ్ సిరీస్‌ను వీక్షిస్తున్నారా? అయితే పర్యావరణానికి మీరు చేస్తున్న హాని ఎంతో తెలుసా? అరగంట పాటు నెట్‌ఫ్లిక్స్ ఉపయోగిస్తే 1.6 కేజీల కార్బన్‌డయాక్సైడ్ విడుదలవుతుంది. ఇది మీరు వాహనంపై 6.28 కి.మీ ప్రయాణిస్తే వెలువడే ఉద్గారాలకు సమానం. ఇప్పుడర్థమయిందా? మీరు పర్యావరణానికి ఎంత హాని చేస్తున్నారో!


- డిజిటల్ వీడియోల సైజు పెద్దదిగా ఉంటుంది. అంతే కాకుండా ఇప్పుడన్నీ హైడెఫినిషన్ వీడియోలే. ఈ వీడియోలు రన్ కావాలంటే ఎక్కువ ఎనర్జీ అవసరం.
- కన్జ్యూమర్ టెక్నాలజీ అసోసియేషన్ వారి అంచనా ప్రకారం 2021 కల్లా స్క్రీన్ సైజులు 50 అంగుళాల మేర పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల డివైజ్ మరింత ఎక్కువ శక్తిని వినియోగించుకుంటుంది. అంటే కర్బన ఉద్గారాల విడుదల ఎక్కువగా అవుతుంది.
- హై డెఫినిషన్ స్క్రీన్స్‌తో పోలిస్తే 4కె రెజల్యూషన్ స్క్రీన్‌లు 30 శాతం ఎక్కువగా ఎనర్జీని వినియోగించుకుంటాయి.
- 2022 కల్లా వెబ్‌లో వీడియోలు చూసే వారి సంఖ్య నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని సిస్కో నెట్‌వర్క్ అంచనా వేస్తోంది.
- నెట్‌ఫ్లిక్స్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. అదే సమయంలో డిస్నీ, యాపిల్ సంస్థలు సొంతగా స్ట్రీమింగ్ సర్వీసులను ప్రారంభిస్తున్నాయి.
- యాపిల్ టీవీ ప్లస్ పేరుతో నవంబర్ 1 నుంచి స్ట్రీమింగ్ సర్వీసులను 100 దేశాల్లో అందుబాటులోకి తెస్తోంది.
- నవంబర్ 12న డిస్నీ యూఎస్, కెనడా, నెదర్లాండ్స్ దేశాల్లో స్ట్రీమింగ్ సర్వీసులను ప్రారంభిస్తోంది. ఆ తరువాత ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానుంది.
- ఎన్‌బిసి యూనివర్సల్ పికాక్ సర్వీస్‌ను వచ్చే ఏడాది ప్రవేశపెట్టనుంది.
- వచ్చే ఏడాది ప్రపంచవ్యాప్తంగా స్ట్రీమింగ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 93 కోట్లకు చేరే అవకాశం ఉంది. 2021 కల్లా 16 శాతం పెరిగి ఆ సంఖ్య 110 కోట్లకు చేరే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా.





**చేసేయండి!**

## మెరిసే కొవ్వొత్తి


1) చతురస్రాకారపు కాగితం తీసుకోండి. చిత్రంలో చూపిన విధంగా A, B అనే రెండు పాయింట్లను మధ్య వైపు మడవండి. ఇప్పుడు సమాన నిష్పత్తిలో 1, 2 పాయింట్లను వెనకకు మడవండి.




2) వరుసగా E, F పాయింట్లు తాకేలా C, D రెండు పాయింట్లను మడవండి. తరువాత 3 అంకెను వేసిన భాగాన్ని ఒక సెంమీ వరకు పైకి మడవండి.



3) చిత్రంలో చూపిన విధంగా కాగితం తిప్పి G రాసి ఉన్న పాయింట్‌ను కిందకు, పైకి మడవండి.




4) కాగితాన్ని మరొకసారి వెనకకు తిప్పి H, i పాయింట్లను కిందకు మడవండి. ఇప్పుడు కొవ్వొత్తి మాదిరిగా స్థూపాకార ఆకారం ఏర్పడటానికి i, K భాగాలను వరుసగా J, L పాయింట్లలోకి దూర్చండి.




5) మంటను సృష్టించడానికి పైభాగంలో కాగితాన్ని కొంచెం లాగి మెలి పెట్టండి.




## దారి కనుక్కోండి?



## బొమ్మ గీయండి



## సరైన నీడను గుర్తించండి



## డైలీ సుడోకు -180

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | 5 | 7 | | | 6 |
| 9 | | 7 | | 6 | | 8 | | |
| 5 | | 6 | | | 1 | | 2 | |
| | | 1 | | | | | 7 | |
| | | | 5 | | 2 | | | |
| | 3 | | | | | 5 | | |
| | 8 | | 7 | | | 6 | | 3 |
| | | 3 | | 1 | | 9 | | 2 |
| 2 | | | 3 | 9 | | | | |

**సుడోకు - 179 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 3 | 7 | 9 | 5 | 1 | 2 | 4 | 6 |
| 9 | 1 | 2 | 7 | 6 | 4 | 3 | 8 | 5 |
| 6 | 5 | 4 | 2 | 8 | 3 | 7 | 1 | 9 |
| 4 | 7 | 6 | 5 | 1 | 2 | 9 | 3 | 8 |
| 3 | 9 | 1 | 8 | 7 | 6 | 5 | 2 | 4 |
| 2 | 8 | 5 | 3 | 4 | 9 | 6 | 7 | 1 |
| 7 | 4 | 8 | 6 | 2 | 5 | 1 | 9 | 3 |
| 5 | 2 | 9 | 1 | 3 | 8 | 4 | 6 | 7 |
| 1 | 6 | 3 | 4 | 9 | 7 | 8 | 5 | 2 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

## కొత్త ప్రయాణం మొదలైంది

**- మంచు మనోజ్**



మంచు మనోజ్ కొత్త జర్నీ ప్రారంభించారు. 'ఎమ్ఎమ్ ఆర్ట్స్' పేరుతో ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించి ఇకపై ఆ బ్యానర్‌లో సినిమాలు తీయబోతున్నారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. "నా కొత్త జర్నీ మొదలైంది. ఇకపై నా ప్రొడక్షన్ హౌస్ 'ఎమ్ఎమ్ ఆర్ట్స్' నిర్మాణంలోనే నా సినిమాలు వస్తాయి. అలాగే కొత్త టాలెంట్‌ను వెలికితీసి వారిని ప్రోత్సహించాలనే నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాను. ముందుముందు మా ప్రొడక్షన్ హౌజ్ నుంచి వచ్చే మంచి సినిమాలను మీరు చూస్తారు" అని ట్విట్టర్‌లో మనోజ్ రాసుకొచ్చారు.

## బామ్మకూ నచ్చింది

**- కార్తి**



ఎస్.ఆర్. ప్రభు, కార్తి, రాధామోహన్


"రవితేజగారు ఫోన్ చేసి 'నాకూ ఖైదీలాంటి చిత్రం చేయాలనుంది' అన్నారు. క్లైమాక్స్‌లో గన్ పట్టుకునే సీన్ వచ్చినవెంటనే థియేటర్లలో 'హ్యాపీ దీపావళి' అని ప్రేక్షకులు అరుస్తున్నారు. ఓ బామ్మ ఫోన్ చేసి, గొప్ప చిత్రం చేశామని మెచ్చుకున్నారు. రివ్యూ చెప్పారు. బామ్మకూ నచ్చిందీ యాక్షన్ చిత్రం. అదే నిజమైన సక్సెస్" అని కార్తి అన్నారు. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో కార్తీ హీరోగా నటించిన చిత్రం 'ఖైదీ'. ఎస్ఆర్ ప్రభు, ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, తిరుప్పూర్ వివేక్ నిర్మాతలు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ కెకె రాధామోహన్ సమర్పకులు. ఈ నెల 25న విడుదలైంది. బుధవారం సక్సెస్‌మీట్ నిర్వహించారు. కెకె రాధామోహన్ మాట్లాడుతూ "సినిమాపై నమ్మకం ఉన్నప్పటికీ... 'హీరోయిన్ లేదు. పాటలు లేవు. ప్రేక్షకాదరణ ఎలా ఉంటుందో' అని చిన్న అనుమానం ఉండేది. కంటెంట్ ఉన్న చిత్రాలకు ఆదరణ ఉంటుందని మరోసారి రుజువైంది. మల్టీప్లెక్స్‌లో షోలు పెంచుతున్నారు. థియేటర్లు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. కుటుంబమంతా చూడదగ్గ చిత్రమిది" అన్నారు. కార్తి మాట్లాడుతూ "తప్పకుండా 'ఖైదీ 2' ఉంటుంది. 30 రోజులు డేట్స్ ఇస్తే సీక్వెల్ తీద్దామని ప్రభు అంటున్నాడు. 'ఖైదీ' కోసం 60 రాత్రుళ్లు షూటింగ్ చేశా. (నవ్వుతూ) ఈసారి పగటిపూట షూటింగ్ చేసే కథ తీసుకురమ్మని చెప్పా" అన్నారు. ఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ "తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ, ప్రపంచవ్యాప్తంగా 'ఖైదీ' అద్భుత విజయం సాధించింది" అన్నారు.

## సస్పెన్స్ థ్రిల్లర్...



శిరీష, సాయికృష్ణ

తల్లాడ సాయికృష్ణ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బ్లాక్ బోర్డ్'. శిరీషారావు కథానాయిక. తల్లాడ శ్రీనివాస్ నిర్మాత. ఇటీవల హీరో ప్రిన్స్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. సాయికృష్ణ మాట్లాడుతూ "ఇదొక సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్. షూటింగ్ అంతా ఖమ్మం జిల్లాలో జరిగింది" అని అన్నారు. షూటింగ్ పూర్తయింది. త్వరలో నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను విడుదల చేస్తాం" అని నిర్మాత చెప్పారు.



తరుణ్ భాస్కర్, పూరి జగన్నాథ్, విజయ్ దేవరకొండ, సురేశ్‌బాబు, చార్మి

## కొత్తవాళ్లను ప్రోత్సహించడం నా బాధ్యత

**- విజయ్ దేవరకొండ**

"నా విజయాలకు దర్శకులు తరుణ్ భాస్కర్, సందీప్‌రెడ్డి వంగా, పరశురామ్ కారణం. చాలామంది మద్దతుతో నేను ఈ స్థానంలో ఉన్నాను కనుక కొత్తవాళ్లకు మద్దతు ఇస్తున్నా. కొత్తవాళ్లను ప్రోత్సహించడం నా బాధ్యత. ఈ సినిమా ప్రేక్షకులందరికీ నచ్చుతుంది" అన్నారు విజయ్ దేవరకొండ. తరుణ్ భాస్కర్ హీరోగా షమ్మీర్ సుల్తాన్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. అనసూయ, అభినవ్ గోమటం, వాణీ భోజన్ ప్రధాన పాత్రల్లో నటించారు. నవంబర్ 1న సినిమా విడుదల కానుంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. అతిథిగా హాజరైన డి. సురేశ్‌బాబు మాట్లాడుతూ "ఇప్పుడు విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్ సక్సెస్‌ఫుల్ పీపుల్. వాళ్లు ఎదిగిన తీరు చూస్తుంటే ముచ్చటగా ఉంది. చిన్న చిత్రాలకు మద్దతు ఇస్తున్న విజయ్ దేవరకొండకు ఈ చిత్రం పెద్ద విజయం అందించాలి" అన్నారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ "విజయ్ దేవరకొండ నాన్నగారు గోవర్ధన్‌తో కలిసి నేను పని చేశా. ఆయన చాలామంచి వ్యక్తి. వాళ్లబ్బాయితో కలిసి పని చేయబోతున్నా. ప్రేక్షకుడిలా నేనూ 'మీకు మాత్రమే చెప్తా' కోసం ఎదురుచూస్తున్నా" అన్నారు. "విజయ్ దేవరకొండతో చిత్రాలు చేసిన నిర్మాతలందరికీ డబ్బులు వచ్చాయి. నిర్మాతగా విజయ్‌కు ఈ సినిమాతో డబ్బులు, పేరు రావాలి" అని పరశురామ్ అన్నారు. "నా ఉన్నతిలో మా నాన్నగారి మద్దతు మరువలేనిది. నాకు నటన అంటే ఇష్టం కనుక నటుడిగా సినిమాలు చేస్తున్నా" అని తరుణ్ భాస్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో 'మధుర' శ్రీధర్, అవంతిక తదితరులు పాల్గొన్నారు.



దేవిశ్రీ, రవిశంకర్, నవీన్, సుకుమార్, అల్లు అర్జున్, అల్లు అరవింద్

## ముచ్చటగా మూడోసారి!

అల్లు అర్జున్ దూకుడు పెంచారు. ప్రస్తుతం తివిక్రమ్ దర్శకత్వంలో 'అల .. వైకుంఠపురములో..' చిత్రం నిర్మాణంలో ఉండగానే , మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. 'ఆర్య', 'ఆర్య 2' చిత్రాలతో తన కెరీర్‌కు ఊపు ఇచ్చిన దర్శకుడు సుకుమార్‌తో చేతులు కలిపారు. చాలా కాలం గ్యాప్ తర్వాత మళ్లీ వీరిద్దరి కాంబినేషన్‌లో మూడో చిత్రం బుధవారం ఉదయం మొదలైంది. మైత్రీ మూవీ మేకర్స్, ముత్తంశెట్టి మీడియా సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రష్మిక మందన్న చిత్ర కథానాయిక. దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకుడు. అల్లు అర్జున్, దేవిశ్రీప్రసాద్ , సుకుమార్ కాంబోలో వచ్చిన 'ఆర్య', 'ఆర్య 2' చిత్రాలు మ్యూజికల్ హిట్స్ అయిన సంగతి విదితమే. భారీ అంచనాల మధ్య మొదలైన ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి విశేషాలను నిర్మాతలు త్వరలో వెల్లడిస్తారు. ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడు: మిరోస్లోవ్ కుబ బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఎడిటింగ్: కార్తిక్ శ్రీనివాస్, కళ: రామకృష్ణ, మౌనిక, సీ.ఈ. ఓ: చెర్రీ, లైన్ ప్రొడ్యూసర్: బాలసుబ్రహ్మణ్యం కె.వి.వి., సహ నిర్మాత: ముత్తంశెట్టి మీడియా, నిర్మాతలు: నవీన్ ఎర్నేని, రవిశంకర్ వై.



ప్రిన్స్, అవంతిక, రుతుజా, తారకరత్న

## ట్రైన్ జర్నీలో నో ఎగ్జిట్

తారకరత్న, ప్రిన్స్ హీరోలుగా రూపుదిద్దుకొనే 'ఎస్ 5- నో ఎగ్జిట్' చిత్రం షూటింగ్ సోమవారం ప్రారంభమై కొనసాగుతోంది. సన్నీ కోమలపాటి దర్శకత్వంలో రాహుల్, గౌతమ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కథ విన్న గంటలోనే నిర్మాతలు ఈ సినిమా నిర్మించడానికి ముందుకు వచ్చారు. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఈ సినిమా ఉంటుంది. ప్రత్యేకంగా ఓ ట్రైన్ సెట్ నిర్మించాం. భారతదేశంలోనే తొలి సారిగా 'రెడ్ రేంజర్ విస్టా' కెమెరాను మీ సినిమా కోసం ఉపయోగిస్తున్నాం. ఈ కథ వినగానే సంగీత దర్శకుడు మణిశర్మగారు చాలా ఇంప్రెస్ అయ్యారు. ప్రయాణంలో నో ఎగ్జిట్ అనేది ఉంటే ఆ ప్రయాణం ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉంటుంది.' అని తెలిపారు. నిర్మాతలు గౌతమ్ కంటిపూడి, రాహుల్ రెడ్డి మాట్లాడుతూ 'కథ విన్న 40 రోజుల్లోనే సినిమాను సెట్స్ మీదకు తెచ్చాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే సినిమా అవుతుంది. హైదరాబాద్‌లో శివార్లలోని ఖానాపూర్‌లో వేసిన ట్రైన్ సెట్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తాం. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేసి డిసెంబర్‌లో తొలి కాపీ సిద్ధం చేస్తాం' అని తెలిపారు. తారకరత్న, ప్రిన్స్, అవంతిక, రుతుజా, అలీ, సాయికుమార్, రఘు కారుమంచి, ఫిష్ వెంకట్, సంజయ్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.



## తొలిసారి థ్రిల్లర్ చేస్తున్నా

**- రామ్**

"కెరీర్‌లో తొలిసారి ఒక థ్రిల్లర్ చేస్తున్నా. ఇందులో కమర్షియల్ హంగులు, మాస్-క్లాస్ అంశాలు... అన్నీ ఉంటాయి. ప్రీ ప్రొడక్షన్ అంతా పక్కాగా పూర్తి చేసి, నా లుక్ సెట్ చేసి, టైటిల్ ఫిక్స్ చేశాక... ప్రేక్షకుల ముందుకు వద్దామనుకున్నాం. అందుకని, 'ఇస్మార్ట్ శంకర్' విడుదల తర్వాత కాస్త ఆలస్యమైంది" అని రామ్ అన్నారు. ఆయన హీరోగా 'స్రవంతి' రవికిశోర్ నిర్మిస్తున్న తాజా చిత్రం రెడ్. కిశోర్ తిరుమల దర్శకుడు. కృష్ణ పోతినేని చిత్రసమర్పకులు. బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి పూరి జగన్నాథ్ క్లాప్ ఇవ్వగా, 'జెమినీ' కిరణ్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ "మా చిత్రానికి ముందు రామ్‌కి 'ఇస్మార్ట్ శంకర్' వంటి భారీ విజయం ఇచ్చిన పూరి, ఛార్మీగారికి థ్యాంక్స్. మరో సూపర్‌హిట్ ఇవ్వాల్సిన బాధ్యత మాపై ఉంది. నవంబర్ 16న సినిమా సెట్స్ మీదకు వెళుతుంది. నాన్ స్టాప్‌గా షూటింగ్ చేస్తాం. ఏప్రిల్ 9, 2020న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. కిశోర్ తిరుమల మాట్లాడుతూ "రామ్‌గారితో స్రవంతి మూవీస్‌లో నాకు మూడో చిత్రమిది. కథ, కథనం కొత్తగా ఉంటాయి. థ్రిల్లర్ అయినప్పటికీ కమర్షియల్‌గా ఉంటుంది. ప్రేక్షకులు ఆశించే అంశాలు అన్నీ సినిమాలో ఉంటాయి. తొలిసారి మణిశర్మగారితో పని చేస్తున్నా" అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు బీవీఎస్ఎన్ ప్రసాద్, దామోదర ప్రసాద్, రామ్ ఆచంట, గోపీ ఆచంట, సూర్యదేవర నాగవంశీ తదితరులు పాల్గొన్నారు.

## రవితేజతో రెండోసారి!



'బలుపు'లో రవితేజ, శ్రుతీ హాసన్ జంట సందడి చేసింది. ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది. వీళ్లిద్దరూ మరోసారి జంటగా నటించనున్నారు. 'డాన్ శీను', 'బలుపు' తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేనితో రవితేజ మచ్చటగా మూడో చిత్రం చేయడానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. 'ఠాగూర్' మధు నిర్మించనున్న ఈ చిత్రాన్ని దీపావళి సందర్భంగా ప్రకటించారు. ఇందులో శ్రుతీ హాసన్ కథానాయికగా నటించనున్నారు. రవితేజతోనే కాదు, 'బలుపు' తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేనితోనూ ఆమెకు రెండో చిత్రమిది. నవంబర్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది.

## ఏయన్నార్ మనతో ఉంటే... ఆయనతో చేసేవాణ్ణి!

**- రవిబాబు**



రవిబాబు, శ్రీముక్త

"నేను ప్రేక్షకులను భయపెట్టాలనుకోను... కథ చెప్పడంపై దృష్టి పెడతా. కథలో థ్రిల్స్ ఉంటాయి. 'ఆవిరి' హారర్ ఫిల్మ్ కాదు, థ్రిల్లర్! నా చిత్రాలు అన్నీ థ్రిల్లర్సే. ఆమ్రపాలి వరంగల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించినప్పుడు... ఆమె బంగ్లాలో దెయ్యం ఉందనే వార్త చూశా. ఈ నేపథ్యంలో కథ ఎందుకు చెప్పకూడదనే ఆలోచనతో ఫిక్షనల్ స్టోరీ రాశా. ఈ సినిమా తీశా" అని రవిబాబు అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఆవిరి'. నేహా చౌహాన్, శ్రీముక్త, భరణి శంకర్, ముక్తార్‌ఖాన్ ఇతర తారాగణం. 'దిల్' రాజు సమర్పకులు. నవంబర్ 1న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ "నేను చూసిన తెలుగు చిత్రాల్లో నచ్చిన చిత్రం 'బొమ్మరిల్లు'. 'దిల్'రాజుగారితో నాది పది పదిహేనేళ్ల స్నేహం. ఆయన్ను కలిసినప్పుడల్లా 'మీకు 'బొమ్మరిల్లు' కంటే మంచి చిత్రం చేసిపెడతా' అనేవాణ్ణి. కాకపోతే... ఎవరి చిత్రాలతో వాళ్లు బిజీ అయ్యేవాళ్లం. 'ఆవిరి' ఐడియా రాగానే రాజుగారికి చెప్పా. ఆయనకూ నచ్చింది. ఫస్ట్ కాపీ రెడీ అయ్యాక కనిపిస్తానని సినిమా తీసి ఆయన చేతిలో పెట్టా. ఇంతకు ముందు నేను తీసిన థ్రిల్లర్స్ 'అనసూయ', 'అవును', 'అవును 2'కు భిన్నంగా ఉంటుందీ చిత్రం. నా చిత్రాల్లో నేను నటించాలనుకోను. ఈ చిత్రంలో తండ్రి పాత్రకు చాలామందిని అనుకున్నా. సత్యానంద్‌గారి సలహా మేరకు నేనే చేశా" అన్నారు. దర్శకుడిగా, నటుడిగా తదుపరి చిత్రాల గురించి రవిబాబు మాట్లాడుతూ "ప్రస్తుతం ఐదారు కథలు ఉన్నాయి. ఓ కథ నన్ను ఎగ్జైట్ చేసింది. అమెరికాలో షూట్ చేయాలి. అందులో వృద్ధుడిది ప్రధాన పాత్ర. అక్కినేని నాగేశ్వరరావు (ఏయన్నార్) మనతో ఉండి ఉంటే... ఆయన దగ్గరకు వెళ్లి చేయమని రిక్వెస్ట్ చేసేవాణ్ణి. ఆ పాత్ర ఎవరితో చేయించాలని ఆలోచిస్తున్నా. 'అదుగో' పోస్ట్ ప్రొడక్షన్‌కు రెండున్నరేళ్లు పట్టడంతో నటుడిగా ఇతర చిత్రాలు చేయలేకపోయా. 'సాహో'నూ వదులుకున్నా. ఇప్పుడు అవకాశాలు వస్తే నటిస్తా" అన్నారు.








నైజాం: ఏషియన్ సినిమాస్, వైజాగ్: మోహిని ఫిలింస్, గుంటూరు: రాఘవేంద్ర ఫిలింస్-9963099995, క్రిష్ణా : వెంకట్ మూవీస్-9849346636, వెస్ట్ : వెంకట్ మూవీస్-9246664689, ఈస్ట్ గోదావరి : వెంకట్ మూవీస్-8897555559, సీడెడ్ : వెంకట్ మూవీస్-8328109848





*సమాజం నిరంతరం మార్పు చెందుతూనే ఉంటోంది. కొత్తదనాన్ని కోరుకోవడం, అందులోనూ ప్రత్యేకతను ప్రదర్శించాలనుకోవడం మానవ నైజం. అటువంటి భావనలపై ఆధారపడి అభివృద్ధి దిశలో పయనిస్తున్న రంగమే డిజైనింగ్. నేటి ఫ్యాషన్ యుగంలో ఆటోమొబైల్ నుంచి లైఫ్ స్టయిల్ వరకు.. సిరామిక్స్ నుంచి ఇంటీరియర్ వరకు ఇలా అన్ని రంగాల్లో ప్రొఫెషనర్ల డిజైనర్ల అవసరం ఎంతో ఉంటోంది. ఫలితంగా ఈ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకునేవారి సంఖ్య పెరుగుతోంది. డిజైనింగ్ రంగంపై ఆసక్తి ఉన్నవారి కోసం సంస్థలు ప్రత్యేకమైన కోర్సులను అందిస్తున్నాయి. వాటిలో ప్రతిష్ఠాత్మకమైంది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (నిడ్). **2020-21** విద్యా సంవత్సరానికి నిడ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో వివరాలను తెలుసుకుందాం..*

# కెరీర్‌ను డిజైన్ చేద్దాం..

మార్కెట్లోకి ప్రవేశించే ప్రతి వస్తువును ప్రత్యేకంగా రూపొందించాలంటే ప్రొఫెషనల్ డిజైనర్లు కావాల్సిందే. డిజైనింగ్ అంటే కేవలం ఫ్యాషన్ డిజైనింగ్ అనే భావన మాత్రమే ఉంది. కానీ మనం ఉపయోగించే మోటార్ బైక్ నుంచి టీవీ రిమోట్ వరకు.. ఇలా అన్ని వస్తువుల్లో డిజైనర్ల పాత్ర కీలకం. వినూత్నంగా మార్కెట్‌లోకి వచ్చే ప్రతి కొత్త వస్తువు తయారీ వెనుక డిజైనర్ పాత్ర ఉంటుంది. ఇలా అన్ని రంగాలకు చెందిన వస్తువులను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వినూత్న రీతిలో డిజైన్ చేయడం ఎలాగో తెలిపేవే డిజైనింగ్ కోర్సులు. ఈ తరహా కోర్సులను బోధించడంలో మన దేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌కు మరే సంస్థ సాటిరాదని చెప్పొచ్చు.

## బ్యాచిలర్, డిప్లొమా ప్రవేశ పరీక్ష

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) రెండు దశల్లో ఉంటుంది. అవి.. డీఏటీ ప్రిలిమ్స్, డీఏటీ మెయిన్స్.

- **డీఏటీ ప్రిలిమ్స్:** ఈ దశను 100 మార్కులకు పేపర్-పెన్సిల్ (ఆఫ్‌లైన్) పద్ధతిలో ఇంగ్లీష్ భాషలో నిర్వహిస్తారు. సమాధానాలను గుర్తించడానికి 180 నిమిషాల (3 గంటలు) సమయమిస్తారు. ఇందులో పార్ట్-1కు 30 మార్కులు, పార్ట్-2కు 70 మార్కులు ఉంటాయి. పార్ట్-1లో 1 నుంచి 14 ప్రశ్నలకు 1 మార్కు, 15 నుంచి 22 ప్రశ్నలకు 2 మార్కులు ఇస్తారు. పార్ట్-2లో సబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులకు డిజైన్ రంగం పట్ల ఉన్న అవగాహనను పరీక్షించడానికి ఇన్నోవేషన్ డిజైన్, థీమ్ డెవలప్‌మెంట్, కలర్, క్రియేటివిటీ, డ్రాయింగ్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- **డీఏటీ మెయిన్స్:** ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే డీఏటీ మెయిన్స్‌కు హాజరయ్యే అవకాశం లభిస్తుంది. ఈ దశను 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో విభిన్న రకాల పరీక్షలు ఉంటాయి. కాబట్టి మూడు రోజులపాటు మెయిన్స్ పరీక్షలు సాగుతాయి. ఈ దశలో డ్రాయింగ్, స్కెచింగ్, హ్యాండ్స్ ఆన్ మోడల్ మేకింగ్ అనే విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఇచ్చిన ప్రశ్నల ఆధారంగా డ్రాయింగ్ గీయడం, నమూనాలను తయారు చేయడం వంటి కార్యకలాపాలు ఇందులో ఉంటాయి.
- వెయిటేజీ: ప్రవేశ ప్రక్రియలో ప్రిలిమ్స్‌కు 30 శాతం, మెయిన్స్‌కు 70 శాతం వెయిటేజీ ఉంటుంది.
- పరీక్ష తేదీలు: డీఏటీ ప్రిలిమ్స్‌ను 2019 డిసెంబరు 29న, మెయిన్స్ పరీక్షలను 2020 ఏప్రిల్ 29 నుంచి మే 3 వరకు నిర్వహిస్తారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెయిన్స్ పరీక్షను నిడ్ కేంద్రాల్లో మాత్రమే నిర్వహిస్తారు.

## ఎన్ఐడీ - ఆంధ్రప్రదేశ్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (నిడ్) - ఆంధ్రప్రదేశ్‌ను 2015, సెప్టెంబరులో ప్రారంభించారు. ప్రస్తుతం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో తాత్కాలిక క్యాంపస్‌లో నిడ్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ ఇన్‌స్టిట్యూట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజైనింగ్ (జీడీపీడీ) కోర్సును మాత్రమే ఆఫర్ చేస్తుంది.

- స్పెషలైజేషన్స్: ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, టెక్స్‌టైల్ అండ్ అపెరల్ డిజైన్. ప్రతి స్పెషలైజేషన్‌లో 25 చొప్పున మొత్తం 75 సీట్లు ఉన్నాయి.
- ప్రవేశం: డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.
- ఈ-మెయిల్: admissions@nid.edu
- ఫోన్ నెంబరు: +918985835478
- వెబ్‌సైట్: http://nid.ac.in/

## మాస్టర్స్ కోర్సులకు..

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) రెండు దశల్లో ఉంటుంది. అవి.. డీఏటీ ప్రిలిమ్స్, డీఏటీ మెయిన్స్.

- **డీఏటీ ప్రిలిమ్స్:** ఈ దశను 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థిలోని డిజైన్ ఆప్టిట్యూడ్‌ను తెలుసుకోవడానికి కామన్ డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఎంచుకున్న విభాగానికి చెందిన టెస్ట్ ఉంటాయి. స్పెషలైజేషన్‌ను బట్టి పరీక్ష వ్యవధి రెండున్నర నుంచి నాలుగున్నర గంటల వరకు ఉంటుంది.
- **డీఏటీ మెయిన్స్:** ఇందులో స్టూడియో టెస్ట్, ఇంటర్వ్యూ అనే రెండు దశలు ఉంటాయి. స్టూడియో టెస్ట్‌ను 100 మార్కులకు ఇంగ్లీష్ భాషలో నిర్వహిస్తారు. దీని తరవాత వెంటనే ఇంటర్వ్యూలను చేపడతారు.
- వెయిటేజీ: మొత్తమ్మీద ప్రవేశ ప్రక్రియలో ప్రిలిమ్స్‌కు 30శాతం, మెయిన్స్‌కు 70 శాతం వెయిటేజీ ఉంటుంది.
- పరీక్ష తేదీలు: డీఏటీ ప్రిలిమ్స్‌ను 2019 డిసెంబరు 29న నిర్వహిస్తారు. మెయిన్స్ షెడ్యూల్‌ను తరవాత ప్రకటిస్తారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో మాత్రమే పరీక్షా కేంద్రం ఉంది. మెయిన్స్ పరీక్షను అహ్మదాబాద్, బెంగళూరు, గాంధీనగర్ నిడ్ కేంద్రాల్లో చేపడతారు.

## ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 7, 2019
- ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 13, 2019
- వివరాలకు: www.nid.edu

## అవకాశాలు.. వేతనాలు

నిడ్‌లో సీటు దొరికితే ఉద్యోగం గ్యారెంటీ అని చెప్పొచ్చు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ తప్పకుండా ఉంటాయి. ఇందులో ఎంపికయినవారు పేరున్న కంపెనీల్లో ఆకర్షణీయమైన వేతనాలతో కొలువులను దక్కించుకోవచ్చు. గతేడాది క్యాంపస్ డ్రైవ్‌లో 121 కంపెనీలు పాల్గొన్నాయి. 295 మందికి ఆ కంపెనీలు ఆఫర్ ఇచ్చాయి. గతంలో 2015లో ట్రైడెంట్ కంపెనీ నిడ్ విద్యార్థికి అత్యధికంగా రూ. 72 లక్షల వేతన ప్యాకేజీ ఆఫర్ చేసింది. కెరీర్‌పరంగా కూడా డిజైనర్లకు ప్రస్తుతం చాలా డిమాండ్ నెలకొంది. మార్కెట్‌లోకి వచ్చే ప్రతి కొత్త రకం వస్తువు వెనుక దాన్ని రూపొందించే డిజైనర్ కృషి ఉంటుంది. అందుకే డిజైనింగ్ కోర్సు చేసే వారికి అవకాశాలకు కొదవ ఉండదు. ప్రతి కంపెనీ, సంస్థ అన్నీ మార్కెట్ ట్రెండ్‌ను అందుకునే ప్రయత్నం చేస్తాయి. కాబట్టి అందరికీ డిజైనర్స్ అవసరం ఎంతో ఉంటుంది. డిజైనింగ్ కోర్సులు చేసిన వారికి మారుతీ సుజుకీ, రెనాల్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా మోటార్స్, ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ ఇండియా లిమిటెడ్, ఎల్‌జీ, గోద్రేజ్, ఇన్ఫోసిస్ టెక్నాలజీస్, జీఈ హెల్త్‌కేర్, ఐబీఎమ్, సినర్జీ లైఫ్ స్టయిల్స్, టాటా మోటార్స్ వంటి అనేక జాతీయ, బహుళజాతి కంపెనీలు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. డిజైనర్లకు విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. ముఖ్యంగా అమెరికా, యూకేలలో డిజైనర్లకు చక్కని అవకాశాలు లభిస్తున్నాయి. కెరీర్ ప్రారంభంలో అసిస్టెంట్ / ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. తర్వాత అసోసియేట్, చీఫ్ డైరెక్టర్ / డిజైనర్, క్రియేటివ్ డైరెక్టర్ వంటి హోదాలకు చేరుకోవచ్చు. ప్రారంభంలో సంవత్సరానికి రూ. 3 నుంచి రూ. 4 లక్షల వరకు వేతనాన్ని అందుకోవచ్చు. తర్వాత హోదా ఆధారంగా రూ. 8 - 10 లక్షల వరకు కూడా అందుకోవచ్చు.



## మూడు క్యాంపస్‌లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (నిడ్)ను 1961లో స్థాపించారు. ఫోర్డ్ ఫౌండేషన్, సారాభాయ్ కుటుంబం సహకారంతో కేంద్ర ప్రభుత్వం నిడ్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థకు స్వయంప్రతిపత్తి హోదా ఉంది. నిడ్‌కు అహ్మదాబాద్, గాంధీనగర్, బెంగళూరులలో క్యాంపస్‌లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నిడ్ క్యాంపస్‌ను నెలకొల్పారు. వీటి ద్వారా బ్యాచిలర్ నుంచి పీహెచ్‌డీ వరకు కోర్సులను బోధిస్తారు. వాటి వివరాలు..

### బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (బీడీఈఎస్)

- స్పెషలైజేషన్స్: సిరామిక్ - గ్లాస్ డిజైన్, ఫర్నీచర్ - ఇంటీరియర్, ప్రొడక్ట్, యానిమేషన్, ఎగ్జిబిషన్, గ్రాఫిక్, ఫిల్మ్ - వీడియో డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.
- అహ్మదాబాద్ క్యాంపస్ మాత్రమే ఈ కోర్సును ఆఫర్ చేస్తుంది.
- అర్హత: ఇంటర్ లేదా తత్సమానం. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: జనరల్ కేటగిరీ విద్యార్థులు 2000, జనవరి 1న లేదా తరవాత జన్మించి ఉండాలి. రిజర్వ్‌డ్ విద్యార్థులకు నిబంధనల మేరకు వయో పరిమితిలో సడలింపు ఇస్తారు.
- ప్రవేశం: డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

### గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజైనింగ్

- స్పెషలైజేషన్స్: ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, టెక్స్‌టైల్ అండ్ అపెరల్ డిజైన్.
- అర్హత: ఇంటర్ లేదా తత్సమానం. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఆఫర్ చేస్తున్న క్యాంపస్‌లు: నిడ్ - ఆంధ్రప్రదేశ్, నిడ్-హర్యానా (కురుక్షేత్ర), నిడ్-మధ్యప్రదేశ్ (భోపాల్), నిడ్-అస్సాం (జోర్హాత్).
- వయసు: జనరల్ కేటగిరీ విద్యార్థులు 2000, జనవరి 1న లేదా తరవాత జన్మించి ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులకు నిబంధనల మేరకు వయో పరిమితిలో సడలింపునిస్తారు.
- ప్రవేశం: డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

### మాస్టర్ ఆఫ్ డిజైన్ (ఎండీఈఎస్)

- స్పెషలైజేషన్స్: సిరామిక్ - గ్లాస్ డిజైన్, ఫర్నీచర్-ఇంటీరియర్, ప్రొడక్ట్, యానిమేషన్, ఎగ్జిబిషన్ డిజైన్, గ్రాఫిక్, ఫిల్మ్-వీడియో డిజైన్, అపెరల్ డిజైన్, ఫోటో, మీడియా డిజైన్, టాయ్-గేమ్ డిజైన్, ట్రాన్స్‌పోర్టేషన్ - ఆటోమొబైల్, రిటైల్, డిజిటల్ గేమ్, ఇన్ఫర్మేషన్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, యూనివర్సల్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.
- ఆఫర్ చేస్తున్న క్యాంపస్‌లు: అహ్మదాబాద్, బెంగళూరు, గాంధీనగర్.
- అర్హత: ఏదైనా డిగ్రీ లేదా నాలుగేళ్ల ఫుల్ టైమ్ డిప్లొమా (డిజైన్ / ఫైన్ ఆర్ట్స్ / అప్లయిడ్ ఆర్ట్స్ / ఆర్కిటెక్చర్)
- ప్రవేశం: డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

### పీహెచ్‌డీ (డిజైన్)

- మూడేళ్ల ఫుల్ టైమ్, ఐదేళ్ల పార్ట్ టైమ్.. రెండు విధాలుగా ఈ కోర్సును ఆఫర్ చేస్తున్నారు.
- అహ్మదాబాద్ క్యాంపస్ మాత్రమే ఈ కోర్సులను అందిస్తోంది.
- అర్హత: మాస్టర్స్ (డిజైన్) / నిడ్ నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ (డిజైన్), అనుభవం.
- ప్రవేశం: మూడు దశలుగా ప్రవేశ ప్రక్రియ ఉంటుంది. మొదటి దశలో దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రెండో దశలో డిజైన్ రీసెర్చ్ టెస్ట్ (డీఆర్‌టీ) నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని చివరగా ఇంటర్వ్యూ చేసి అడ్మిషన్ కల్పిస్తారు.

## జాబ్ కార్నర్

### సీడీఎస్ ఎగ్జామ్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-(1), 2019 నోటిఫికేషన్ వెలువడింది. దీనికి సంబంధించిన వివరాలు..

- ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా మొత్తం త్రివిధ దళాల్లో 418 పోస్టులను భర్తీ చేయనున్నారు. విభాగాల వారీగా ఖాళీలు..
  ఇండియన్ మిలటరీ అకాడమీ - 100, ఇండియన్ నేవల్ అకాడమీ - 45, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ - 32, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ - 225, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్‌సి ఉమెన్ నాన్ టెక్నికల్) - 16
- అర్హతలు: ఇండియన్ మిలటరీ అకాడమీ: అవివాహిత పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ / తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఇండియన్ నేవల్ అకాడమీ: అవివాహిత పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉండాలి.
- ఎయిర్‌ఫోర్స్ అకాడమీ: ఇంజనీరింగ్ డిగ్రీ లేదా డిగ్రీ / తత్సమానం (10+2 స్థాయిలో మేథమెటిక్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి). డీజీసీఏ కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్నవారికి వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు ఉంటుంది.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్‌సి - పురుషులు): డిగ్రీ / తత్సమానం.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్‌సి ఉమెన్ నాన్ టెక్నికల్): అవివాహితులు / విడాకులు / వైధవ్యం పొంది తిరిగి పెళ్లి చేసుకోని మహిళలు, డిగ్రీ / తత్సమానం.
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 19, 2019
- రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 2, 2020
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
- వెబ్‌సైట్: www.upsc.gov.in



# వ్యవసాయ అధ్యాపకులకు.. ఐకార్ నెట్

***భారతదేశం ప్రధానంగా వ్యవసాయిక దేశం. ఇప్పటికీ అధిక శాతం మంది వ్యవసాయాన్నే ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్నారు. దీంతో పరిశోధనల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటమే లక్ష్యంగా అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏఎస్ఆర్‌బీ) ఏర్పడింది. ఇందులో భాగంగా ఏఎస్ఆర్‌బీ ఏటా ఐకార్-నెట్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్) అనే పరీక్షను నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో ప్రతిభ చూపితే వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో లెక్చరర్ / అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెరీర్ ప్రారంభించవచ్చు. 2019 సంవత్సరానికి ఐకార్-నెట్ నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సంబంధిత వివరాలను తెలుసుకుందాం..***

భారత ప్రభుత్వ నూతన విద్యా విధానం - 1986 ప్రకారం డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వృత్తిని చేపట్టే ప్రతి అభ్యర్థి సంబంధిత అకడమిక్ అర్హతలతోపాటు యూజీసీ - నెట్ / సీఎస్ఐఆర్ - నెట్ పరీక్షలలో తప్పకుండా అర్హత సాధించాల్సి ఉంటుంది. అదే మాదిరిగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు / కాలేజీల్లో లెక్చరర్ / అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బోధించే అవకాశం లభిస్తుంది.

## 57 సబ్జెక్టులు

మొత్తం 57 సబ్జెక్ట్‌లలో ఐకార్-నెట్‌ను నిర్వహిస్తారు. అవి.. యానిమల్ బయోటెక్నాలజీ, అగ్రికల్చరల్ ఎంటమాలజీ, అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ, ఎకనామిక్ బోటనీ అండ్ ప్లాంట్ జెనెటిక్ రీసోర్సెస్, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, నెమాటాలజీ, ప్లాంట్ బయోకెమిస్ట్రీ, ప్లాంట్ పాథాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్, ఫ్రూట్ సైన్స్, వెజిటేబుల్ సైన్స్, ప్లాంటేషన్, మెడిసినల్ అండ్ అరోమాటిక్ ప్లాంట్స్, యానిమల్ బయోకెమిస్ట్రీ, యానిమల్ బయోటెక్నాలజీ, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, యానిమల్ ఫిజియాలజీ, డెయిరీ టెక్నాలజీ, లైవ్ స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, అక్వాకల్చర్, సాయిల్ సైన్సెస్, హోమ్ సైన్స్, బయోఇన్ఫర్మాటిక్స్, ఫుడ్ టెక్నాలజీ, కంప్యూటర్ అప్లికేషన్ అండ్ ఐటీ, అగ్రికల్చర్ ఎకనామిక్స్. సబ్జెక్టుల వారీగా సిలబస్‌ను వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు.

## ఆన్‌లైన్‌లో

ఐకార్-నెట్‌కు ప్రయత్నాల విషయంలో ఎటువంటి పరిమితులు లేవు. ఎన్నిసార్లయినా హాజరు కావచ్చు. ఐకార్ -నెట్ ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో ఇంగ్లీష్ / హిందీ భాషల్లో ఉంటుంది. ఇందులో ఎంచుకున్న స్పెషలైజేషన్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ఈ పరీక్షకు కేటాయించిన మొత్తం మార్కులు 150. ఇందులో ప్రశ్నల క్లిష్టత మాస్టర్స్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. సమాధానాలను గుర్తించడానికి 120 నిమిషాలు (రెండు గంటలు) సమయమిస్తారు. నెగిటివ్ మార్కులు కూడా ఉంటాయి. ప్రతి తప్పునకు 1/3 మార్కు కోత విధిస్తారు.

## అర్హత మార్కులు

ఐకార్ నెట్‌లో కేటగిరీల వారీగా అర్హత మార్కులను నిర్ణయించారు. నిర్దేశించిన అర్హత సాధించిన వారిని మాత్రమే ఫైనల్ మెరిట్ లిస్ట్ ప్రిపరేషన్‌లో పరిగణనలోకి తీసుకుంటారు. ఈ క్రమంలో జనరల్ అభ్యర్థులు 50 శాతం మార్కులను (75 మార్కులు), ఓబీసీ (నాన్ క్రిమీ లేయర్) 45 శాతం (67.5 మార్కులు), ఎస్సీ / ఎస్టీ / పీడబ్ల్యూడీ అభ్యర్థులు 40 (60 మార్కులు) శాతం మార్కులను సాధించాలి.

## ఈ స్కోర్‌తో

ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఏఎస్ఆర్‌బీ సర్టిఫికెట్‌ను అందజేస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం ఐకార్-నెట్‌లో సాధించిన అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు.

## ముఖ్య సమాచారం

- అర్హత: ఎంచుకున్న స్పెషలైజేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ
- వయసు: 21 సంవత్సరాలు (జూలై 1, 2019 నాటికి)
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తు ఫీజు: రూ. 1000 (ఈడబ్ల్యూఎస్ / ఓబీసీలకు రూ. 500, మహిళలు / దివ్యాంగులు / ఎస్సీ / ఎస్టీలకు రూ. 250)
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 4, 2019
- ఐకార్-నెట్ పరీక్ష తేదీలు: 2019 డిసెంబరు 9 నుంచి 15 వరకు
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ.
- వెబ్‌సైట్: www.asrb.org.in

## ఫెడ్ రేట్లు 'పావు' శాతం తగ్గింపు

**ఈ ఏడాదిలో మూడో సారి**

వాషింగ్టన్ : అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడరల్ రిజర్వ్' మరో సారి వడ్డీ రేట్లు తగ్గించింది. కీలకమైన వడ్డీ రేట్లను పావు శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. అమెరికాలో ప్రస్తుతం కీలక వడ్డీ రేట్లు 1.75 శాతం నుంచి రెండు శాతం మధ్య ఉన్నాయి. ఈ రేట్లను పావు శాతం తగ్గిస్తున్నట్టు బ్యాంక్ చైర్మన్ జెరోం పోవెల్ ప్రకటించారు. ఎగుమతులు, వ్యాపార వాతావరణం అంత అనుకూలంగా లేనందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ ఏడాదిలో ఇది వరుసగా మూడో తగ్గింపు. కనీసం వచ్చేసారికైనా వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించనున్నట్టు ఫెడ్ రిజర్వ్ సంకేతాలు ఇచ్చింది.

# ఎఫ్‌డీ, పీపీఎఫ్‌కే మహిళల మొగ్గు

*పొదుపు సొమ్ము విషయంలో మెజారిటీ మహిళలది 'చింతలేని జాగ్రత్త' వైఖరని స్క్రిప్‌బాక్స్ సర్వే నివేదిక వెల్లడించింది. ఆన్‌లైన్‌లో ఆర్థిక సేవలందించే ఈ సంస్థ.. గత నెలలో లీడింగ్ ఫేస్‌బుక్ కమ్యూనిటీలకు చెందిన 400 మంది మహిళల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా నివేదికను విడుదల చేసింది. మహిళలు తమ పొదుపు సొమ్ముతో ఏం చేయాలనుకుంటున్నారనే విషయంలో నివేదిక వెల్లడించిన ఆసక్తికర విషయాలు..*



**58%** : ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్)లో పెట్టుబడిగా పెట్టడం లేదంటే పొదుపు ఖాతాలో జమ చేయడం.

**6%** : బంగారం కొనుగోలు

**15%** : మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి



### ఆర్థిక లక్ష్యాలు

**25%** : ప్రస్తుతానికి ఏ లక్ష్యమూ లేనివారు

**28%** : తమ ప్రణాళిక, దాని సాధనపై ధీమాగా ఉన్నవారు.

**15%** : ప్రణాళికా రచనను కుటుంబ సభ్యుల చేతుల్లో పెట్టదలుచుకున్నవారు

**44%** : ఆర్థిక లక్ష్యాల ప్రణాళికకు అవతలివారి సాయాన్ని స్వాగతిస్తున్న వారు.

### సర్వేలో పాల్గొన్న వారిలో.

**54%** : మిలీనియల్స్ (22-37ఏళ్ల లోపు వారు)

**46%** : నాన్-మిలీనియల్స్

### మిలీనియల్స్

**3/4** :పొదుపునకు మొగ్గు చూపినవారు

**ప్రతి ఆరుగురిలో ఒకరు** : సెలవుల్లో విహారయాత్ర కోసం సొమ్ము పోగేసేవారు

**44%-** తమ పొదుపు సొమ్ము లేదా పెట్టుబడిని సులభంగా తిరిగి తీసుకోగలిగే వెసులుబాటు కోరుకుంటున్నవారు.

### నాన్-మిలీనియల్స్

**50%** : రిటైర్మెంట్ నిధి ఏర్పాటు లేదా పిల్లల విద్యావసరాల కోసం పొదుపు

**33%** : పీపీఎఫ్, ఎల్ఐసీ, ఎఫ్‌డీ వంటి పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడి


**26%** : మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు

### దేనికి ప్రాముఖ్యం

**36%** : అత్యవసర నిధి ఏర్పాటు

**28%** : పిల్లల విద్యావసరాల కోసం పొదుపు

**26%** : రిటైర్మెంట్ నిధి ఏర్పాటు



# ఐదేళ్లలో మరో 100 విమానాశ్రయాలు

**కేంద్ర ప్రభుత్వ యోచన**

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్ల(2024నాటికి)లో మరో 100 విమానాశ్రయాలను అందుబాటులోకి తేవాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. అంతేకాకుండా 1,000 కొత్త మార్గాలకు విమాన సేవలను ప్రారంభించాలని భావిస్తోంది. 2025కల్లా దేశంలో అవసరమయ్యే మౌలిక వసతులపై చర్చించేందుకు గత వారంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. అందులో ఈ ప్రతిపాదన వచ్చినట్లు తెలుస్తున్నది. విమానాల లీజుకు ఫైనాన్స్ సమకూర్చే వ్యాపార ప్రారంభానికి సంబంధించీ చర్చ జరిగినట్లు సమాచారం. ఆరేళ్ల కనిష్ఠానికి జారుకున్న జీడీపీ వృద్ధికి ఊతమివ్వడంతోపాటు 2025నాటికి ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేర్చేందుకు మౌలిక ప్రాజెక్టులను రెట్టింపు చేయాలని మోదీ సర్కారు భావిస్తోంది. వచ్చే ఐదేళ్లలో ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.

### పెరగనున్న విదేశీ విమాన సర్వీసులు

ఈ నెల 27న ప్రారంభమైన వింటర్ సీజన్(చలికాలం)లో భారత్‌కు విదేశీ విమానయాన సంస్థల విమాన సంస్థలు మరింత పెరుగుతాయని పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) తెలిపింది. గత ఏడాది వింటర్‌లో ఈ సంస్థలు భారత్‌లోని వివిధ నగరాల నుంచి వారానికి సగటున 2,262 విమాన సర్వీసులు నడిపాయి. ఈ సంవత్సరం ఇది 3.05 శాతం పెరిగి 2,331కు చేరుతుందని అంచనా వేసింది. ఈ వింటర్ సీజన్ వచ్చే ఏడాది మార్చి 28 వరకు కొనసాగుతుంది.

## భారత్‌కు వొడాఫోన్ గుడ్‌బై!?

**గుదిబండలా మారిన జేవీ**

న్యూఢిల్లీ: బ్రిటిష్ టెలికాం దిగ్గజం వొడాఫోన్ పీఎల్‌సీ భారత మార్కెట్ నుంచి వైదొలగవచ్చని ఇండస్ట్రీ వర్గాల్లో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. సంయుక్త భాగస్వామ్య(జేవీ) సంస్థ 'వొడాఫోన్ ఐడియా' నష్టాలు భారీగా పెరగడంతోపాటు ప్రతినెలా లక్షల సంఖ్యలో కస్టమర్లు నెట్‌వర్క్‌ను వీడుతుండటం, ఈమధ్యకాలంలో కంపెనీ మార్కెట్ విలువ భారీగా పతనం కావడం ఇందుకు కారణమని వారంటున్నారు. దాంతో కంపెనీకి కొత్తగా నిధుల సేకరణ కష్టమవుతున్నది. పైగా, సుప్రీం కోర్టు తాజా తీర్పుతో ప్రభుత్వానికి ఈ జాయింట్ వెంచర్ మూడు నెలల్లో రూ.28,309 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. కంపెనీ పరిస్థితి రోజు రోజుకీ దిగజారుతున్న నేపథ్యంలో తన వాటాను ఎవరికైనా కట్టబెట్టి భారత మార్కెట్ నుంచి పూర్తిగా తప్పుకోవాలని వొడాఫోన్ భావిస్తున్నట్లు సమాచారం.

హచిసన్ ఎస్సార్ టెలికాం వెంచర్ కొనుగోలు ద్వారా 2007లో దేశీ మార్కెట్‌లోకి ప్రవేశించిన వొడాఫోన్.. అనతికాలంలోనే ప్రముఖ ఆపరేటర్‌గా ఎదిగింది. ఎయిర్‌టెల్ తర్వాత రెండో అతిపెద్ద టెలికాం సంస్థగా కొనసాగింది. మూడేళ్ల క్రితం రిలయన్స్ జియో రంగ ప్రవేశంతో టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. జియో ఉచిత కాలింగ్, చౌక డేటా సేవల దెబ్బకు మిగతా ఆపరేటర్లు కుదేలయ్యాయి.

## కాయ్‌పై జియో ఆగ్రహం

**ఊహాత్మక సంక్షోభం పేరుతో బ్లాక్‌మెయిల్ చేస్తోందని మండిపాటు**



న్యూఢిల్లీ: టెలికాం పరిశ్రమ సంఘం సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కాయ్) ఊహాత్మక సంక్షోభం పేరుతో బెదిరింపులకు పాల్పడటమేకాకుండా బ్లాక్ మెయిల్ చేస్తోందని రిలయన్స్ జియో ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టపరమైన బకాయిల చెల్లింపులకు సంబంధించి ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో టెలికాం రంగంలో లేని సంక్షోభాలు ఉన్నట్టుగా కంపెనీలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు కాయ్ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్‌కు కరువైన పదాలతో లేఖ రాసింది. రెండు ఆపరేటర్ల వైఫలం వల్ల దేశంలోని పోటీతత్వంపై, కేంద్ర ప్రభుత్వ డిజిటల్ ఇండియా అజెండాపై ప్రభావం పడదని పేర్కొంది. కాయ్ విశ్వాసాన్ని కోల్పోయిందని, పక్షపాత దృక్పథంతో ఏకపక్ష ఆలోచనా విధానంతో వ్యవహరిస్తున్నట్టు తెలిపింది. కాయ్ పరిశ్రమ ఆర్గనైజేషన్‌గా కాకుండా కేవలం రెండు కంపెనీలకు మాత్రమే వత్తాసు పలుకుతున్నట్టు లేఖలో జియో పేర్కొంది. ఈ రెండు కంపెనీలకు ప్రభుత్వ బకాయిలు చెల్లించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపింది. కాయ్ అన్ని కంపెనీలకు ప్రాతినిధ్య వహించాలని, సుప్రీం కోర్టు ఆదేశాలకు నిందించే ధోరణిని మానుకోవాలని సూచించింది. జియో లేఖపై కాయ్ స్పందించింది. 'ఇది అసోసియేషన్ సభ్యులకు సంబంధించిన ప్రైవేటు అంశం. కాయ్ పాలనాపరమైన నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలో తగిన విధంగా పరిష్కరిస్తాం" అని కాయ్ డైరెక్టర్ జనరల్ రాజన్ మథ్యూస్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తాజా ఆదేశాల మేరకు లైసెన్స్ ఫీజులు, స్పెక్ట్రమ్ వినియోగ చార్జీలు వంటి వాటితో కలిపి ఎయిర్‌టెల్ రూ.42,000 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.40,000 కోట్లు, జియో రూ.14 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తుంది. ఈ స్థాయిలో బకాయిలు చెల్లించాల్సి రావడం పట్ల ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### ప్రభుత్వ విధానంపై ఎయిర్‌టెల్ ఆశలు

దేశంలోని టెలికాం కంపెనీలు టెలికాం రంగ అభివృద్ధి కోసం వందల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాయని, వీటి ద్వారా వినియోగదారులకు ప్రపంచస్థాయి సర్వీసులను అందిస్తున్నాయని భారతీ ఎయిర్‌టెల్ వెల్లడించింది. అయితే కంపెనీల నష్టాలు పెరగడానికి తోడుగా ఇటీవలి సుప్రీం కోర్టు తీర్పు కారణంగా టెలికాం కంపెనీలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంది. అయితే తాజాగా ఏర్పాటైన కమిటీ టెలికాం రంగంలోని అన్నివర్గాల ప్రయోజనాలకు అనుకూలంగా ఉండే నిర్మాణాత్మక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. సవరించిన స్థూల రాబడి (ఏజీఆర్)పై ప్రభుత్వం సమతౌల్య విధానం అనుసరిస్తుందన్న ఆశలున్నాయని ఎయిర్‌టెల్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. దీని వల్లనే టెలికాం పరిశ్రమ దీర్ఘకాలంలో మనుగడ సాగించగలుగుతుందన్నారు.

## తనఖా లేని రుణాలతో తంటాలే!

**కన్జ్యూమర్ రుణాల్లో అవే అధికం: సిబిల్**

ముంబై: ఎలాంటి తనఖా లేకుండా కేవలం వ్యక్తి పరపతి సామర్థ్యం ఆధారంగా ఇచ్చే రుణాలతో భవిష్యత్‌లో మొండి బకాయిల (ఎన్‌పీఏ) సమస్యలు తలెత్తవచ్చని క్రెడిట్ స్కోరింగ్ సేవల కంపెనీ సిబిల్ హెచ్చరించింది. మార్కెట్లో రుణ డిమాండ్ తగ్గిన నేపథ్యంలో వినిమయ అవసరాల కోసం తనఖా లేని అసురక్షిత రుణాల మంజూరు గణనీయంగా పెరిగిందని సిబిల్ పేర్కొంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డు, పర్సనల్ లోన్ బుక్స్ వరుసగా 34.3 శాతం, 35 శాతం పెరగడం ఆందోళన కలిగిస్తోందని సంస్థ పేర్కొంది. కన్జ్యూమర్ విభాగంలో రుణ డిఫాల్ట్‌లు స్థిరంగా ఉన్నప్పటికీ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) పోర్ట్‌ఫోలియోల్లో ఇప్పటికే ఒత్తిడి పెరిగిందని అంటోంది. ఆర్థిక మందగమనంలో కార్పొరేట్ కంపెనీలు రుణాలు తీసుకోవడం తగ్గించాయి. దాంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రిటైల్ రుణాలపై ప్రధానంగా దృష్టిసారించాయి.

## పన్ను రేట్ల తగ్గింపు ఉండకపోవచ్చు

**ఆర్థిక మందగమనం, తగ్గిన పన్ను వసూళ్లు కారణం**

న్యూఢిల్లీ: సంపన్నులు, మధ్యతరగతి ఆదాయ వర్గాలకు సంబంధించిన వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లలో తగ్గింపునకు అవకాశం ఉండకపోవచ్చని ప్రభుత్వవర్గాల ద్వారా తెలుస్తోంది. ఆర్థిక వ్యవస్థలో మందగమనం నేపథ్యంలో ఇప్పటికే పన్ను వసూళ్లు తగ్గుముఖం పట్టాయని, ఫలితంగా ఆర్థిక పరంగా ప్రభుత్వంపై ఒత్తిడి ఎక్కువవుతోందని చెబుతున్నారు. మరోవైపు డిమాండ్‌ను పెంచడానికి వీలుగా వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లను తగ్గించాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వం కార్పొరేట్ పన్నును 10 శాతం తగ్గించింది. ఆర్థిక వ్యవస్థలో ఉద్దీపన కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సంపన్నులపై వ్యక్తిగత ఆదాయ పన్నును కూడా ప్రభుత్వం తగ్గించే అవకాశం ఉందన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యక్తిగత ఆదాయ పన్ను రేటును తగ్గించడం కష్టమేనని తెలుస్తోంది. ఆర్థిక వ్యవస్థలో మందగమనం, పన్ను వసూళ్లు తక్కువగా ఉండటం, పన్నేతర వసూళ్లలో నిస్తేజంవంటి అంశాలు ఇందుకు కారణమని చెబుతున్నారు. ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని రూ.13.80 లక్షల కోట్లుగా నిర్దేశించుకున్నప్పటికీ దాన్ని చేరుకోలేకపోయింది. ప్రభుత్వం సామాజిక పథకాలైన ఆయుష్మాన్ భారత్, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎం-కిసాన్, పీఎం ఆవాస్ యోజనా తదితర పథకాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. వీటికి అధిక నిధుల అవసరం ఏర్పడుతోంది.

## ఐపీఓకు రిలయన్స్ ఇన్సూరెన్స్ గుడ్‌బై

అనిల్ అంబానీ నాయకత్వంలోని రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఐపీఓ ప్రయత్నాలను విరమించుకుంది. ఇందుకోసం ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సెబీకి సమర్పించిన పత్రాలను ఈ నెల 24న వెనక్కి తీసుకుంది. అయితే ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నది మాత్రం వెల్లడించలేదు.

## 'పిరామల్'లో కెనడా కంపెనీకి మరింత వాటా

కంపల్సరీ కన్వర్టబుల్ డిబెంచర్ల (సీసీడీ) జారీ ద్వారా కెనడాకు చెందిన ఒక పీఈ కంపెనీ నుంచి రూ.1,750 కోట్లు సమీకరించేందుకు పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ సిద్ధమైంది. ఈ నెల 25న జరిగిన సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనకు వాటాదారుల ఆమోదం కోసం కంపెనీ వచ్చే నెల 25న ఈజీఎం నిర్వహిస్తోంది. ఈజీఎం ఆమోదిస్తే కెనడా పీఈ సంస్థకు ఒక్కోటి రూ.1.51 లక్షల విలువైన 1,15,894 సీసీడీలు జారీ చేస్తారు.

## ఫోన్‌పే నష్టం రూ.1,905 కోట్లు

ఈ-కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఫోన్‌పే 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.1,904.72 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థ నష్టం రూ.791 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో ఫోన్‌పే రాబడి రూ.42.79 కోట్ల నుంచి రూ.184.22 కోట్లకు చేరుకుంది. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ సేకరించిన పత్రాల ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి.



# జీవిత బీమాలో వినూత్న ఉత్పత్తుల విప్లవం

**100 పాలసీలకు అవకాశం** **'రెగ్యులేటరీ శాండ్‌బాక్స్'తో మార్గం సుగమం**

**ఇండియాఫస్ట్ లైఫ్ డిప్యూటీ సీఈఓ రుషబ్ గాంధీ**

*బీమా నియంత్రణ ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ ప్రవేశపెట్టిన 'రెగ్యులేటరీ శాండ్‌బాక్స్' విధానం జీవిత బీమా రంగాన్ని కొత్త మలుపు తిప్పనుంది. దాదాపు ఏడాది కాలం తర్వాత బీమా రంగంలో వినూత్న ఉత్పత్తులు వెల్లువలా రానున్నాయని ఇండియాఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ డిప్యూటీ సీఈఓ రుషబ్ గాంధీ చెబుతున్నారు. జీవిత బీమా రంగంలోని భాగస్వాములందరికీ వీటి వల్ల ప్రయోజనం చేకూరగలదని.. ఆయా వ్యక్తుల అవసరాలకు అనుగుణంగా రూపొందించే ఈ పాలసీలు ప్రీమియం భారాన్ని తగ్గించడానికి అవకాశం ఉందన్నారు. కంపెనీ ప్రణాళికలను వెల్లడించడానికి హైదరాబాద్ వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో మాట్లాడారు. వివరాల్లోకి వెళితే..*

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**జీవిత బీమా రంగంలో వినూత్న పాలసీలకు అవకాశం ఉందా?**

వచ్చే ఏడాది తర్వాత దేశీయ జీవిత బీమా రంగం కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది. భారీ స్థాయిలో బీమా కంపెనీలు చాలా వినూత్న బీమా పాలసీలను ప్రవేశపెట్టే వీలుంది. ఐఆర్‌డీఏఐ నియంత్రణ శాండ్‌బాక్స్ (ఆర్ఎస్)ను ఏర్పాటు చేసింది. శాండ్‌బాక్స్ విధానంలో బీమా రంగ అభివృద్ధికి దోహదం చేసే చర్యలు, కొత్త పాలసీలను ప్రయోగాత్మకంగా పరీక్షించడానికి ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీలకు అనుమతి ఇస్తారు. నియంత్రణ వాతావరణంలో కొత్త ఉత్పత్తులను, సేవలను పరీక్షించడాన్ని రెగ్యులేటరీ శాండ్‌బాక్స్ విధానం అంటారు. వినూత్న, పాలసీదారులకు అనుకూల, పరిశ్రమ వృద్ధికి దోహదం చేసే బీమా పాలసీలను కంపెనీలు ప్రతిపాదించే అవకాశం ఉంది. కొత్తగా ఆలోచించే వెసులుబాటు కంపెనీలకు లభిస్తుంది. వినూత్న పాలసీలపై ఐఆర్‌డీఏఐ ఆశావహకంగా ఉంది.

**ఎన్ని వినూత్న పాలసీలు వచ్చే వీలుంది?**

ప్రతి జీవిత బీమా కంపెనీకి వినూత్న ఉత్పత్తులను ఆవిష్కరించే అవకాశం లభిస్తుంది. దేశంలో ప్రస్తుతం 24 జీవిత బీమా కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు సగటున 5 వినూత్న పాలసీలను ప్రతిపాదించినా దాదాపు 100 కొత్త జీవిత బీమా పాలసీలు రావడానికి అవకాశాలు లేకపోలేదు. వీటిలో కనీసం 6-7 పాలసీలు చాలా వినూత్నంగా ఉండొచ్చు. ఇప్పటి వరకూ ఇటువంటి పాలసీలను చూసి ఉండకపోవచ్చు.

**ఈ పాలసీలు జీవిత బీమా పరిశ్రమను ఎలా ప్రభావితం చేయగలవు?**

రెండు ప్రధాన లక్ష్యాలతో కంపెనీలు వినూత్న పాలసీలను అభివృద్ధి చేయొచ్చు. దేశంలో జీవిత బీమా విస్తృతి (పెనెట్రేషన్) 3-4 శాతం మాత్రమే ఉంది. దీన్ని పెంచే విధంగా కొత్త పాలసీలు ఉండొచ్చు. దేశంలో ప్రతి వారికి జీవిత బీమా పాలసీలను విక్రయించడానికి అవకాశం ఉన్నప్పటికీ.. మారుమూల ప్రాంతాల్లోని వినియోగదారులు భరించగలిగే ప్రీమియం, కవరేజీతో పాలసీలు అందుబాటులో లేవు. చాలా మందికి ఏడాదికి రూ.5,000 ప్రీమియం చెల్లించడం కష్టం. అటువంటి వాళ్లు తక్కువ ప్రీమియం, వ్యయం అయ్యే జీవిత బీమా పాలసీలను కోరుకుంటున్నారు. అందరూ 10, 15, 20 ఏళ్ల పాలసీలు ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో సంప్రదాయ పాలసీలకు భిన్నమైన పాలసీల తీసుకువస్తే.. వాటికి తప్పకుండా మంచి స్పందన లభిస్తుంది. టెక్నాలజీ, వినూత్న పాలసీలు జీవిత బీమా కవరేజీ పరిధిలోకి వచ్చే వారి సంఖ్యను పెంచుతాయి. టెక్నాలజీ వల్ల కంపెనీలకు వ్యయం తగ్గుతుంది. కొత్త ఉత్పత్తులొచ్చాక ప్రీమియంలు తగ్గుతాయి. ఎంత తగ్గుతుందని ఇప్పుడు చెప్పలేం. ఆయా వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్డ్ పాలసీలను తక్కువ ప్రీమియంకు కంపెనీలు ప్రవేశపెట్టొచ్చు.

**ఆన్‌లైన్‌లో బీమా పాలసీల విక్రయం ఎలా ఉంది?**

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పాలసీ గురించి తెలుసుకోవడానికే కొనుగోలుదారులు మొగ్గు చూపుతున్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్న పాలసీలు 2-3 శాతం మాత్రమే ఉన్నాయి. అయితే.. భవిష్యత్తులో ఆన్‌లైన్ విక్రయాలు పెరగడానికి వీలుంది. కొనుగోలు చేసే 50 శాతం పాలసీల గురించి ముందుగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌పై తెలుసుకుని సాధారణ పద్ధతుల్లో కొనుగోలు చేయొచ్చు.

**కాలపరిమితి బీమా పాలసీలకు ఆదరణ ఎలా ఉంది?**

కాలపరిమితి పాలసీల్లో తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజీ లభిస్తుంది. 48 ఏళ్ల వయసున్న వ్యక్తికి రూ.కోటి కవరేజీ 8 ఏళ్లు కావాలంటే.. దాదాపు రూ.29,000 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. కొత్త తరం వారు జీవిత బీమా పాలసీని రిస్క్ కవరేజీ సాధనంగానే చూస్తున్నారు. పెట్టుబడి కోణంలో పరిశీలించడం లేదు. ప్రీమియం పరంగా జీవిత బీమా పాలసీల్లో కాలపరిమితి పాలసీల వాటా చాలా తక్కువగా ఉంది. పాలసీల పరంగా 10-12 శాతం ఉంటుంది.

### ఇండియాఫస్ట్ లైఫ్ ప్రీమియం ఆదాయంలో వృద్ధి ఎలా ఉంది?

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థానికి వ్యక్తిగత పాలసీల తొలి ప్రీమియం ఆదాయం 29 శాతం పెరిగి రూ.253 కోట్ల నుంచి రూ.325 కోట్లకు చేరింది. మొత్తం ఏడాదికి ఈ ఆదాయం రూ.681 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు చేరగలదని అంచనా వేస్తున్నాం. రెన్యూవల్ పాలసీల ప్రీమియంలను కూడా కలిపితే.. సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలలకు రూ.1,325 కోట్ల నుంచి రూ.1,462 కోట్లకు చేరింది. మొత్తం ఏడాదికి ఈ ప్రీమియం రూ.3,200 కోట్లు ఉండే వీలుంది. గత ఏడాది కూడా ఇదేస్థాయిలో ఉంది. రిటైల్ పాలసీలపైనే దృష్టి పెట్టనున్నందున ఆ ప్రీమియం పెరగనుంది.

**జీవిత బీమా వ్యాపారంలోని బ్యాంకులు విలీనం అయ్యాయి. బీమా సంయుక్త సంస్థల్లో ఏవైనా సంస్థాగత మార్పులు రావడానికి అవకాశం ఉందా?**

విలీన బ్యాంకుల్లో ఒక బ్యాంకు మాత్రమే బీమా వ్యాపారంలో ఉందంటే ఆ విలీనం వల్ల బీమా కంపెనీకి తప్పకుండా ప్రయోజనం చేకూరుతుంది. అయితే.. రెండు బ్యాంకులకు బీమా కంపెనీల్లో వాటా ఉంటే.. అప్పుడు నియమ నిబంధనలపరంగా ఇబ్బందులు తలెత్తుతాయి. నిబంధనల ప్రకారం ఒక బ్యాంకు ఒక బీమా కంపెనీకి మాత్రమే ప్రమోటర్‌గా ఉండొచ్చు. రెండో కంపెనీలో 10 శాతానికి మించి వాటా ఉండకూడదు. అయితే.. ఎన్ని బీమా కంపెనీల ఉత్పత్తులనైనా విక్రయించవచ్చు. ఉదాహరణకు ఇండియాఫస్ట్ జీవిత బీమా కంపెనీనే తీసుకుంటే. ఇందులో ఆంధ్రాబ్యాంకుకు దాదాపు 30 శాతం ఉంటా ఉంది. ఆంధ్రాబ్యాంకు.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం అవుతోంది. స్టార్ యూనియన్ దైచీ లైఫ్ ఇన్సూరెన్స్ సంయుక్త సంస్థలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు మెజారిటీ వాటా ఉంది. విలీనం తర్వాత విలీన బ్యాంకు ఏ జీవిత బీమా కంపెనీలో మెజారిటీ వాటా కలిగి ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. 6-7 నెలల తర్వాత స్పష్టత వస్తుంది. విలీనం తర్వాత ఏర్పడే బ్యాంకు ఇండియాఫస్ట్‌లో వాటానే ఉంచుకోవడానికి మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇండియాఫస్ట్ లైఫ్ సంయుక్త సంస్థలో బీఓబీకి వాటా ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంకు, దేనా బ్యాంకుల విలీనం వల్ల ఇండియాఫస్ట్ లైఫ్‌నకు ప్రయోజనం చేకూరింది. విజయా, దేనా బ్యాంకులకు బీమా వ్యాపారాలు లేవు. సిండికేట్ బ్యాంక్, కెనరా బ్యాంకు విలీనం వల్ల కెనరా హెచ్ఎస్‌బీసీ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

**కొత్త పాలసీలు ఏమైనా తీసుకువచ్చారా?**

ఇటీవల 'స్మార్ట్ పే ప్లాన్' పేరుతో కొత్త పాలసీని విడుదల చేశాం. ప్రీమియ చెల్లింపు కాలవ్యవధుల మధ్య తక్కువ సమయం, ఎక్కువ కాలం కవరేజీ ఈ పాలసీ ప్రత్యేకత. ప్రీమియం హాలిడే ఉంటుంది. ఒక ఏడాది ప్రీమియం చెల్లించకుండానే కవరేజీ పొందొచ్చు. కొనుగోలుదారుడికి అనేక 'స్మార్ట్' ప్రయోజనాలు ఉంటాయి.

## ఎయిర్ ఇండియా 'రుణ' ప్రయత్నాలు

**బ్రిడ్జి లోన్ చెల్లింపు కోసం రూ.5,800 కోట్లు**

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎయిర్ ఇండియా మళ్లీ రుణ ప్రయత్నాల్లో పడింది. గతంలో ఆరు బోయింగ్ 787, ఒక బోయింగ్ 777 విమానం కొనుగోలు కోసం తీసుకున్న 81.9 కోట్ల డాలర్ల (సుమారు రూ.5,800 కోట్లు) బ్రిడ్జిలోన్ చెల్లించేందుకు అవసరమైన రీఫైనాన్స్ అందించే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ ప్రతిపాదనలు నవంబరు 24లోగా సమర్పించాలని కోరింది. దీర్ఘకాలిక నిధులు సమకూరే వరకు, తాత్కాలిక రుణాల ద్వారా ఆస్తులు సమకూర్చుకోవడాన్ని 'బ్రిడ్జి లోన్' అంటారు. ఈ రుణ చెల్లింపులకు ప్రభుత్వ హామీ ఉంది. దీంతో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ముందుకు వస్తాయని భావిస్తున్నారు.

## ఐఎస్‌బీ, రైల్వేల ఒప్పందం

**సంయుక్త పరిశోధన**

**రైల్వే ఆఫీసర్లకు సీఈఈలో శిక్షణ**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సంయుక్త పరిశోధన, కేస్ స్టడీల అభివృద్ధికి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), రైల్వే మంత్రిత్వ శాఖలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పంద పత్రాలపై రైల్వే బోర్డు చైర్మన్ వినోద్ కుమార్ యాదవ్, ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవత్సవ సంతకాలు చేశారు. ఐఎస్‌బీ, రైల్వేల మధ్య సహకారానికి కొనసాగింపుగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా మారుతున్న పోటీ వాతావరణానికి అనుగుణంగా రైల్వే ఆఫీసర్లలో నాయకత్వ నైపుణ్యాలను పెంచడానికి ఐఎస్‌బీ శిక్షణ ఇస్తుంది. ఐఎస్‌బీలోని సెంటర్ ఫర్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ (సీఈఈ) ఈ బాధ్యతలు స్వీకరిస్తుందని ఐఎస్‌బీ వెల్లడించింది. రైల్వే బోర్డు, ఐస్‌బీలు ఉమ్మడి ప్రయోజనాలున్న అంశాలపై పరిశోధన చేపడతాయి. కేస్ స్టడీలను అభివృద్ధి చేస్తాయి. ఐఎస్‌బీలో ఫ్యాకల్టీ రైల్వే బోర్డుకు సలహాలు ఇస్తుంది.

## టీ-హబ్ స్టార్టప్‌లకు నల్సార్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టీ-హబ్‌లోని యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నల్సార్ విశ్వవిద్యాలయం న్యాయపరమైన సేవలు అందించనుంది. స్టార్టప్‌లు వ్యాపార మోడళ్లను రూపొందించడంలో న్యాయపరమైన అవరోధాలను అధిగమించడానికి, నియమ నిబంధనలను రూపొందించుకోవడానికి నల్సార్‌కు చెందిన 'క్లియర్' సాయం చేయనుందని టీ-హబ్ సీఈఓ రవి నారాయణన్ తెలిపారు. ఈ మేరకు టీ-హబ్, నల్సార్ విశ్వవిద్యాలయాలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. స్టార్టప్‌లను రిజిస్టర్ చేసుకోవడంలో, పన్ను రిటర్న్‌ల దాఖలు, కాంట్రాక్టులు కుదుర్చుకునే ఒప్పందాల రూపకల్పన మొదలైన వాటిలో నల్సార్ అండగా నిలుస్తుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉత్పత్తి అభివృద్ధిపైనే తమ సమయాన్ని, ఇతర వనరులను వెచ్చిస్తారని.. అందువల్ల చట్ట, న్యాయ పరమైన రిస్క్‌లను అధిగమించడానికి ఇలాంటి మద్దతు అవసరమని రవి అన్నారు. వ్యాపారానికి మూలాధారం చట్టమని నల్సార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఫైజాన్ ముస్తాఫా పేర్కొన్నారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లోకి రతన్ టాటా

న్యూఢిల్లీ : ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా బుధవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతా తెరిచారు. ఆయన ఖాతా తెరిచిన నిమిషాల్లోనే వేల మంది ఫాలోవర్లు ఆయనకు స్వాగతం పలికారు. "ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించడం నాకు తెలియదు. కానీ ఇన్‌స్టాగ్రామ్‌లో అందరితో కలవడం చాలా ఉద్వేగంగా ఉంది" రతన్ టాటా పోస్ట్ చేశారు.

# వైసీపీ రంగుల పిచ్చికి పరాకాష్ట!

- మండిపడిన రాజకీయ పార్టీలు
- ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు
- వైసీపీ రంగు తొలగింపు.. కార్యదర్శి సస్పెన్షన్










అమరావతి, విజయవాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ జెండాకూ వైసీపీ రంగులు వేయడంపై విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అనంతపురం జిల్లా అమరాపురం మండలం తమ్మడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంపై జాతీయ జెండాలోని రంగులపై వైసీపీ నాయకులు ఆ పార్టీ రంగులు వేయించిన విషయం తెలిసిందే. ఇది హేయమైన చర్య అని టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం ట్విటర్‌లో విమర్శించారు. జగన్ ప్రభుత్వం తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, వైసీపీ నేతలకున్న రంగుల పిచ్చి పరాకాష్టకు చేరిందనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటనలో విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పంచాయతీ భవనాలు, బల్లలు, సామాజిక భవనాలు, అన్న క్యాంటీన్లు, వాటర్ ట్యాంకులు, చేతి పంపులు, శ్మశానాల గోడలు, ఆర్టీసీ బస్సులు, బావులు, కాళ్లకు ధరించే చెప్పులకూ వైసీపీ రంగులు వేసి, మానసిక ఆనందాన్ని పొందుతున్నారని ధ్వజమెత్తారు. కాగా, దేశ ప్రతిష్టను దెబ్బ తీసేలా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ట్విటర్‌లో విమర్శించారు. ఇసుక కృత్రిమ కొరతతో కార్మికులు పనుల్లేక ఆత్మహత్యలకు పాల్పడుతోంటే వైసీపీ వాళ్లకు రంగుల పిచ్చి పట్టుకుందని మండిపడ్డారు.

బీజేపీ శ్రేణులూ సామాజిక మాధ్యమాల్లో వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టాయి. దీంతో తమ్మడేపల్లి పంచాయతీ కార్యదర్శి ఆర్.ప్రకాశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. కార్యాలయం వద్ద గురువారం జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. అమరాపురం ఎంపీడీవో సుధాకర్, ఎస్ఐ ఆంజనేయులు వచ్చి భవనానికి పూర్తిగా తెల్లరంగు వేయించారు. రంగులు వేసే కూలీలకు అవగాహన లేకపోవడంతోనే ఇదంతా జరిగిందన్నారు.

## రేపే ఏపీ అవతరణ దినోత్సవం

- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం
- 14 నుంచి పాఠశాలల్లో నాడు-నేడు: పేర్ని నాని

అమరావతి/న్యూఢిల్లీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నవంబరు ఒకటిన అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించింది. జిల్లా స్థాయిల్లో జరిగే వేడుకల్లో మంత్రులు పాల్గొంటారని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) తెలిపారు. నవంబరు 14 నుంచి పాఠశాలల్లో నాడు-నేడు కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కింద మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామన్నారు. పాఠశాలల్లో నాడున్న మౌలిక సదుపాయాలు, మార్పుల అనంతరం నేడున్నవాటిని ఫొటోలు తీసి ప్రదర్శించాలని పిలుపు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా, ఢిల్లీలోని ఏపీభవన్‌లోనూ ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

## త్వరలో ఏడు వర్సిటీలకు వీసీలు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 7 విశ్వవిద్యాలయాలకు త్వరలో రెగ్యులర్ వైస్ చాన్సెలర్ల నియామకం కానున్నారు. ఈ పోస్టు కోసం ముగ్గురి పేర్లతో కూడిన ప్యానెల్‌ను ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు ఈ నెల 17న యోగి వేమన, 24న ఏయూ, 29న ఏఎన్‌యూ, 30న నన్నయ వర్సిటీల సెర్చ్ కమిటీలు సమావేశమయ్యాయి. ఎస్వీయూ, కృష్ణా, శ్రీ పద్మావతి వర్సిటీల సెర్చ్ కమిటీలు త్వరలో భేటీ కానున్నాయి. ప్రభుత్వ నామినీగా నియమితులైన డాక్టర్ ఆర్.వి.విద్యానాథ అయ్యర్(రిటైర్డ్ ఐఏఎస్) ఈ కమిటీలకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సమావేశాలు పూర్తయిన తర్వాత సీఎంవో నుంచి ముగ్గురి పేర్లతో కూడిన జాబితాలను గవర్నర్‌కు పంపిస్తారు. వచ్చేనెల 10నాటికి నియామక ప్రక్రియ పూర్తిచేయాలని విద్యాశాఖకు సీఎం జగన్ సూచించినట్లు సమాచారం.

## వారే చరిత్రలో కలిసిపోయారు

- తన కంపెనీలు, బినామీలకే సీఎం మేళ్లు: యనమల
- జగన్‌ది సిగ్గులేని జన్మ: బుద్దా



అమరావతి, విజయవాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తీవ్రంగా స్పందించారు. బుధవారం యనమల ఓ ప్రకటన విడుదల చేశారు. చరిత్ర ముగిసిందని అన్నవారే చరిత్ర లో కలిసిపోయారని అన్నారు. 'ఏడాది బిడ్డగా ఉన్నప్పుడే టీడీపీని చంపేయాలని చూశారన్నారు. టీడీపీ ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరంజీవే అన్నా రు. ఇలాగే అరాచకాలకు పాల్పడితే వైసీపీ చరిత్ర ముగిసే రోజు త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. తన కంపెనీలు, తన బినామీలకే జగన్ మేళ్ళు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుపై కక్షతో అమరావతిని చంపేస్తున్నారని మండిపడ్డారు. కాగా, వైసీపీ నేత విజయసాయిరెడ్డి కళ్లకు చత్వారం రావడం వల్లే అమరావతిలో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు. అమరావతి గ్రాఫిక్స్ అయితే అక్కడ చంద్రబాబు నిర్మించిన సచివాలయం నుంచి ఎవరు పాలన చేస్తున్నట్లని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 5 నెలల్లో బంగారు బాతు లాంటి అమరావతిని ఎడారిగా మార్చిన సిగ్గులేని జన్మ విజయసాయి, జగన్‌దని వెంకన్న విమర్శించారు. విజయసాయి తక్షణమే చంద్రబాబు హయాంలో ఏర్పాటు చేసిన ఈ-ఐ కేంద్రాల్లో పరీక్ష చేయించుకోవాలన్నారు.

## ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

కర్నూలు, అక్టోబరు 30: "నాన్నా! నాకు ఉద్యోగం రాదు. నువ్వు బాధపడుతుంటే చూడలేను. నాకు బతకాలని లేదు. నన్ను క్షమించు. అమ్మను బాగా చూసుకో. అక్కను బావ సరిగ్గా చూసుకోడు. మీవద్దనే అక్కను ఉంచుకోండి' అని లేఖ రాసి కర్నూలు నగరానికి చెందిన ప్రియాంక(21) ఆత్మహత్య చేసుకొంది. కాంట్రాక్టు ఉద్యోగం చేస్తూ, మరో యువతితో కలిసి ఉంటున్న గదిలో బుధవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ప్రియాంక గ్రామ సచివాలయ పోస్టు పరీక్షలు రాసింది. అయితే, ఆమె కల ఫలించలేదు. ఉద్యోగం సాధించలేకపోయానన్న బాధ ప్రియాంకను వేధించినట్టు, మృతదేహం వద్ద లభించిన సూసైడ్ లేఖ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ప్రియాంక స్వస్థలం పాణ్యంలో ఉన్న తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.

## సహకారానికి ఏడుగురితో కమిటీలు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార ఎన్నికలు వాయిదాపడడంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలకు ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. వీరి స్థానంలో ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీలను నియమించాలని భావిస్తోంది. ఈలోగా రిజర్వేషన్ ప్రక్రియలో మార్పులు చేస్తూ ప్రభుత్వం కొత్తగా చట్టాన్ని తెచ్చింది. దీంతో కమిటీల నియామకంపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. వీటికి రిజర్వేషన్ అమలు చేసే విషయంపై అధికార పార్టీ నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై మంత్రి కన్నబాబుతో బుధవారం చర్చించిన సహకార అధికారులు కసరత్తు చేసి, త్వరలోనే తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.

## సీడబ్ల్యూసీ సభ్యుడుగా రాజేంద్ర జైన్

న్యూఢిల్లీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర జలవనరుల సంఘం సభ్యుడుగా రాజేంద్ర కుమార్ జైన్ నియమితులయ్యారు. ఇప్పటివరకూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈఓగా ఉన్న రాజేంద్ర కుమార్ జైన్‌ను ఢిల్లీకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత సీడబ్ల్యూసీ చైర్మన్ అరుణ్ కుమార్ సిన్హా పదవీ కాలం బుధవారంతో పూర్తయింది.

## నలుగురు కన్సల్టెంట్లకు ఉద్వాసన

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో నలుగురు విశ్రాంత అధికారుల కు ఉద్వాసన పలికారు. ప్రభుత్వం తాజా ఉత్తర్వుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో టెక్నికల్ కన్సల్టెంట్లుగా పనిచేస్తున్న విశ్రాంత ఎస్ఈలు డి.బుగ్గయ్య, కె.ప్రభాకర్ రెడ్డి, బి.రవికుమార్ విశ్రాంత ఈఈ సత్యనారాయణలను విధులనుంచి తొలగించారు.

# ఇసుకపై పోరుకేక

- గుంటూరులో లోకేశ్ నిరసనదీక్ష
- ఏ పందికొక్కు బొక్కుతోందంటూ జగన్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శ
- 'తూర్పు'లోఎమ్మెల్యే భవాని దీక్ష
- ఇసుకను రూ .50కు విక్రయిస్తూ నెల్లూరులో బాధితుల ఉద్యమం
- రాజమహేంద్రిలో ఉరికంబమెక్కి నిరసన తెలిపిన కార్మికులు


లోకేశ్‌కు నిమ్మరసం తాగించి దీక్ష విరమింప జేస్తున్న నిర్మాణ కార్మికులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రమంతా 'ఇసుక' దుమారం మరింత తీవ్రతరమైంది. అది తుఫానుగా మారి సర్వత్రా నిరసనలు హోరెత్తాయి. రోడ్డెక్కిన భవన నిర్మాణ కార్మికులకు అండగా రాజకీయ పార్టీలు కదం తొక్కాయి. ఇసుక కొరతను నిరసిస్తూ భవన నిర్మాణ కార్మికులకు సంఘీభావంగా గుంటూరు కలెక్టరేట్ ఎదురుగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బుధవారం ఒక రోజు నిరాహార దీక్ష చేశారు. ఉదయం 10.40 గంటలకు దీక్ష ప్రారంభించిన ఆయన సాయంత్రం ఐదు గంటలకు భవన నిర్మాణ కార్మికులు ఇచ్చిన నిమ్మరసం తీసుకొని, నిరసన విరమించారు. దీక్ష సమయంలో భారీవర్షమే పడినా, నాయకులు, కార్యకర్తలు అక్కడనుంచి కదలలేదు. "రాష్ట్రంలోని ఇసుకను ఏ పందికొక్కు తింటుంది? అని తీవ్రస్థాయిలో లోకేశ్ ప్రశ్నించారు. నష్టపోయిన ప్రతి కార్మికుడి కుటుంబానికి నెలకు రూ.10 వేలు చొప్పున ఈ ఐదు నెలలకు వెంటనే రూ.50 వేలు చెల్లించాలని, ఆత్మహత్య చేసుకున్న ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, తిరిగి ఉచిత ఇసుక విధానం తీసకురావాలని డిమాండ్ చేశారు. కాగా, నెల్లూరు జిల్లాలో భవన నిర్మాణ కూలీలు వినూత్న నిరసన తెలిపారు. సీఐటీయు ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండు వద్ద వారు రూ.50కు త్రాసులో ఇసుకను కొలిచి, విక్రయిస్తూ అందరినీ ఆకర్షించారు. వీరికి సంఘీభావంగా టీడీపీ నాయకులు నెల్లూరులో ఒక రోజు నిరాహార దీక్ష చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 'ఇసుక' ఆందోళన ఊపందుకొంది. రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఆమె తక్కెడలో ఇసుక తూచి అమ్ముతూ నిరసన తెలిపారు. అక్కడే బాధిత కార్మికులు వైసీపీ జెండాలతో కూడిన ఉరికంబాలు ఎక్కి.. నిరసన తెలిపారు. కాగా, ఇసుక కొరత కారణంగా పనులు దొరక్క గుంటూరు జిల్లాలో ఆత్మహత్య చేసుకొన్న కుటుంబాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పరామర్శించారు.

### నిమ్మల తనిఖీలో బయటపడ్డ అక్రమ ఇసుక

పాలకొల్లు, అక్టోబరు 30: పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కట్టు కాలువ ఇసుక స్టాక్ పాయింట్‌ను పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేరువేరు చిరునామాలు ఉన్న పలు డీడీలతో ఒకే లారీలో ఇసుకను ఎగుమతి చేస్తున్న విషయాన్ని వెలికి తీశారు. సంబంధిత సిబ్బంది, లారీ డ్రైవర్లను దీనిపై లోతుగా ప్రశ్నిస్తే... ఆన్‌లైన్‌లో పలుపేర్లతో ఇసుకను బుక్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి, అధిక ధరలకు అమ్ముతున్నట్టు వెల్లడైంది. ఎమ్మెల్యేని చూడగానే మరో 13 లారీలు అక్కడి నుంచి ఖాళీగా వెళ్లిపోయాయి.

## ఇసుకోత్సవాలు సిగ్గుచేటు

- వీటిపై హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు
- టీడీపీ నేతలకు చంద్రబాబు పిలుపు

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'కూలీలకు అండగా నిలుస్తున్నవాళ్లను రాబందులంటారా? రాబందులు మేం కాదు.. మీరే రాక్షసులు' అని టీడీపీ అధినేత చంద్రబాబు వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఐదు నెలలుగా ప్రజలు ఇసుక దొరక్క అల్లాడుతుంటే జగన్ ప్రభుత్వం ఇప్పుడు నిద్ర లేచి ఇసుక వారోత్సరాలు జరుపుతామనడం సిగ్గుచేటన్నారు. జరపాల్సింది ఇసుక వారోత్సవాలు కాదని, ఇసుకను తమ గుప్పిట్లో చెరపట్టిన ఇసుకాసురుల భరతం పట్టే వారోత్సవాలు జరపాలని హితవు పలికారు. బుధవారం ఉదయం టీడీపీ ప్రజా ప్రతినిధులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇతర నేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'గతంలో నరకాసురుడు, రావణాసురుడు, బకాసురుడు ఉండేవారు. ఇప్పుడు ఊరికో వైసీపీ ఇసుకాసురుడు తయారయ్యాడు. నరకాసురుడి అంతంతో దీపావళి పండుగ జరుగుతోంది. ఇసుకాసురుల భరతం పడితేనే పేదలకు నిజమైన దీపావళి. నిన్న కూడా పిడుగురాళ్లలో ట్రక్కు డ్రైవర్ గోపి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇసుక కొరత వల్ల ఉపాధి పోయి ఇప్పటికి ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వ హత్యలే. వీటిపై పార్టీ నేతలు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి. జాతీయ స్థాయిలో ఈ పరిణామాలను ఎండగట్టాలి' అని వారికి సూచించారు. కార్మిక సంఘాలతో కలిసి దీని సాధనకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## బాబు, కన్నాకు పవన్ ఫోన్

- 'లాంగ్‌మార్చ్'కు మద్దతివ్వాలని వినతి



అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇసుక లభ్యత లేక ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న భవన నిర్మాణ కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో నవంబరు 3వ తేదీన విశాఖలో చేపట్టిన 'లాంగ్ మార్చ్'కు మద్దతివ్వాలని జనసేనాని పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని ప్రతిపక్షాలను కోరారు. ఆయన బుధవారం తొలుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణతో, తర్వాత టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి, లోక్‌సత్తా అధ్యక్షుడు డీవీవీఎస్ శర్మ, బీఎస్పీ అధ్యక్షుడు సంపత్‌రావులతో ఫోన్లో మాట్లాడారు. లాంగ్ మార్చ్‌కు తెలుగుదేశం సంఘీభావం ప్రకటించాలని ఆయన కోరగా, చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. కాగా, ఇసుక లేక కార్మికులు ఉపాధి కోల్పోయిన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తామని పవన్ వెల్లడించారు.

## ఎవరో.. ఎందుకో?

- ఆత్మహత్యలపై పెద్దిరెడ్డి వ్యాఖ్యలు

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులెవరూ చనిపోలేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. వర్షాకాలంలో భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకవని, ఇది వారికి అన్‌సీజన్ అని, అన్‌సీజన్‌లో ఎవరైనా ఆత్మహత్యలు చేసుకుంటారా అని ప్రశ్నించారు. 'ఎవరో ఎక్కడో ఎందుకో ఏదో చేసుకుంటే అదేదో భవన నిర్మాణ కార్మికులే ఆత్మహత్య చేసుకున్నారని రాజకీయాల కోసం చెప్పడం సమంజసం కాదు. ఇసుకను భూతంలా చూపించి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించాలనుకుంటున్నారు. మేమెక్కడా తప్పు చేయలేదు. మా పార్టీకి చెందిన నేతలెవరూ ఇసుక వ్యాపారం చేయడం లేదు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఉంటే వర్షాలు పడవు కాబట్టి ఇసుక దొరికేది. ఇప్పుడు జగన్ సీఎం అయ్యారు కాబట్టి వర్షాలు పడుతున్నాయి. అందుకే ఇసుక కొరత ఉంది. ఇసుక కొరతను బూచిగా చూపి స్థానిక సంస్థల్లో వైసీపీకి ఎదురు దెబ్బ తప్పదంటున్న చంద్రబాబు ముందు చిత్తూరు జిల్లాలో పోటీచేసి గెలవాలి' అని పెద్దిరెడ్డి సవాల్ చేశారు.

# రాష్ట్రంలో హక్కుల ఉల్లంఘన

- టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజం
- విస్తృత భేటీలో బాధితులతో ప్రత్యేక భేటీ


వైసీపీ బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న చంద్రబాబు

విజయవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని,మాట్లాడే స్వేచ్ఛను, నివసించే హక్కులను కాలరాస్తోందని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. ఎప్పుడూ రాని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బృందం ఇప్పుడు రాష్ట్రానికి రావడం సిగ్గుచేటన్నారు. 'ప్రశాంతమైన కృష్ణా జిల్లాలోనూ హత్యా రాజకీయాలకు శ్రీకారం చుడతారా? 54 మందిపై 25 తప్పుడు కేసులు పెడతారా? ఆబోతులను తయారు చేసి సమాజంపైకి వదిలిపెడతారా? మా పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి మానసిక క్షోభకు గురిచేస్తారా? ఖబడ్దార్ అని ముఖ్యమంత్రి జగన్‌ను, మంత్రులను హెచ్చరించారు. పార్టీ కోసం త్యాగాలు చేసిన కార్యకర్తలను కాపాడుకునేందుకు తన ప్రాణాలనైనా ఒడ్డుతానని స్పష్టం చేశారు. టీడీపీ కృష్ణా జిల్లా విస్తృత స్థాయి సమావేశాల్లో భాగంగా బుధవారమిక్కడ ఆయన విజయవాడ సెంట్రల్, అవనిగడ్డ, నందిగామ, పామర్రు, నూజివీడు, గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గాలపై సమీక్ష నిర్వహించారు. పాలక వైసీపీ నేతలు బనాయించిన అక్రమ కేసుల బాధితులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

### మైండ్‌గేమ్‌ను ఎదుర్కొందాం..

'వైసీపీ నాయకులు నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ఆ అవమాన భారంతో బాధితులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇది వైసీపీ నాయకులు 'జగన్నాటకం'లో భాగంగా ఆడుతున్న మైండ్‌గేమ్. అందుకే అక్రమ కేసులను ఎదుర్కొంటున్న టీడీపీ కుటుంబ సభ్యులు ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దు. ఇది చెప్పడానికి, బాధితులకు మానసిక స్థైర్యాన్ని, ధైర్యాన్ని ఇవ్వడానికే జిల్లాల్లో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాను. బాధితులకు అండగా ఉండి వారిని కాపాడుకునేందుకు రాజీలేని పోరాటం చేస్తాం. అవసరమైతే నా ప్రాణాలను ఒడ్డయినా కార్యకర్తలను కాపాడుకుంటాను. మనపై పెడుతున్న అక్రమ కేసులన్నిటినీ సమీక్షించి న్యాయస్థానాలకు వెళ్తాం. అవసరమైతే ప్రైవేటు కేసులు వేస్తాం. తప్పుడు కేసులు పెట్టినవాళ్ల అంతు చూస్తాం. పిచ్చిపిచ్చి ఆటలాడితే తోక కత్తిరిస్తాం. ముఖ్యమంత్రిని, మంత్రులను హెచ్చరిస్తున్నా.. మా పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులపై కొన్ని నెలలుగా నేను మాట్లాడుతుంటే ముఖ్యమంత్రి ఒక్కరోజు కూడా సమీక్ష చేసి ఇది తప్పని చెప్పలేకపోతున్నారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకుని చనిపోతే ముఖ్యమంత్రి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మానవత్వమున్న మనిషి ఎవరైనా స్పందిస్తారు. కానీ మనందరం బాధపడుతుంటే ఆయన (జగన్) ఆనందపడుతున్నాడు. హోంమంత్రి నియోజకవర్గంలో రోడ్డుకు అడ్డంగా గోడ కట్టి ఐదు నెలలైనా ఇప్పటికీ తీయించలేదు. అడ్డుగోడలు కట్టడానికి ఇదేమైనా పాకిస్థానా? టీడీపీ శ్రేణులు తిరగబడితే మీ పోలీసు వ్యవస్థ కాపాడగలదా? పిచ్చిపిచ్చి ఆలోచనలు చేయొద్దని ముఖ్యమంత్రిని, మంత్రులను హెచ్చరిస్తున్నా. జగన్ తన మంత్రుల్ని కట్టడి చేసుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు నేను కూడా ఇలాగే ప్రవర్తించి ఉంటే రాష్ట్రంలో వైసీపీకి అడ్రస్సే ఉండేది కాదు. గుంటూరు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వాళ్ల దౌర్జన్యాలకు పాల్పడితే మన పార్టీ నాయకుల్ని పంపించాను. లెక్కచేయలేదు. దాంతో బాధితులందరినీ తీసుకొచ్చి శిబిరం ఏర్పాటు చేశాం. ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసినా పట్టించుకోకపోవడంతో 'చలో ఆత్మకూరు'కు పిలుపిచ్చాను. అక్కడికి వెళ్లడానికి వీల్లేదంటూ పోలీసులు నా ఇంటి చుట్టూ తాళ్లు కట్టారుగాని.. పల్నాడులో వైసీపీ నాయకుల అరాచకాలను అరికట్టే పరిస్థితిలో లేరు. అందుకే మా పార్టీ నాయకులు ఢిల్లీకి వెళ్లి మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదునందుకునే మానవ హక్కుల కమిషన్ రాష్ట్రానికి వచ్చింది.'

### ఎమ్మెల్యే వంశీపై కేసా..?

'అభ్యంతరాలు లేని స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారికి లక్ష వరకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని టీడీపీ ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే గన్నవరం నియోజకవర్గంలో పట్టాలిచ్చాం. ఇప్పుడు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని లొంగదీసుకోవాలని.. ఆ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పీఏ లెటర్ డ్రాఫ్ట్ తయారు చేసి ఎమ్మార్వోకు పంపిస్తే.. దానిపై తహశీల్దారు సంతకం చేసి యథాతథంగా ఎస్పీకి పంపించారు. ఎస్పీ ప్రాథమిక విచారణ కూడా చేయకుండా ఎమ్మెల్యే వంశీపై ఫోర్జరీ కేసు నమోదు చేశారు' అని చంద్రబాబు మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు అస్సైన్ చేసిన భూములను ఎవరూ అమ్మకూడదు.. కొనకూడదని, కానీ ఇడుపులపాయలో 700 ఎకరాలకుపైగా అస్సైన్డ్ భూములను కబ్జా చేసిన వైఎస్‌ని ఆధారాలతో అసెంబ్లీలో నిలదీస్తే అడ్డంగా దొరికిపోయారన్నారు.

**వారెవరినీ వదిలిపెట్టను..:** 'డీజీపీ కూడా నన్ను హెచ్చరించే పరిస్థితికి వచ్చారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన నాకు చట్టాలగురించి చెబుతున్నారు. ఖబడ్దార్.. జాగ్రత్తగా ఉండండి. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తుంది. ఇప్పుడు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న వారెవరినీ వదిలిపెట్టన'ని హెచ్చరించారు.

## దాడులపై ఆరా

- జంగమహేశ్వరపాడులో ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం పర్యటన

జంగమహేశ్వరపాడు(దుర్గి), అక్టోబరు 30: గుంటూరు జిల్లా దుర్గి మండలంలోని జంగమహేశ్వరపాడు గ్రామంలో బుధవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) బృందం పర్యటించింది. పల్నాడులోని పలు గ్రామాల్లోని టీడీపీ వర్గీయులపై ప్రత్యర్థులు దాడులు చేస్తూ మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారంటూ టీడీపీ ఎంపీలు ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ముఖేశ్, లాల్ బహార్, అరుణ్‌కుమార్, మల్లయ్యతో కూడిన ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం గ్రామాన్ని సందర్శించింది. ఎంపీపీ స్కూల్‌లో విచారణ చేపట్టింది. వైసీపీ బాధితులను ఒక్కొక్కరినీ పిలిచి వివరాలను నమోదు చేసుకుంది. 'మీపై దాడి జరిగిందా? ఊరు విడిచి వెళ్లారా?' అంటూ ప్రశ్నలు వేస్తూ వివరాలను రాబట్టింది. టీడీపీకి చెందిన 17 మందిని, వైసీపీకి చెందిన ఒకరిని విచారణ చేసింది. అనంతరం వైసీపీ బాధితుల జాబితాలో ఉన్న ఐదారుగురి గృహాలకు వెళ్లగా ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. దీంతో బృంద సభ్యులు ఇరుగుపొరుగుతో వారి వివరాలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల సమయంలో గొడవలు జరిగి ఇళ్లకు తాళాలు వేసుకొని వెళ్లారని, అప్పుడప్పుడు వచ్చి పోతున్నారని స్థానికులు బృందానికి తెలిపారు. అనంతరం ఆత్మకూరు పర్యటించాల్సి ఉన్నప్పటికీ సమయం మించిపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. పర్యటనలో ఎన్‌హెచ్‌ఆర్సీ బృందంతో పాటు స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## దౌర్జన్యాలకు పాల్పడుతున్న పోలీసులు

- వాటిని ప్రోత్సహిస్తున్న జగన్ ప్రభుత్వం: మండిపడ్డ జేసీ


మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

అనంతపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో పోలీసులే దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. పోలీసుల రాజ్యం నడుస్తోంది. ప్రభుత్వమే పోలీసుల దౌర్జన్యాలను ప్రోత్సహిస్తోంది. రెండున్నర సంవత్సరాల తరువాత ఎవరెక్కడ ఉంటారో పోలీసులే తెలుసుకోవాలి. ఆరోజు ప్రజలు చూస్తారు.. పోలీసులకూ తెలుస్తుంది" అని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతపురం జిల్లా వెంకటాపురానికి బయలుదేరిన జేసీ బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో టీడీపీ నేత కురబ నాగరాజు ఇంటి వాకిలి ముందు వైసీపీ నాయకులు బండలు నాటారు. ఆ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ నేపథ్యంలో జేసీతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్సీలు కేఈ ప్రభాకర్, బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్యే యామినిబాలతో పాటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి ఆ గ్రామానికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి, అనంతపురం డీఎస్పీలు సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి బుక్కరాయసముద్రం సమీపంలో నేతలు ప్రయాణిస్తున్న కారును అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకొని బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తరువాత వారిని వదిలిపెట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్థల వివాదాన్ని పరిష్కరించకుండా కులాల మధ్య చిచ్చుపెట్టే స్థాయికి రెవెన్యూ, పోలీసులే తీసుకెళ్తున్నారని ఆరోపించారు.

## మీడియాపై దాడులను సహించం

- జగన్ పాలనలో పత్రికా స్వేచ్ఛకు ముప్పు: కాల్వ

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇంటి వద్ద 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' సిబ్బందిపై వైసీపీ నాయకుల దాడిని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు ఖండించారు. వైసీపీ అధికారంలోకి వచ్చా క జర్నలిస్టులపై దాడులు, వేధింపులు పెరిగాయని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పత్రికా స్వేచ్ఛను హరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత బయటకు కనిపించకుండా చూడటానికే మీడియాను అణిచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఏకంగా హత్యల వరకూ పరిస్థితిని తీసుకెళ్లారని ఆరోపించారు. ఈ దాడులకి వ్యతిరేకంగా పోరాడతామని పేర్కొన్నారు.



# నేను చనిపోయేలోగా.. పింఛన్ ఇప్పించండయ్యా!

- పలమనేరులో ఓ అవ్వ ఆవేదన..
- వైసీపీ ఆఫీసు ముందే దీక్ష

పలమనేరు రూరల్, అక్టోబరు 30: ముగ్గుబుట్ట వంటి తల. ముడతలు తేలిన దేహం.. గాజు కళ్లు.. ముసురు వానలో తడుస్తూ, చలి గాలికి వణుకుతూ రోడ్డు పక్కన నేల మీద 81 ఏళ్ల వృద్ధురాలు. ఆ అవ్వ చేతిలో ఒక అట్ట ముక్క. దాని మీద 'ఎమ్మెల్యే గారూ పెన్షన్ ఇవ్వండి' అనే అక్షరాలు. చిత్తూరు జిల్లా పలమనేరు వైసీపీ కార్యాలయం ఎదుట బుధవారం ఉదయం ఆ అవ్వను చూసినవాళ్లంతా చెమ్మగిల్లిన కళ్లతో కదలిపోయారు. బేరుపల్లెకు చెందిన చెంగమ్మ ఒంటరిగా జీవిస్తోంది. భర్త, కూతురు కొన్నాళ్ల కిందటే చనిపోయారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్, 5 కిలోల రేషను బియ్యమే ఆమెకు ఆధారం. ఇప్పుడా పింఛను ఆగిపోయింది. అందరి చుట్టూ తిరిగింది. లాభం లేకపోవడంతో పలమనేరుకు వచ్చి ఎమ్మెల్యే ఇంటి సమీపంలోని వైసీపీ ఆఫీసు ముందు కూలబడి తన ఆవేదనను వెల్లడించింది. అవ్వ విషయం తెలిసిన కానిస్టేబుల్ ఒకరు రంగంలోకి దిగి, ఆమెను ఎంపీడీవో వద్దకు తీసుకు వెళ్లాడు. వరుసగా 3 నెలలు తీసుకోకపోవడంతో పింఛను ఆగిపోయిందని, కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. దీంతో కానిస్టేబుల్ చంగమ్మను తహసీల్దారు దగ్గరకి సాధికార సర్వే కోసం తీసుకెళ్లారు. అయితే, దీనికి కొన్ని పత్రాలు అవసరం ఉండడంతో ఆయన న్యాయం చేస్తానని భరోసా ఇస్తూ.. రూ.1000 ఇచ్చి పంపేశారు. అప్పుడు అవ్వ.. 'నేను కన్నుమూసేలోగా పింఛను ఇప్పించండయ్యా' అని వేడుకొంది.



ఏపీ ఈఆర్‌సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ నాగార్జున రెడ్డితో గవర్నర్, ముఖ్యమంత్రి

## విద్యుత్ రంగ ఉన్నతికి కృషి

**» ఈఆర్‌సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జునరెడ్డి ప్రమాణం**

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగ ఉన్నతికి సమష్టిగా కృషి చేస్తానని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి అన్నారు. ఈఆర్‌సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జునరెడ్డి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం నాటి నుంచి ఐదేళ్లు లేదా 70 సంవత్సరాల వయసు వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. కాగా.. జస్టిస్ నాగార్జున రెడ్డికి హైకోర్టు చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి తేనీటి విందు ఇచ్చారు.

## కేసీఆర్ వ్యాఖ్యలతో మరింత కసి: మంత్రి పేర్ని

భవానీపురం(విజయవాడ), అక్టోబరు 30: మూడు నెలల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి చూపిస్తామని ఏపీ రవాణా మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. విజయవాడ విద్యాధరపురంలోని రాష్ట్ర ఆర్టీసీ వైద్యశాలలో డార్మెటరీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ 'ఏపీలో ఆర్టీసీ విలీనంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యతో మా ప్రభుత్వంలో కసి, పట్టుదల పెరిగాయి. రానున్న మూడు నెలల్లో విలీనం చేసి తీరతాం' అన్నారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని నాని కూడా పాల్గొన్నారు.

## పరిశ్రమలశాఖ సదస్సుకు ఏపీ గైర్హాజరు

న్యూఢిల్లీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం జరిగిన జాతీయ పారిశ్రామిక, వాణిజ్య వర్కుషాపులో ఏపీ ప్రాతినిథ్యం కనిపించలేదు. ఈ వర్కుషాపునకు ఏపీ పరిశమలశాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి గైర్హాజరయ్యారు. సంబంధిత శాఖ ముఖ్యకార్యదర్శి, కార్యదర్శి కూడా ఈ సదస్సులో పాల్గొనలేదు. భారత పారిశ్రామిక, వాణిజ్య రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించి, వాణిజ్య రంగాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలన్న లక్ష్యంతో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ వర్కుషాపులో అన్ని రాష్ట్రాల పరిశ్రమ శాఖల మంత్రులు హాజరయ్యారు. అయితే బుధవారం ఏపీ మంత్రి మండలి సమావేశం ఉండడం వల్ల మంత్రితో పాటు ముఖ్యకార్యదర్శి, కార్యదర్శులెవరూ ఈ సదస్సుకు హాజరు కాలేకపోయారని చెబుతున్నారు.

## 3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు

**» హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం**

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ మేరకు అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం హైకోర్టుకు స్పష్టం చేశారు. అయితే, ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారి ద్వారా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయించాలని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను నవంబరు 18కి వాయిదా వేసింది. విజయవాడకు చెందిన ఎ.వేణుగోపాలకృష్ణమూర్తి దాఖలు చేసిన పిల్‌పై బుధవారం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఇదిలావుంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో 59.85% రిజర్వేషన్లు అమలు చేయనున్నట్టు పురపాలక పట్టణాభివృద్ధి మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. బీసీలకు 34%, ఎస్సీలకు 19.08%, ఎస్టీలకు 6.77% కోటా ఉంటుందని చెప్పారు.

## వ్యతిరేక వార్తలపై కేసులు.. జీవో జారీ

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మీడియాపై కేసులు పెట్టే అధికారాన్ని శాఖాధిపతులు, కార్యదర్శులకు కట్టబెడుతూ జీవో జారీ అయింది. 2007లో తన తండ్రి వైఎస్ హయాంలో జారీ అయిన జీవోకు జగన్ కొత్త కోరలు తొడిగారు. 'బ్లాక్ జీవో' అంటూ జాతీయ స్థాయిలో వచ్చిన విమర్శల నేపథ్యంలో.. వైఎస్ పక్కన పెట్టిన ఆదేశాల ఆధారంగానే కొత్త ఉత్తర్వులిచ్చారు. కథనాలను పరిశీలించి కేసులు పెట్టే అధికారాన్ని గతంలో సమాచార, ప్రసార శాఖ ప్రత్యేక కార్యదర్శికి అప్పగించగా.. ఇప్పుడు అదే అధికారాన్ని నేరుగా ఆయా శాఖల కార్యదర్శులకే కట్టబెట్టారు. "పత్రికలు, టీవీ చానళ్లు, సోషల్ మీడియాలో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వచ్చే కథనాలకు వివరణ/ఖండన పంపించడం, అవసరమైతే ఫిర్యాదు చేయడం, కేసులు నమోదు చేయడంతోపాటు అవసరమైతే పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా చట్టబద్ధ చర్యలు తీసుకునే అధికారాన్ని కార్యదర్శులకే అప్పగిస్తున్నాం" అని జీవోలో పేర్కొన్నారు.

### మీడియా గొంతు నొక్కే జీవో: చంద్రబాబు

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న మీడియా సంస్థలు, ప్రజల గొంతు నొక్కేందుకు వీలుగా వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో క్రూరమైనదని టీడీపీ అధినేత చంద్రబాబు ట్విటర్ వేదికగా ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే, విమర్శించే హక్కు అందరికీ ఉంటుందని పేర్కొన్న ఆయన.. ఏపీలో వైసీపీ ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛను అరికట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. ఈ జీవో రద్దుచేసే వరకు వీధుల్లోకొచ్చి పోరాడతామని హెచ్చరించారు.

### స్వేచ్ఛకు సంకెళ్లు: పవన్

మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేసేలా ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజాస్వామ్య మూల స్తంభాల్లో మీడియా ఒకటని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను, విధానాలను ప్రశ్నించే కలాలను, గొంతులను కట్టడి చేస్తున్న ఈ చర్యలను ఖండిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్తర్వులను వెంటనే రద్దుచేయాలని జనసేన తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.




**నమ్మి బాధ్యతలిస్తే..**

# చేయరా?

- **» ఎమ్మెల్యేలే పార్టీకి బలం**
- **» మంత్రులతో వారికి గొడవలుంటే నష్టం**
- **» సమన్వయపరచాల్సింది ఇన్‌చార్జి మంత్రులే**
- **» శాఖాపరమైన విధులు నిర్వర్తిస్తే చాలదు**
- **» పార్టీ బలోపేతం కూడా మీ పనే**
- **» సమన్వయంలో విఫలమైతే తీసేస్తా**
- **» జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు జగన్ హెచ్చరిక**

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నమ్మి బాధ్యతలు అప్పగిస్తే.. వాటిని నెరవేర్చకపోతే ఎలాగని సీఎం జగన్ ఇన్‌చార్జి మంత్రుల్ని నిలదీశారు. 'జిల్లాల్లో పార్టీని బలోపేతం చేసే బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదే. ముఖ్యమంత్రిగా నేనూ ప్రభుత్వ బాధ్యతలే చూసుకుని.. మంత్రులుగా మీరూ శాఖాపరమైన బాధ్యతలే చూసుకుంటే పార్టీ బలోపేతమయ్యేదెలా? శాఖాపరమైన బాధ్యత ఒక్కటే నిర్వర్తిస్తే చాలదు. పార్టీని బలోపేతం చేయడానికి సాధించిన విజయాలనూ పరిగణనలోకి తీసుకుంటా. ఆరు నెలల పనితీరు ఆధారంగా చేసుకుని చూస్తా. పనితీరు బాగా లేకపోతే కొనసాగించడం ఎందుకు' అని ప్రశ్నించినట్లు తెలిసింది. బుధవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం సందర్భంగా జిల్లాల్లో పార్టీ బలోపేతం గురించి ఆయన గట్టిగా ప్రస్తావించినట్లు సమాచారం. పార్టీకి ఎమ్మెల్యేలే బలమని తేల్చిచెప్పారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. 'జిల్లాల్లో ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గొడవల వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతుంది. ఎమ్మెల్యేలు బలంగా ఉంటేనే.. పార్టీ బలంగా ఉంటుంది. ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య సమన్వయం పెంచే బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదే. ప్రతి నెలా జిల్లా స్థాయి సమీక్షా సమావేశం (డీడీఆర్‌సీ) నిర్వహించాల్సిందే. ఈ సమావేశానికి తప్పనిసరిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి హాజరు కావాలి. ప్రతి నెలలో రెండు నుంచి నాలుగు రోజులపాటు జిల్లాల్లో బస చేయాల్సిందే. ఆ సమయంలో.. పార్టీ నేతల మధ్య నెలకొన్న విభేదాలను పరిష్కరించడంపై దృష్టి సారించాలి. ఎమ్మెల్యేల మధ్య విభేదాలుంటే.. సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలి. ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య 'హద్దు' వివాదాలుంటే.. వాటిని సరిదిద్దే బాధ్యతా ఇన్‌చార్జి మంత్రులదే. ప్రజాప్రతినిధులు, నాయకులకూ మధ్య సమన్వయలోపం తగ్గించే బాధ్యతా వారిదే. ఇంటెలిజెన్స్ విభాగం నాకిచ్చే నివేదికలతో సంబంధం లేకుండా నేరుగా వారు జిల్లాల్లోని పార్టీ పరిస్థితులపై నాకు సమాచారమివ్వాలి. జిల్లాలో పార్టీ బలపడినా.. బలహీనమైనా అందుకు పూర్తి బాధ్యత వారిదే. తేడా వస్తే సహించేది లేదు. ఇన్‌చార్జి మంత్రులనే బాధ్యులను చేస్తాను. మూడు నెలలు ఆరు నెలలని చూడను. వారిని ఆ బాధ్యతల నుంచి తప్పించేస్తాను. ఇలా చేస్తే.. రాజకీయంగా మీరే బలహీనమవుతారు' అని ముఖ్యమంత్రి హెచ్చరించినట్లు సమాచారం. ఉపోద్ఘాతం లేకుండానే ఇన్‌చార్జి మంత్రుల బాధ్యతలను జగన్ విశదీకరించడంతో.. కేబినెట్ భేటీ ముగియగానే మంత్రులు దీనిపైనే చర్చించుకోవడం కనిపించింది. కాగా.. మార్కెట్ కమిటీ పదవులకు పోటీ పడుతున్న వారెవరో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు గుర్తించాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. 'ఇలా గుర్తించిన వారి పేర్లను కలెక్టర్లకు అందజేయాలి. కలెక్టర్లు వాటిని లాటరీ తీసి.. మార్కెట్ యార్డుల పదవులను అప్పగిస్తారు. ఈ పోస్టులన్నిటిలోనూ రిజర్వేషన్లు వర్తింపజేయాల్సిందే. రాజకీయ పదవుల్లోనూ కోటా అమలు చేస్తామని చట్టం చేశాం. ఒకసారి మాట చెప్పాక.. దానిని అమలు చేస్తేనే ప్రజల్లో విశ్వసనీయత ఉంటుంది' అని ఆయన అన్నట్లు సమాచారం.

### బాబువి పనికిమాలిన మాటలు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మాటలకూ, చేతలకూ పొంతన ఉండడం లేదని .. పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేబినెట్ భేటీలో ఇసుక కొరత అంశం ప్రస్తావనకు వచ్చింది. జగన్ జోక్యం చేసుకుని.. ఇసుక కొరతపై మనమేం చేయగలమని ప్రశ్నించారు. 'నదుల్లో వరద ఉది. అందువల్ల ఇసుక తవ్వకాలు జరగడం లేదు. వారం రోజుల్లో వరదలు తగ్గుముఖం పడతాయి. అందుకే ఇసుక వారోత్సవాల నిర్వహణకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించాం' అని చెప్పారు.

### వారికి అమ్మఒడి వద్దన్న బుగ్గన

కేబినెట్ సమావేశంలో తొలుత అమ్మఒడిపై చర్చ జరిగింది. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లులకు ఈ పథకాన్ని అమలు చేయవద్దని, భారమవుతుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని.. 'వారికి అమ్మఒడిని అమలు చేయకుంటే.. వారు వాటిని వదిలేసి సాధారణ పాఠశాలల్లోకి వెళ్లిపోతారు. ఇలా జరిగితే నష్టపోతారు. అందుకే వారి తల్లులకూ అమ్మఒడిని అమలు చేద్దాం' అని స్పష్టం చేశారని తెలిసింది. నవంబరు నెలలోనే రాష్ట్రంలోని ఆలయ కమిటీలన్నింటినీ వేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రులను సీఎం ఆదేశించినట్లు సమాచారం.

### సీఆర్డీయే కార్యాలయ ప్రారంభం వాయిదా!

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అది తుళ్లూరులో కొత్తగా నిర్మిస్తున్న సీఆర్డీయే భవనం. బుధవారం ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. ఇంతలో ఏమైందో ఏమో తెలీదు కానీ ప్రారంభోత్సవం వాయిదాపడింది. రాజధానిలో ఉన్నఫళంగా ఆగిపోయిన ప్రాజెక్టుల భవితవ్యం ఏమిటో తేలకముందే తుళ్లూరుకు సీఆర్డీయే ఇంజినీరింగ్ విభాగాన్ని ఇప్పటికిప్పుడు ఎందుకు తరలించారని సీఎం జగన్ నిలదీస్తే ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది. జగన్ ఆదేశానుసారం నడుచుకోవడమే శ్రేయస్కరమని భావిస్తున్నారు.

## భూములమ్మి 'బిల్డ్'

(మొదటి పేజీ తరువాయి)

పోషించే అవకాశం ఉంది. మిషన్ బిల్డ్‌కు ప్రవీణ్ కుమార్‌ను డైరెక్టర్‌గా నియమించారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

### ఇవీ లక్ష్యాలు..

నవరత్నాలు, నాడు-నేడు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు, మానవాభివృద్ధి సూచికలను పెంచడమే ' మిషనల్ బిల్డ్' ప్రధాన లక్ష్యాలు. అయితే... ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగలేదు. జీతాలు, పెన్షన్లు, సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాల అమలుకు నిధులు సేకరించేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలకు అసలే డబ్బుల్లేవు. మరోవైపు... అంత సులువుగా అప్పులు కూడా పుట్టని పరిస్థితి. ఈ నేపథ్యంలో 'మిషన్ బిల్డ్'కు భూముల విక్రయం ఒక్కటే మార్గమని సర్కారు భావించినట్లుంది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల వద్ద వేలకోట్ల విలువైన భూములున్నాయి. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పురపాలన, పంచాయతీ రాజ్, మార్కెటింగ్, పర్యాటక... ఇలా అనేక శాఖల వద్ద భూములున్నాయి. వీటి విలువ వేల కోట్లలో ఉంటుంది. ఒక్క ఆర్‌అండ్‌బీ వద్ద ఉన్న స్థలాల విలువే రూ.5వేల కోట్లు ఉంటుందని అంచనా. ఇలాంటి భూములను విక్రయించి ఆ డబ్బును 'మిషన్ బిల్డ్'కు ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ఇలా ఎందుకంటే...

భూములమ్మి 'బిల్డ్' మిషన్ చేపట్టాలన్న నిర్ణయం తీసుకోవడం వెనుక కారణాలను ప్రభుత్వం వివరించింది. "రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం వినూత్నమైన పథకాలకు రూపకల్పన చేసింది. నవరత్నాలు, నాడు-నేడు సహా అనేక కీలక పథకాలు అమలు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలు దెబ్బతిన్నాయి. మౌలిక సదుపాయాలపరంగా తీవ్రంగా ఇబ్బందులు వస్తున్నాయి. మౌలిక సదుపాయాలను అభివృద్ధిచేసి, కొత్త వసతులను కల్పించాల్సిన అత్యవసర ఆవశ్యకత ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లకు చెందిన భూములు సుదీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. శాఖల మధ్య సమన్వయంలోపం, ప్రభుత్వ భూముల నిర్వహణకు సరైన యంత్రాంగం లేకపోవడం వల్ల పెద్ద ఎత్తున ఆక్రమణలు, అనధికార వినియోగం, కేసులు, వివాదాలు పెరిగాయి. ఇలాంటి భూములను విక్రయించి నవరత్నాలు, నాడు-నేడు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చు. ఎన్‌బీసీసీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. నిరుపయోగంగా ఉన్న భూములను సమర్థంతంగా వాడుకోవడంలో ఈ సంస్థకు మంచి నైపుణ్యం ఉంది" అని మంత్రివర్గం నిర్ణయంపై సర్కారు ఒక ప్రకటన విడుదల చేసింది.

## ఇదేం 'బిజినెస్'?

**» రూల్స్ సవరణపై సీఎస్ అసంతృప్తి**

**» ప్రవీణ్ ప్రకాశ్‌పై సీఎంకు ఫిర్యాదు!**

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తనపై అధికారులకు సైతం షోకాజ్ నోటీసులు ఇచ్చే అధికారాన్ని కట్టబెట్టుకుంటూ జీఏడీ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఇచ్చిన జీవో అంశం మరింత రగులుతోంది. గవర్నర్‌తోపాటు తన అధికారాలను తోసిరాజనేలా బిజినెస్ రూల్స్‌ను మార్చడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ప్రవీణ్ ప్రకాశ్ సీఎం ముఖ్య కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. కీలక ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం చేసే కార్యదర్శులు, స్పెషల్ సీఎస్‌లకు సైతం సీఎం ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు ఇచ్చే అధికారాన్ని దఖలు పరుచుకుంటూ ఆయన ఇటీవల జీవో జారీ చేశారు. నిజానికి ఈ అధికారం సీఎస్‌కు మాత్రమే ఉంటుంది. బిజినెస్ రూల్స్‌ను సవరించడానికీ ఒక పద్ధతి ఉంటుంది. సీఎస్, గవర్నర్ ద్వారా ఇది జరగాలి. ఇవేవీలేకుండా, సీఎంకు తనకూ మధ్య మరెవరూ లేరన్నట్లుగా, సీఎస్ అధికారాలకు సైతం కోతపెడుతూ ప్రవీణ్ ప్రకాశ్ బిజినెస్ రూల్స్‌ను సవరించడం వివాదాస్పదమైంది. దీనిపై సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఆయన ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. తనకు తెలియకుండా, సమాచారం ఇవ్వకుండా కీలకమైన బిజినెస్ రూల్స్ సవరించడం సరికాదని ఆవేదన వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ప్రవీణ్ ప్రకాశ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

### ఏమిటీ బిజినెస్ రూల్స్?

రాజ్యాంగంలోని 166వ అధికరణం ప్రకారం రాష్ట్రాలు బిజినెస్ రూల్స్ రూపొందించుకుంటాయి. పాలనా యంత్రాంగం ఏ పద్ధతిలో నడవాలి? అధికారాల బదలాయింపు ఎలా ఉండాలి? అధికార క్రమం ఏంటి?... తదితర అంశాలతో కూడినవే బిజినెస్ రూల్స్. బిజినెస్ రూల్స్‌లో సాధారణంగా పాలనా యంత్రాంగానికి సీఎస్ అధిపతి. ముఖ్యమైన ఫైళ్లు ఆయన నుంచి సీఎంకు వెళ్లాలి. ప్రాముఖ్యాన్ని బట్టి కొన్ని ఫైళ్లు శాఖాధిపతులు, కార్యదర్శుల వద్దకు, మరికొన్ని సీఎస్ దగ్గరకు, ఇంకా ముఖ్యమైనవి సీఎం వరకు వెళ్తుంటాయి. అతి ముఖ్యమైనవి మాత్రం సీఎస్ నుంచే సీఎంకు వెళ్తాయి. ఈ బిజినెస్ రూల్స్‌కు జీఏడీ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఇటీవల సొంతంగా సవరణలు చేసేశారు.

# ఇంటర్ వరకూ అమ్మఒడి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న కీలక నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాలు, రవాణా శాఖల మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) సచివాలయంలో విలేకరులకు వెల్లడించారు. 'ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, ఎయిడెడ్, అన్ఎయిడెడ్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో ఒకటి నుంచి ఇంటర్ దాకా చదివే పేద విద్యార్థుల తల్లులకు అమ్మఒడి కింద కింద ఏటా రూ.15 వేలు ఇస్తామని, జనవరి నుంచి నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుందని చెప్పారు. తల్లులు లేని చోట పిల్లల సంరక్షకులకు పథకం వర్తిస్తుందన్నారు. వీధి బాలలు, అనాథలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరితే వారికి ఈ పథకం వర్తింపుపై సంబంధిత శాఖను సంప్రదించాలని.. పథకం అమలుకోసం రూ.6,455 కోట్లు ఖర్చుచేయనున్నామని చెప్పారు.

### మరిన్ని కేబినెట్ నిర్ణయాలివీ..

- హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలోని 130 ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ సేవలకు ఆరోగ్యశ్రీ వర్తింపు.
- తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా, హిమోఫిలియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ. 10 వేల చొప్పున పింఛను.
- తీవ్రపక్షపాతం, తీవ్రమైన కండరాల క్షీణత, కదల్లేని స్థితిలో మంచానపడ్డవారు, బోధకాలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు (స్టేజ్ 3,4,5) నెలకు రూ.5 వేల పింఛను.
- ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స అనంతరం పేద రోగులు కోలుకునే వరకు రోజుకు రూ.225 లేదా నెలకు రూ.5 వేల పింఛను.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బోధనాస్పత్రుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల వేతనాలు రూ.16 వేలకు పెంపు.
- గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు రెట్టింపు పౌష్టికాహారం. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాకింద పెట్టే ఖర్చు భారీగా పెంపు. రాష్ట్రంలో ఏడు ఐటీడీఏలు సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, చింతూరు, కేఆర్‌పురం, శ్రీశైలంతోపాటు 8 జిల్లాలు, గిరిజన సబ్‌ప్లాన్ ప్లాన్ ఏరియాల్లో దీని అమలు.
- అగ్రిగోల్డ్ బాధితులకు నవంబరు 7 నుంచి డబ్బుల చెల్లింపు. రూ.10 వేల చొప్పున డిపాజిట్ చేసిన 3,69,655 మందికి రూ.264 కోట్ల చెల్లింపు.
- కృష్ణా, గోదావరి నదులపై పంటకాలువల శుద్ధికి ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ఆమోదం. ముఖ్యమంత్రి చైర్‌పర్సన్‌గా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వైస్‌చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జలవనరులు, అడవులు, పురపాలన, పంచాయతీరాజ్ తదితర విభాగాల అధికారులు సభ్యులుగా ఉంటారు.
- షెడ్యూల్డ్ కులాల ఆర్థిక సహకార సంస్థ విభజన. మాల, మాదిగ, రెల్లి-ఇతర కులస్తుల కోసం 3 ప్రత్యేక కార్పొరేషన్లు.
- వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల చొప్పున చెల్లింపు. డీజిల్ సబ్సిడీ రూ.6.03 నుంచి రూ.9కి పెంపు. తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం ప్రాంతంలో చమురు, సహజవాయువు తవ్వకాల వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ఓఎన్‌జీసీ చెల్లించాల్సిన బకాయిలను రాష్ట్రప్రభుత్వమే చెల్లించాలన్న నిర్ణయానికి ఆమోదం.
- వివిధ రంగాల్లో ప్రజాసేవ అందించిన ప్రతిభావంతులకు వైఎస్‌ఆర్ లైఫ్‌టైమ్ అవార్డులు. విద్య, సామాజిక, సేవ, వైద్యం, సైన్స్, ఇంజనీరింగ్, సివిల్ సర్వీసు, వాణిజ్యం, పరిశ్రమలు, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో వంద మంది ప్రతిభావంతులకు ఏటా రెండు విడతలుగా అవార్డుల ప్రదానం. జనవరి 26న 50 మందికి, ఆగస్టు 15న మరో 50 మందికి రూ.10 లక్షల చొప్పున నగదు అందిస్తారు. కేంద్రం ఇచ్చే పద్మ విభూషణ్ తరహాలో వైఎస్‌ఆర్ లైఫ్‌టైమ్ అవార్డులను అందించాలని నిర్ణయించినట్లు మంత్రి నాని చెప్పారు.
- హజ్, జెరూసలెం వెళ్లే యాత్రికులకు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయం పెంపు. వార్షికాదాయం రూ. 3లక్షలలోపు ఉన్న వారికి ఇచ్చే సహాయం రూ.40 వేల నుంచి రూ.60 వేలకు, వార్షికాదాయం రూ.3 లక్షలపైన ఉన్నవారికి ఇచ్చే సహాయం రూ. 20 వేల నుంచి రూ.30 వేలకు పెంపు.
- రోబో శాండ్ తయారు చేసే స్టోన్ క్రషింగ్ యూనిట్లకు ప్రోత్సాహకాలకు ఆమోదముద్ర. రూ.50 లక్షల నుంచి రూ.1.50 కోట్ల మేర పావలా వడ్డీకి రుణాలు. రోబో శాండ్, ఎం-శాండ్‌ను ప్రభుత్వ పథకాలకు 20 శాతం మేర వినియోగించుకునేందుకు ఓకే. ఏటా రూ.37.3 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. 186.5 కోట్ల కేటాయింపు. ప్రస్తుత స్టోన్ క్రషర్ యూనిట్లు అప్‌గ్రేడ్ కావడానికి ఆరు నెలలు గడువు.
- రైతుల మేలు కోసం రాష్ట్రంలో 147 నియోజకవర్గాల్లో వ్యవసాయ ల్యాబ్స్ ఏర్పాటుకు ఆమోదం. వీటితోపాటు జిల్లా స్థాయిలో 13, ప్రాతీయ స్థాయిలో 4 రీజనల్ కోడ్ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం. విత్తనాలు, ఎరువులు మార్కెట్‌కు వచ్చే ముందు, మార్కెట్ నుంచి వెళ్లే ముందు వీటిల్లో పరీక్షిస్తారు. 9 కోస్తా జిల్లాల్లో 46 నియోజకవర్గాల్లో ఆక్వా ల్యాబ్‌ల ఏర్పాటు.
- బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు, బాండ్లు జారీ చేసేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలకు అనుమతి.



### భూముల క్రమబద్ధీకరణ

అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. పేదలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి కేసుల్లో అభ్యంతరం లేని భూములను పేదల పేరిటే రెగ్యులరైజ్ చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 100 గజాల వరకు రూపాయికే రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు 100 నుంచి 300 గజాల వరకు ప్రభుత్వ భూమిలో ఇళ్లు కట్టుకుంటే జిల్లా కలెక్టర్ నిర్ణయించే ధరల ఆధారంగా క్రమబద్ధీకరిస్తారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారికి 300 గజాల వరకు మార్కెట్ విలువ ఆధారంగా కలెక్టర్ ఇచ్చే సిఫారసు మేరకు రెగ్యులరైజ్ చేస్తారు. క్రమబద్ధీకరణ అనంతరం భూమిపై పూర్తి హక్కులు ఇస్తారు. కానీ ఐదేళ్లపాటు లాకింగ్ ఉంటుంది. గతంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న పేదలు వాటిని మరో పేదకు విక్రయిస్తే దాన్ని కూడా నిబంధనల మేరకు రెగ్యులరైజ్ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

### రెండు భూ కేటాయింపులు రద్దు

విశాఖపట్నం బీచ్‌రోడ్డులో లులూ గ్రూపునకు గత ప్రభుత్వం కేటాయించిన 13.83 ఎకరాల భూమిని రద్దుచేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలో వీబీసీ ఫెర్టిలైజర్స్‌కు 498.93 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కూడా రద్దుచేసింది. 'గత ప్రభుత్వంలో బాబుగారి బంధువులకు నామమాత్రపు ధరకే ఈ భూమిని కేటాయించారు. అనంతరం ఆ భూమిని సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకొస్తూ జీవో జారీ చేయడం రాజకీయంగా అనైతికమని భావించి దాన్ని రద్దుచేశాం. వీబీసీ ఎవరిదో బాబుగారిని లేదా బాలయ్యగారినే అడగండి. లేదా ఇంటర్నెట్‌లో శోధించండి తెలుస్తుంది' అని మంత్రి ఓ ప్రశ్నకు బదులిచ్చారు. విశాఖ బీచ్ సమీపంలో ఎకరం రూ.50 కోట్లు విలువ చేసే భూమిని హీనాతిహీనంగా నెలకు రూ.4 లక్షల అద్దెకు లులూ గ్రూపునకు ఇచ్చారు. సీవీసీ నిబంధనల ప్రకారం సింగిల్ బిడ్ దాఖలు చేసిన ఈ గ్రూపునకు ఆ భూమి ఇవ్వకూడదు. అయినా ఇచ్చారు. దీనిపై ఆక్షేపణ తెలియజేస్తూ రద్దుచేయాలని మంత్రివర్గం నిర్ణయించింది' అని మంత్రి వివరించారు.

### త్వరలోనే ఇసుక కష్టాలు తీరతాయి..

ఇసుక కొరత కారణంగా ఉపాధి కోల్పోయిన తమకు పింఛను ఇవ్వాలని కూలీలు కోరుతున్నారని, ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించాలని విన్నవిస్తున్నారని విలేకరులు ప్రస్తావించగా.. ఇవింకా ప్రభుత్వం దృష్టికి రాలేదని మంత్రి బదులిచ్చారు. త్వరలోనే ఇసుక కష్టాలు తీరతాయన్నారు. 'పేదల కష్టంపై మాకు బాధ్యత ఉంది. గత 3 నెలలుగా వర్షాలు కురుస్తున్నాయి. నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఈ సమస్యలు తీరతాయి. ప్రజలకు ఇసుక అందుబాటులోకి రాబోతోంది' అని చెప్పారు.

# 'స్టార్టప్'కు స్వస్తి

- **సీడ్ కేపిటల్ ప్రాజెక్టు నుంచి తప్పుకునేందుకు సింగపూర్ కన్సార్షియానికి అనుమతి**
- **కేబినెట్ సమావేశంలో చర్చ.. అంగీకరించిన సీఎం**
- **విచారణ లేకుండా వదిలేస్తున్నాం...: జగన్**
- **ముందుగానే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'**

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో స్టార్టప్ ఏరియా(సీడ్ కేపిటల్) ప్రాజెక్టు కథ కంచికి చేరింది. ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగడానికి సింగపూర్ కన్సార్షియానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లభించింది. ఈ బాధ్యతల నుంచి తమను విముక్తం చేయాలంటూ కన్సార్షియం ప్రభుత్వానికి లేఖ రాసిందని, దానిపై జరిగిన చర్చల్లో మౌఖిక అంగీకారం కూడా కుదిరిందని, త్వరలోనే దాని అధికారిక నిష్క్రమణ ఖాయమని పేర్కొంటూ 'ఆంధ్రజ్యోతి' కొద్దిరోజుల క్రితం ఇచ్చిన కథనం అక్షర సత్యమని తేలిపోయింది. సీడ్ క్యాపిటల్ ప్రాజెక్ట్ నుంచి స్వచ్ఛందంగా వైదొలగుతామంటూ సింగపూర్ కన్సార్షియం చేసిన లిఖితపూర్వక విజ్ఞప్తిపై సీఎం జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చ అనంతరం, అందుకు సీఎం పచ్చజెండా ఊపారు. గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించిన ఈ ప్రాజెక్టులో భారీ కుంభకోణం ఉందని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వం భాగస్వాములని చెప్పినప్పటికీ... సింగపూర్ ప్రభుత్వానికి బదులు అక్కడి కొన్ని ప్రైవేట్ సంస్థలు ఇందులో భాగస్వాములయ్యాయని, ప్రాజెక్టు వ్యయంలో సింహభాగం మనం భరిస్తే వచ్చే లాభాల్లో ఎక్కువ వాటాను ఆ సంస్థలకు కట్టబెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారని సీఎం ఆరోపించినట్లు భోగట్టా. ఈ అక్రమాలు, అసత్యాలకు గాను అసలైతే విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉందని వ్యాఖ్యానించారంటున్నారు. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొద్దిపాటి పనులు మాత్రమే జరగడంతో పాటు ఎటువంటి న్యాయపరమైన ఇబ్బందులూ తలెత్తకుండా తామే దీనినుంచి తప్పుకుంటానని సింగపూర్ కన్సార్షియం అంటున్నందున అందుకు అనుమతిద్దామని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇరు పక్షాల పరస్పర సమ్మతితో అమరావతి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు నుంచి సింగపూర్ కన్సార్షియం అధికారికంగా తప్పుకునేందుకు మార్గం సుగమమైంది.

### నోరు విప్పలేకపోయారు: బొత్స

అమరావతి అభివృద్ధి ద్వారా ప్రభుత్వానికి ఏ రకంగా ఆదాయం తీసుకొస్తారో చెప్పాలని సింగపూర్ సంస్థతో జరిగిన సమావేశంలో అడిగామని, దానికి వారు అన్ని దిక్కులూ చూశారే తప్ప నోరు విప్పలేకపోయారని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదాయం తేలగిగితే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలనే ఆప్షన్ వాళ్లకిచ్చామని, వాళ్లు ముందుకు రానందున పరస్పర అంగీకారంతో ఒప్పందం రద్దు చేసుకున్నామని చెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబుకు రాష్ట్రంలో అడ్రసే లేదని మంత్రి ఎద్దేవా చేశారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలనుకుంటే చంద్రబాబు గెజిట్ నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 'రాజధాని ప్రాంతంలో ఇల్లు ఎందుకు కట్టుకోలేదు? ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రాన్ని వదిలేసి హైదరాబాద్‌లో ఇల్లు ఎందుకు కట్టుకున్నారో చెప్పాలి. రాజధాని గురించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు గత ప్రభుత్వానికి సంబంధించినవి. మా బాధ్యతగా సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నాం' అని తెలిపారు. ఎన్నికల ముందు గత డిసెంబరులో ఏకంగా రాజధానికి సంబంధించి రూ.40,000 కోట్ల టెండర్లు ఎందుకు పిలిచారో చంద్రబాబు చెప్పాలన్నారు. అమరావతి ఏ రకంగా సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టో ఆయనే వివరించాలని వ్యాఖ్యానించారు. రాజధానిని అడవిలోకి తీసుకొచ్చి ఇప్పుడు అడవిలా మారిందని చంద్రబాబు అంటే ఎలాగని మంత్రి ప్రశ్నించారు.

## అమరావతిని మార్చొద్దు!

**» జీఎన్ రావు కమిటీకి అభ్యర్థనల వెల్లువ**

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన జీఎన్ రావు కమిటీకి రాజధాని ప్రాంతవాసుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు అందుతున్నట్లు తెలిసింది. ఈ కమిటీ రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న వివిధ ప్రణాళికలు, ప్రాజెక్టుల అమలు తీరుతెన్నులను అధ్యయనం చేసి 6 వారాల్లోగా సమగ్ర నివేదికను అందజేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేయాలని జీఎన్ రావు కమిటీ రెండు రోజుల క్రితం ప్రజలను కోరింది. అభ్యంతరాలను పోస్టు ద్వారా లేదా ఈ-మెయిల్స్ ద్వారా సమర్పించేందుకు నవంబరు 12 వరకు గడువునిచ్చింది. కమిటీ ప్రజల నుంచి సలహాలు, అభిప్రాయాలు కోరిన వెంటనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ కమిటీకి అనేక అంశాలపై అభ్యర్థనలు అందడం మొదలయ్యాయి. వాటిలో రాష్ట్ర రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలని కోరుతున్నవే ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. రాజధాని వాసుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తున్న 'అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య' కోఆర్డినేటర్ మాదల రాజేంద్ర తదితర నేతలు అమరావతికి మద్దతుగా కనీసం 20 వేల మంది సంతకాలు చేసిన అభ్యర్థనలను పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## తల్లిని చంపేముందు
# ప్రియుడితో కలిసి మద్యం!

▸ తల్లి అరవకుండా ఉండేందుకు మత్తు మందిచ్చిన కీర్తి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కన్నతల్లి గుండెలపై కూర్చుని.. ఆమె మెడకు చున్నీ బిగించి హత్యచేసేంత తెగింపు, ధైర్యం 19ఏళ్ల కీర్తికి ఎలా వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం కీర్తి ఇంట్లో వారికి మూడు ఖాళీ బీరు బాటిళ్లు లభ్యమయ్యాయి. రజితను ఎలాగైనా చంపాలని పథకం వేసుకున్న కీర్తి, శశి.. ఈ ఘాతుకానికి ఒడిగట్టేంత ధైర్యాన్ని కూడగట్టుకునేందుకు మద్యం తాగాలనుకున్నారు. బయట నుంచి శశి మూడు బీర్లు తేగా.. ఇద్దరూ కలిసి తాగారు. రజిత బిగ్గరగా కేకలు పెడితే? ఒకవేళ ప్రతిఘటించి తప్పించుకొని ఇరుగుపొరుగును అప్రమత్తం చేస్తే? తమ గుట్టు అంతా బయటపడుతుందని భావించి ఆమెకు మత్తు మందు ఇచ్చారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న కీర్తిని శశి రెచ్చగొట్టాడు. అప్పటికే ఆవేశంలో ఉన్న కీర్తి తల్లి గుండెలపై కూర్చుని తన చున్నితో ఆమె మెడకు ఉరి బిగించగా.. రజితను కదలకుండా శశి గట్టిగా పట్టుకున్నాడు. రజిత మృతదేహంతో మూడు రోజులపాటు ఇద్దరూ ఇంట్లోనే గడిపారు. దుర్వాసన వస్తుండటంతో కారులో తీసుకెళ్లి రామన్నపేట సమీపంలోని తుమ్మలగూడెం రైలు పట్టాలపై పడేసి వచ్చారు. మరోవైపు కీర్తి మొదటి ప్రియుడు బాల్‌రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రజిత హత్య అనంతరం బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు అజ్ఞాతంలోకి వెళ్లడం, తల్లిని చంపిన కీర్తికి బాల్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఆశ్రయం కల్పించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కైలాసగిరిపై గ్యాంప్‌రేప్

విశాఖపట్నం, అక్టోబరు 30: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరిపై బుధవారం సాయంత్రం ఒక యువతిపై నలుగురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. సుమారు 22 సంవత్సరాలు కలిగిన యువతి, పద్దెనిమిదేళ్ల బాలుడు సాయంత్రం కైలాసగిరి చేరుకున్నారు. బాలుడు కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఆమెకు ఇచ్చి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తరువాత తన ముగ్గురు స్నేహితులను రప్పించాడు. వారు కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న యువతిని ఆస్పత్రికి తరలించి, నిందితులపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

## 'ఉపాధి' పనుల బకాయిల చెల్లింపు పరిస్థితేంటి?

▸ బాబు ఫిర్యాదుతో రాష్ట్రానికి కేంద్రం ప్రశ్న

న్యూఢిల్లీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ఏపీలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన బకాయిలకు సంబంధించి తాజా పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌ను కేంద్రం ఆదేశించింది. రాష్ట్రంలో ఉపాధి పథకం కింద గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి కొత్త ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో పెండింగ్ బిల్లులు చెల్లించడంలేదని టీడీపీ అధినేత చంద్రబాబు, టీడీపీపీ నేత గల్లా జయదేవ్ కేంద్రానికి ఫిర్యాదు చేశారు. దీంతో సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది.

## పేదరికాన్ని పుస్తకాల్లో తెలుసుకోలేదు: మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 30: పేదరికం గురించి పుస్తకాల్లో చదివి తెలుసుకోలేదని, పేదరికాన్ని స్వయంగా అనుభవించానని ప్రధాని మోదీ అన్నారు. రైల్వే ప్లాట్‌ఫాంపై టీ అమ్ముకుని ఈ స్థాయికి చేరానని తెలిపారు. సౌదీ అరేబియాలో మంగళవారం నిర్వహించిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ సదస్సులో మోదీ పాల్గొన్నారు. సదస్సులో నిర్వహించిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో మోదీ తన ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. కొన్నేళ్లలో భారత్ పేదరికాన్ని నిర్మూలిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

## బగ్దాదీ ఆచూకీ చెప్పిన వ్యక్తికి 177 కోట్లు!

వాషింగ్టన్, అక్టోబరు 30: ఐఎస్ అధినేత అబూబకర్ అల్‌బగ్దాదీ ఆచూకీ చెప్పిన వ్యక్తికి 25 మిలియన్ డాలర్ల(రూ.177 కోట్లు) నగదు బహుమతి దక్కే అవకాశం ఉంది. బగ్దాదీ ఆచూకీ వెల్లడించిన వారికి ఇంత మొత్తం నగదు బహుమతి ఇస్తామని అమెరికా ఇంతకుముందు ప్రకటించిన విషయం తెలిసిందే. బలగాలకు సమాచారం అందించిన వ్యక్తి సున్నీ అరబ్ అని ఓ అధికారి తెలిపారు. తన కుటుంబ సభ్యుల్లో ఒకరిని ఐఎస్ ఉగ్రవాదులు చంపడంతో అతను కూడా ఆ ఉగ్ర సంస్థలో చేరాడు. ఆయనే బగ్దాదీ డ్రాయర్లు దొంగిలించి డీఎన్ఏ పరీక్షకు అందజేశాడు.

## బంగారం.. బండారం విప్పాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. దీనిపై 'స్వచ్ఛంద వెల్లడి' పథకాన్ని ప్రవేశపెడుతుంది. నిర్దిష్ట గడువు ప్రకటించి ఆ లోపు ప్రతి ఒక్కరూ తమ వద్ద నిల్వ ఉన్న బంగారం వివరాలు బయటపెట్టాలని స్పష్టం చేస్తుంది. పరిమితికి మించి ఉన్న బంగారంపై పన్ను విధించి 'అమ్నెస్టీ'(సార్వత్రిక క్షమాభిక్ష) కింద శిక్షించకుండా వదిలేస్తుంది. ఆ తర్వాత కొరడా విదిలిస్తుంది. లెక్కల్లో చూపించని బంగారంపై భారీ జరిమానా విధిస్తుంది. కొత్తగా కొన్న బంగారు కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చెప్పాల్సి ఉంటుంది. రసీదు లేకుండా బంగారం కొంటే భారీ జరిమానాలు తప్పవు. ఒక్కొక్కరు గరిష్ఠంగా ఎంత స్వర్ణం ఉంచుకోవచ్చు, పరిమితికి మించిన బంగారాన్ని స్వచ్ఛందంగా బయటపెడితే ఎంత పన్ను విధిస్తారు, 'అప్రకటిత' బంగారంపై విధించే జరిమానా ఎంత? ఈ వివరాలను నిర్ధారించాల్సి ఉంది. ఆర్థిక వ్యవహారాలు, ఆదాయ పన్ను శాఖలు సంయుక్తంగా ప్రతిపాదనలు రూపొందించాయి.

### కొన్ని మినహాయింపులు...

ఆదాయపు పన్నులో కొన్ని మినహాయింపులు ఉన్నట్లే బంగారంపై పన్నుకూ మినహాయింపులు వర్తిస్తాయని తెలుస్తోంది. వివాహమైన మహిళలకు సంబంధించిన నగలపై నిర్దిష్ట విలువ వరకు మినహాయింపు ఇస్తారు. విలువను ప్రభుత్వం గుర్తించిన నిపుణులు నిర్ధారిస్తారు. ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు ప్రతినిధులతో కలిసి 'గోల్డ్ బోర్డు' ఏర్పాటు చేస్తారు. బహుశా ఈ ఆర్థిక సంవత్సరంలోనే దీన్ని ఏర్పాటు చేసే అవకాశముంది. ప్రజలు బంగారు కొనుగోళ్లను కొనసాగించేలా ప్రోత్సహించడంపై ఈ బోర్డు దృష్టి సారిస్తుంది. ఇక... ప్రస్తుతం అమలులో ఉన్న 'సావరిన్ గోల్డ్ బాండ్' పథకాన్ని కూడా మార్చేస్తారు. దీనిని కొనుగోలుదారులకు ఆకర్షణీయంగా ఉండేలా తీర్చిదిద్దుతారని అధికార వర్గాలు తెలిపాయి. గోల్డ్ బాండ్ పథకంలో అవిభాజ్య హిందూ కుటుంబం డీమ్యాట్ ఫార్మాట్‌లో గరిష్ఠంగా నాలుగు కిలోల వరకు బంగారు కొనవచ్చు. ట్రస్టులు 25 కిలోల వరకు కొనుగోలు చేయవచ్చు. ఇలా కొన్న బంగారం విలువపై 2.5 శాతం వడ్డీ కూడా వస్తుంది.



# 18 పురుషుల వివాహ వయసు?

మూడేళ్లు తగ్గింపునకు కేంద్రం పరిశీలన

మహిళలతో సమం చేసేందుకు చర్చలు

ఒకటే కనీస వయసుపై సంప్రదింపులు

చేపట్టామని కోర్టుకు తెలిపిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, అక్టోబరు 30: పురుషుల వివాహ వయసును మహిళలతో సమానంగా 18 ఏళ్లు చేయాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు బాల్య వివాహ నిషేధ చట్టంలో సవరణపై ఇటీవల నిర్వహించిన వివిధ మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. పురుషులు, మహిళల వివాహ అర్హత వయసును సమం చేసేందుకు వివిధ వర్గాలతో సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభించామని బుధవారం కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఇది కూడా పురుషుల వివాహ వయసును కేంద్రం తగ్గిస్తుందన్న వార్తలకు బలం చేకూరుస్తోంది. ప్రస్తుతం పెళ్లికి కనీస వయసు పురుషులకు 21 ఏళ్లు, మహిళలకు 18 ఏళ్లు. పురుషులు, మహిళల వివాహ వయసు ఒకేలా ఉండాలంటూ బీజేపీ నేత అశ్విని ఉపాధ్యాయ్ ఆగస్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ విషయంలో బాల్య వివాహ నిషేధ చట్టానికి సవరణ తెచ్చేందుకు మహిళా శిశు అభివృద్ధి శాఖ సంప్రదింపులు మొదలుపెట్టిందని కోర్టుకు కేంద్రం తరపు న్యాయవాది తెలిపారు. పలు చట్టాలను మార్చాల్సి ఉన్నందున న్యాయ శాఖను కూడా కక్షిదారుగా చేర్చాలని కోరారు. తదుపరి విచారణను ధర్మాసనం వచ్చే ఏడాది ఫిబ్రవరి 19వ తేదీకి వాయిదా వేసింది.

# 2050 నాటికి ముంబై, కోల్‌కతా మునక?



## పెరుగుతున్న సముద్ర మట్టాలతో 30 కోట్ల మందికి పెను ప్రమాదం

▸ అందులో మూడున్నర కోట్ల మంది ముంబై, కోల్‌కతా నగరాల ప్రజలే

▸ 'క్లైమేట్ సెంట్రల్' అధ్యయనంలో వెల్లడి

న్యూయార్క్, అక్టోబరు 30: భూతాపం వల్ల మంచు ఖండాలు పెరుగుతున్న సముద్రమట్టాలతో 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా పలు సముద్ర తీర నగరాలు ముంపునకు గురికానున్నాయి! ముంపు ముప్పు పొంచి ఉన్న నగరాల్లో మన ముంబై, కోల్‌కతా కూడా ఉన్నాయని అమెరికాకు చెందిన క్లైమేట్ సెంట్రల్ సంస్థ అధ్యయనంలో తేలింది. పెరుగుతున్న సముద్రమట్టాల వల్ల ఈ నగరాల్లో చాలా భాగాలకు ముంపు ముప్పు ఉందని నాసా 'షటిల్ రాడార్ టోపోగ్రఫీ మిషన్ (ఎస్ఆర్‌టీఎం)' ద్వారా గతంలోనే హెచ్చరించింది. ముంబై, కోల్‌కతాల్లో తీరప్రాంతాల మునక వల్ల 50 లక్షల మందికి ప్రమాదం ఉందని నాసా హెచ్చరిస్తే, దాదాపు 3.5 కోట్ల మందికి ముప్పు ఉందని క్లైమేట్ సెంట్రల్ ఆందోళన వ్యక్తం చేసింది. నాసా సముద్ర ఉపరితలాల పెరుగుదల ఆధారంగా లెక్కలు వేస్తే క్లైమేట్ సెంట్రల్ సంస్థ 'కోస్టల్ ఐడీఈఎం' విధానంలో కృత్రిమ మేధ సాయంతో అధ్యయనం నిర్వహించింది.

➡ కర్బన ఉద్గారాలను ఇప్పటికిప్పుడు పూర్తిగా తగ్గించినా సరే ఈ శతాబ్దంలో సముద్ర మట్టాలు మరో 0.5మీటర్ల మేర పెరుగుతాయి. అంటార్కిటిక్ ఐస్ షీట్ అస్థిరతను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఆ పెరుగుదల 2 మీటర్ల దాకా ఉండే ప్రమాదం పొంచి ఉంది. అంటే.. రెండు నుంచి ఏడడుగుల ఎత్తు దాకా అన్నమాట!!

➡ పెరుగుతున్న సముద్ర మట్టాల కారణంగా 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా పలు చోట్ల తీరప్రాంతాలు మునిగి 30కోట్ల మంది ఇబ్బంది పడనున్నారు.

➡ ప్రస్తుతం 20 కోట్ల మంది ప్రజలకు ఆవాసంగా ఉన్న తీరప్రాంతాలను 2100 నాటికి సముద్ర జలాలు శాశ్వతంగా ఆక్రమిస్తాయి.

➡ సముద్ర జలాలు శాశ్వతంగా ఆక్రమించే స్థలాలు ఎక్కువగా ఉన్నది ఆసియా ఖండంలోనే. చైనా, బంగ్లాదేశ్, ఇండియా, ఇండోనేసియా, థాయ్‌లాండ్, వియత్నాం, జపాన్ దేశాలకు ముప్పు ఎక్కువ.

➡ దక్షిణ వియత్నాం పూర్తిగా మునిగిపోయే ముప్పుంది. అలాగే, థాయలాండ్ భూభాగంలో 10శాతం జలసమాధి కానుంది. షాంఘై నగరంలోకి సముద్ర జలాలు చొచ్చుకొచ్చే ప్రమాదం ఉంది.

➡ సముద్ర మట్టాల పెరుగుదల వల్ల అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యే దేశాలు.. బంగ్లాదేశ్, చైనా. బంగ్లాదేశ్‌లో 9.3 కోట్ల మంది.. చైనాలో 4.2 కోట్ల మంది ప్రభావితమవుతారు.

**20వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు 11 నుంచి 16 సెంటీ మీటర్ల మేర పెరిగాయి.**




## పాక్‌లో గురునానక్ నాణెం

ఇస్లామాబాద్, అక్టోబరు 30: సిక్కుల గురువు గురునానక్ 550వ జయంతి సందర్భంగా స్మారక నాణేన్ని పాకిస్థాన్ విడుదల చేసింది. ఈ చిత్రాన్ని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ బుధవారం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. నవంబరు 9న కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవం సందర్భంగా పాక్ ఈ నాణేన్ని విడుదల చేసింది. గురునానక్ పాక్‌లోని శ్రీ నంకనా సాహిబ్‌లో జన్మించారు. కర్తార్‌పూర్ కారిడార్‌లో చారిత్రాత్మక గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను భారత్‌లోని సిక్కులు దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తూ పాక్ ఒప్పందం కుదుర్చుకుంది. రోజూ భారత్‌కు చెందిన 5 వేల మంది సిక్కు భక్తులు దర్శించుకుంటారు.



## భారత టెకీలకు అమెరికా షాక్

వాషింగ్టన్, అక్టోబరు 30: భారతీయ టెకీలకు అమెరికా ప్రభుత్వం షాక్ ఇచ్చింది. హెచ్1బీ వీసాల కోసం వచ్చిన దరఖాస్తుల్లో 25% దరఖాస్తులను ట్రంప్ ప్రభుత్వం తిరస్కరించింది. అక్టోబరు నుంచి జూన్ వరకు(మూడు త్రైమాసికాల్లో) ఈ మొత్తం దరఖాస్తులను తిరస్కరించారు. వీటిలో అత్యధికంగా కాగ్నిజెంట్(60%) కంపెనీవి కాగా క్యాప్‌జెమిని, యాక్సెంచర్, విప్రో, ఇన్ఫోసిస్ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. 2015(6%) తో పోలిస్తే 2019 (25%) లో తిరస్కరణ రేటు 3 రెట్లు పెరిగిందని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) తెలిపింది. యూఎస్‌సీఐఎస్ అక్టోబరు నుంచి సెప్టెంబరు ఆర్థిక సంవత్సరాన్ని పాటిస్తుంది. హెచ్1బీ వీసా హోల్డర్లలో భారతీయులు 70% మంది ఉన్నారు. తర్వాతి స్థానంలో చైనా ఉంది.



## 'టిప్పు'పై పాఠాలు తొలగింపు!

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మరోసారి టిప్పుసుల్తాన్ వివాదం రాజుకుంటోంది. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వమే టిప్పు సుల్తాన్ జయంతిని జరుపగా, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. తాజాగా టిప్పుసుల్తాన్ చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం యడియూరప్ప బుధవారం మీట్ ది ప్రెస్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. టిప్పుసుల్తాన్ చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి తొలగించే విషయమై నిర్ణయం తీసుకుంటామన్నారు. దీనిపై ప్రాథమిక విద్యాశాఖమంత్రి సురేశ్ కుమార్ నవంబరు 7న టిప్పుపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.



మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలకు ఫడణవీస్ అభివాదం

## శివసేనకు డిప్యూటీ సీఎం?

▸ 26:13 నిష్పత్తిలో కేబినెట్ పదవులు!

▸ సేనతో కలిసే ప్రభుత్వ ఏర్పాటు: ఫడణవీస్

▸ దిగివచ్చిన సేన.. పొత్తు కొనసాగాలని వ్యాఖ్య

ముంబై, అక్టోబరు 30: మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన తొలగిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. శివసేన-బీజేపీ మధ్య ఓ ఒప్పందం కుదిరే సూచనలు కనిపిస్తున్నాయి. శివసేనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడానికి బీజేపీ సుముఖంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. హరియాణా ఫార్ములాను అనుసరిద్దామని బీజేపీ ప్రతిపాదించినట్లు సమాచారం. దీంతో అధికారాన్ని చెరి రెండున్నరేళ్లు పంచుకోవాలన్న శివసేన కోరిక నెరవేరేలా లేదు. అయితే ఫలితాలు వెలువడ్డ నాటి నుంచి దూకుడు ప్రదర్శిస్తున్న శివసేన బుధవారం కాస్త మెత్తబడింది. "బీజేపీతో పొత్తులో మేం కొనసాగాలి. తప్పదు. అయితే ఇందుకోసం మా గౌరవాన్ని తాకట్టు పెట్టం" అని సేన ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. "శివసేనతో కలిసే మేం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. ప్రజాతీర్పు 'మహాయుతి' (శివసేన-బీజేపీ కూటమి) ప్రభుత్వం ఏర్పడాలనే.. దాన్ని నెరవేరుస్తాం" అని దేవేంద్ర ఫడణవీస్ కూడా ప్రకటించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. 'మంత్రి పదవుల్లో మాకు 26.. మీకు 13' అని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఆ కేబినెట్ పదవుల్లోనూ హోం, ఆర్థికం.. లాంటి నాలుగు కీలక శాఖలు కూడా ఇచ్చేది లేదని బీజేపీ స్పష్టం చేసింది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఈ ప్రతిపాదనపై శివసేన మౌనం దాల్చింది. సీనియర్ నేతల మధ్య జోరుగా రాయబేరాలు సాగుతున్నట్లు సమాచారం. గురువారం శివసేన శాసనసభా పక్ష నేతగా ఆదిత్య ఠాక్రేను ఎన్నుకునే అవకాశం ఉంది. మరోవైపు బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఫడణవీస్ ఎన్నికయ్యారు. కాగా పరిస్థితులు మారితే ప్రభుత్వ ఏర్పాటులో ఓ పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎన్‌సీపీ నేత ప్రఫుల్ పటేల్ వ్యాఖ్యానించారు. ఎన్‌సీపీ శాసనసభా పక్ష నేతగా అజిత్ పవార్ ఎన్నికయ్యారు.

## రెండుగా కశ్మీర్ విభజన

▸ అమల్లోకొచ్చిన కొత్త చట్టం

▸ నేటి నుంచి కేంద్ర పాలిత ప్రాంతాలుగా పాలన



ఉగ్రవాదుల చేతిలో చనిపోయిన కార్మికుల బంధువుల రోదన

న్యూఢిల్లీ, అక్టోబరు 30: జమ్మూకశ్మీర్ తన రాష్ట్ర హోదాను కోల్పోయింది. ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ ఈ ఆగస్టు 5న ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిన్న అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. పార్లమెంటు ఆమోదించిన రాష్ట్ర విభజన చట్టం ప్రకారం.. జమ్మూ-కశ్మీర్ ఓ కేంద్ర పాలిత ప్రాంతంగా, లద్దాఖ్ రెండో కేంద్ర పాలిత ప్రాంతంగా గురువారం నుంచి పాలనా వ్యవహారాలు సాగుతాయి. గుజరాత్‌కు చెందిన మాజీ బ్యూరోక్రాట్ జీసీ ముర్ము జమ్మూ కశ్మీర్‌కు తొలి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ, మరో సీనియర్ ఐఏఎస్ రాధాకృష్ణ మాథుర్ లద్దాఖ్ ప్రాంతానికి తొలి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ గురువారం ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ విభజనతో దేశంలో కేంద్ర పాలిత రాష్ట్రాల సంఖ్య ఏడుకు పెరుగుతాయి. రాష్ట్రాల సంఖ్య 28కి తగ్గుతాయి. 72 ఏళ్ల కశ్మీర్ సంక్షుభిత చరిత్రలో ఇదో మలుపు. 1947 అక్టోబరు 26న అప్పటి కశ్మీర్ మహారాజా హరిసింగ్ భారత యూనియన్‌లో రాష్ట్రాన్ని విలీనం చేస్తూ- 'ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ ఏక్సెషన్' పై సంతకం చేశారు. నాటి నుంచి ఇది భారత్‌లో అంతర్భాగంగానే ఉంటూ వచ్చింది. దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జన్మదినమైన అక్టోబరు 31 నాడే కశ్మీర్ పూర్తిగా భారత్‌లో విలీనమవుతుండడం విశేషం. కాగా మీడియా కథనాల ప్రకారం.. కశ్మీర్ లోయలోని అనేక ప్రాంతాలు ఇప్పటికీ ఆంక్షల నడుమ కొనసాగుతున్నాయి. ఈ మధ్యే ఫోన్లు పునరుద్ధరించినా అనేక ప్రాంతాల్లో అప్రకటిత నెట్‌వర్క్ డౌన్ అమలవుతోంది. ఇంటర్నెట్ తెరుచుకోలేదు. లోయలో దాదాపు ప్రతీరోజూ బంద్ వాతావరణమే. మరోవైపు విభజన కార్యక్రమాన్ని ఆర్భాటాలకు దూరంగా సాదాసీదాగా జరపాలని కేంద్రం ఉత్తర్వులిచ్చింది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో కుదుటపడకపోవడం, పుల్వామా వద్ద ఉగ్రవాదులు ఆరుగురు వలస కూలీలను కాల్చి చంపడం మొదలైనవి దృష్టిలో ఉంచుకుని... హడావిడి చెయ్యరాదని ప్రస్తుత పాలన యంత్రాంగాన్ని ఆదేశించింది.

### మా పర్యటన 'కళ్లు తెరిపించింది': ఈయూ ఎంపీలు

ఆర్టికల్ 370 భారతదేశ అంతర్గత అంశమని యూరోపియన్ యూనియన్ పార్లమెంటు సభ్యులు స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరులో తమ మద్దతు భారత్‌కే అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం శ్రీనగర్ చేరుకున్న 23 మంది ఈయూ ఎంపీల బృందం బుధవారమిక్కడ విలేకరులతో మాట్లాడింది. కశ్మీరు విషయంలో అంతర్జాతీయ మీడియా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నట్లుగా కనిపిస్తోందని పోలండ్‌కు చెందిన రిజార్డ్ కార్నెకీ అన్నారు. ఈ పర్యటన తమ కళ్లు తెరిపించిందని కార్నెకీ చెప్పారు. కాగా ఈయూ ఎంపీలను కశ్మీరు పర్యటనకు అనుమతించడం దేశ చరిత్రలోనే దౌత్యపరమైన అతిపెద్ద తప్పుగా నిలిచిపోతుందని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. మరోవైపు జమ్మూకశ్మీరులోని మాచిల్ సెక్టార్‌లో ఎల్‌వోసీ వెంట పాక్ బలగాలు కాల్పులకు తెగబడ్డాయి. ఈ కాల్పుల్లో ఓ పౌరుడు చనిపోయాడు. పీవోకేను అధీనంలోకి తీసుకుంటామని కేంద్రమంత్రి వీకే సింగ్ చెప్పారు.

## 'సచివాలయ' అభ్యర్థులకు లక్కీచాన్స్

▸ ప్రతి విభాగంలోనూ 15 అదనపు మార్కులు

▸ మిగిలిన 25 వేల పోస్టుల భర్తీకి తక్షణ చర్యలు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ కార్యదర్శుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో మిగిలిపోయిన 25వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్ష రాసిన అభ్యర్థులందరికీ 15 మార్కులు అదనంగా కలిపి ఈ పోస్టులను భర్తీ చేయాలని అధికారులను ఆదేశించింది. సీఎంవో, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు బుధవారం జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా పోస్టుల నియామకంపై ఆదేశాలిచ్చారు.

### వలంటీర్ పోస్టుల భర్తీకి నేడో రేపో నోటిఫికేషన్

ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టుల భర్తీకి పురపాలక శాఖ ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 68,797 వార్డు వలంటీర్ పోస్టులుండగా, 51,108 మాత్రమే విధుల్లో ఉన్నారు. వివిధ కారణాలతో 17,689 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనవరి 1 నుంచి వార్డు సచివాలయ వ్యవస్థను ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఖాళీగా ఉన్న ఈ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. అనంతపురం-958, చిత్తూరు-1720, కడప-684, కర్నూలు-842, నెల్లూరు-1338, ప్రకాశం-435, గుంటూరు-2,228, కృష్ణా-3,645, పశ్చిమ గోదావరి-1,028, తూర్పుగోదావరి-1,092, విశాఖ-3,102, విజయనగరం-292, శ్రీకాకుళం-325 పోస్టులు ఖాళీ ఉన్నాయి.

## ప్రధాని శంకుస్థాపన చేశారు...
# రాజధాని ఎక్కడికీ వెళ్లదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటన చేయాలని ఆయనకు విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన పై విధంగా హామీ ఇచ్చారని రైతులు మీడియాకు తెలిపారు. అనంతరం తాడేపల్లిగూడెంలో జరిగిన గాంధీ సంకల్పయాత్ర ముగింపు సభలోనూ రాజధాని ప్రస్తావన తీసుకువచ్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం తప్పటడుగులు వేస్తోందన్నారు. గతంలో రాజధాని నిర్మిస్తామని రైతుల నుంచి భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఐదేళ్ళు గడిచిన తరువాత అక్కడ రాజధాని నిర్మిస్తామో? లేదో? తెలియదంటూ ప్రస్తుత ప్రభుత్వం నాన్చివేత ధోరణి అనుసరిస్తోందని విమర్శించారు. రాజధాని రైతుల హక్కులను హరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. రైతుల పక్షాన బీజేపీ పోరాడుతుందని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో రెండు బస్తాల ఇసుక పోయిందంటూ పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేసే స్థాయికి అవినీతి చేరుకుందని తూర్పారబట్టారు. 'ఏపీలో గత నాలుగు నెలల్లో ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలన్నీ వైసీపీ కార్యకర్తలు, అభిమానులకే చేరినట్లు మా వద్ద సమాచారం ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక వైసీపీ కార్యకర్తల కమిటీల ద్వారా చేయడం ఏమిటి?' అని రాంమాధవ్ జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విజయవాడ, తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన వైసీపీ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఏపీలో అవినీతి కోసమే పథకాలు అమలవుతున్నాయన్నారు. పోలవరం నుంచి ఇసుక వరకూ అంతా అవినీతిమయంగా మారిందని విమర్శించారు. టీడీపీని మునిగిపోతున్న నావగా భావించి పలువురు నేతలు పార్టీని వదిలి వెళ్లిపోతుండడంతో బీజేపీని వదిలి తప్పు చేశామని చంద్రబాబు పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఉందన్నారు. తమ పార్టీతో ఎవరు కలిసి వచ్చినా ముందుకు తీసుకెళతామని స్పష్టంచేశారు. పొత్తుల విషయం 2024లోనే ఆలోచిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రులు పైడికొండల మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్, రావెల కిశోర్ బాబు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ రెడ్డి, గాంధీ సంకల్పయాత్ర రాష్ట్ర కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు.

### జోరువానలో బీజేపీ శ్రేణులు

గుంటూరులో జోరువానలో బైకు ర్యాలీ నిర్వహించిన బీజేపీ శ్రేణులు ఆ తరువాత పాదయాత్రను నిర్వహించాయి. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంమాధవ్ మీడియాతో మాట్లాడారు. 'ఉప్పు రైతుల కష్టాలు దూరం చేసేందుకు ఆనాడు గాంధీ ఉప్పుసత్యాగ్రహం నిర్వహించారు. ఈ రోజు ఏపీ రాజధాని రైతులు, కార్మికులు పడుతోన్న ఇక్కట్లను దూరం చేసేందుకు మా ఈ పాదయాత్ర సమర్పితం చేస్తున్నాం' అని అన్నారు.

## రైతుల కోసం
## ఏమీ అడగటం లేదు

▸ కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఏమీ అడగటం లేదు. రైతాంగానికి ఏమిచ్చేందుకైనా మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తగిన ప్రతిపాదనలు పంపితే సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాం. వ్యవసాయ ఆధారిత ఆంధ్ర రాష్ట్రంలో రైతుల సమస్యలు తెలుసుకోవడానికి నేరుగా నేనే వచ్చాను' అని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా బీజేపీ చేపడుతోన్న 'మన్ మే బాపు' కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం రాష్ట్రానికి వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ ఎంపీ జీవీఎల్ నరసింహరావుతో కలిసి విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో శెనగ, పొగాకు రైతులు ఇబ్బందులు ప్రత్యక్షంగా విన్నానని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తుఫాన్లు, కరువు వచ్చినప్పుడు కేంద్ర బృందాలు సకాలంలో రాష్ట్రానికి వచ్చేలా ఇకపై చర్యలు తీసుకుంటామన్నారు.

## సినీ నిర్మాత ఎస్వీఎన్‌రావు అరెస్ట్

▸ 14 రోజుల రిమాండ్.. సినిమా అవకాశాల పేరిట మోసాలు

▸ తెలుగు రాష్ట్రాల్లో 1,600 మంది బాధితులు!

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 30: సినీ నిర్మాత, నవ్యాంధ్ర ఫిలించాంబర్ వ్యవస్థాపకుడు ఎస్వీఎన్ రావును తిరుపతి వెస్ట్ పోలీసులు అరెస్టుచేశారు. సినిమా అవకాశాలు ఇప్పిస్తానంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల యువతీయువకులను మోసం చేసినట్టు ఆయనపై కేసులు నమోదయ్యాయి. తిరుపతిలో కూడా స్టూడియో ఏర్పాటు చేసి పలువురి నుంచి లక్షలు వసూలు చేసినట్లు కేసులున్నాయి. గుంటూరు, విజయవాడ, హైదరాబాదుల్లోనూ ఆయనపై చీటింగ్ కేసులు నమోదయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 1,600 మంది బాధితులు ఉన్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులు నమోదైనప్పటి నుంచి ఆయన కోర్టుకు రాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఓ కేసుకు సంబంధించి బుధవారం తిరుపతి మూడవ అదనపు కోర్టుకు ఆయన హాజరవుతున్నట్టు తెలిసి తిరుపతి వెస్ట్ సీఐ శివప్రసాద్ నిఘా వేశారు. ఆయన రాగానే కోర్టు బయట అరెస్ట్ చేశారు. మార్చి 30న వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి కోర్టులో హాజరుపరిచారు. 14 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.

### అర్జా శ్రీకాంత్ డిప్యుటేషన్ పొడిగింపు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో, ప్రత్యేక కార్యదర్శి అర్జా శ్రీకాంత్ డిప్యుటేషన్‌ను ప్రభుత్వం మరో రెండేళ్లు పెంచింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2021 అక్టోబరు 26 వరకు డిప్యుటేషన్ కొనసాగుతుందని పేర్కొంది.

### మళ్లీ విదేశానికి రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, అక్టోబరు 30: కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరో విదేశీ యాత్ర చేపట్టారు. ఈసారి ఆయన ధ్యానయాత్రలో భాగంగా ఇండోనేషియా వెళ్లినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు.. మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో వచ్చే నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ దాకా నిరసన కార్యక్రమం కొనసాగుతుందని ఆ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు.

## బలంగా తిరిగొస్తాడు..



**షకీబల్ భార్య భావోద్వేగ పోస్ట్**

**ఢాకా:** బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబల్ హసన్ నిషేధంపై అతని భార్య ఉమ్మీ అహ్మద్ షిషిర్ స్పందించింది. తన ఫేస్‌బుక్ ఖాతాలో భావోద్వేగ పూరితమైన పోస్ట్ పెట్టింది. 'లెజెండ్స్.. ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసి ఆ స్థాయికి వస్తారు. వాళ్లకూ కష్ట కాలం వస్తుంది. కానీ, దృఢ సంకల్పం, మనోధైర్యంతో ఆ పరిస్థితులను దీటుగా ఎదుర్కొంటారు. షకీబల్ మానసిక స్థయిర్యం నాకు బాగా తెలుసు. గాయాల కారణంగా కొన్నాళ్లు ఆటకు దూరమైనా, తిరిగి ప్రపంచకప్‌లో అతనెలాంటి ప్రదర్శన చేశాడో చూశాం. ఇది ఓ సంధి దశ. అతని కొత్త ప్రయాణానికి ఆరంభం మాత్రమే. గతంలో ఎన్నడూ లేనంత బలంగా తిరిగొస్తాడు' అంటూ షిషిర్ పోస్ట్‌లో రాసుకొచ్చింది.




**భారత-బంగ్లాదేశ్ డే/నైట్ టెస్ట్‌పై ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. ఈ సీజన్‌కు ముందు మూడేళ్లు దులీప్ ట్రోఫీ గులాబీ బంతులతో జరిగినా ఫ్యాన్స్ వాటిని చూసింది తక్కువ. అందుకే కోల్‌కతా టెస్ట్‌పై అందరిలోనూ ఉత్సుకత. ఇక చలికాలం ఆరంభంలో ఆ టెస్ట్ జరగనుంది. ఈశాన్య ప్రాంతమైన కోల్‌కతాలో మంచు అధికంగా కురుస్తుంది. దాంతో బౌలర్లకు బంతిపై పట్టు లభిస్తుందా? అన్న చర్చ మొదలైంది. మరి.. ఈ సమస్యను అధిగమించడమెలా..?**

## బంగ్లా ఆటగాళ్లు వచ్చేశారు..



**న్యూఢిల్లీ:** భారత్‌లో మూడు వారాల పర్యటనకు బంగ్లాదేశ్ జట్టు బుధవారం ఇక్కడకు చేరుకుంది. పర్యటనలో భాగంగా బంగ్లా తొలుత మూడు టీ20లు ఆడనుంది. 15మంది సభ్యులుగల టీ20 జట్టుకు మహ్మదుల్లా రియాద్ సారథ్యం వహిస్తున్నాడు. పర్యటనకు ఒకరోజు ముందు స్టార్ ఆల్‌రౌండర్ షకీబల్ హసన్‌పై ఐసీసీ ఏడాది నిషేధం విధించడంతో బంగ్లాకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది, అయితే షకీబల్ దూరమవడం జట్టుకు లోటుకాదని రియాద్ అన్నాడు. 'అది (షకీబల్ లేకపోవడం) మాకు ప్రేరణ ఇస్తుంది. దేశంకోసం పూర్తి శక్తిసామర్థ్యాలతో ఆడాలి. దేశానికి సారథ్యం వహించడమన్న పెద్ద బాధ్యత నాపై ఉంది. నా శక్తిమేర ఆడతా' అని రియాద్ అన్నాడు. మహ్మదుల్లాగాక ముష్ఫికర్ రహీమ్ మాత్రమే బంగ్లాదేశ్ జట్టులో ఏకైక సీనియర్ కావడం గమనార్హం.

**టీ20 జట్టు:** మహ్మదుల్లా (కెప్టెన్), లిటన్ దాస్, సౌమ్య సర్కార్, మహ్మద్ నయీమ్, ముష్ఫికర్, అతీఫ్, మొసాదెక్, అనిముల్, అరాఫత్, అల్ అమిన్, ముస్తాఫిజుర్, సైఫుల్ ఇస్లాం, మహ్మద్ మిథున్, తైజుల్, హైదర్ రోనీ.

**బంగ్లా పర్యటన షెడ్యూల్**

| | |
|---|---|
| తొలి టీ20 (నవంబరు 3) | న్యూఢిల్లీ |
| రెండో టీ20 (నవంబరు 7) | రాజ్‌కోట్ |
| మూడో టీ20 (నవంబరు 10) | నాగపూర్ |
| మొదటి టెస్ట్ (నవంబరు 14-18) | ఇండోర్ |
| రెండో టెస్ట్ (నవంబరు 22-26) | కోల్‌కతా |

# మంచు కురిసే వేళలో..

**'డే/నైట్'లో బంతిపై పట్టు చిక్కేనా?**



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

**భా**రత టెస్ట్ క్రికెట్ చరిత్రలో నవంబరు 22కు ఎంతో ప్రాధాన్యం ఉండబోతోంది. 1932లో క్రికెట్ మక్కా లార్డ్స్‌లో టెస్ట్ అరంగేట్రం చేసిన భారత్.. రాంచీలో సౌతాఫ్రికాతో ముగిసిన రెండో టెస్ట్‌తో కలిపి మొత్తం 538 మ్యాచ్‌లు ఆడింది. అయితే బంగ్లాదేశ్‌తో జరిగే రెండో టెస్ట్..మన సుదీర్ఘ ఫార్మాట్‌లో ఓ మైలురాయి కానుంది. ఇప్పటివరకు డే/నైట్ టెస్ట్‌లకు కెప్టెన్ కోహ్లీతోపాటు, బీసీసీఐ విముఖంగా ఉన్నాయి. అయితే బోర్డు కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సౌరవ్ గంగూలీ తనదైన శైలిలో పావులు కదిపి భారత్-బంగ్లా సిరీస్‌లో రెండో టెస్ట్‌ను డే/నైట్‌లో ఆడించాలని నిర్ణయించాడు. కానీ విపరీతంగా కురిసే మంచుతో బంతి గ్రిప్ విషయంలో సమస్య ఏర్పడుతుందన్న ఆందోళన భారత్, బంగ్లాదేశ్ జట్లలో ఉంది. అయితే ఆ మంచు సమస్యను అధిగమించడం సులభమేనని క్యూరేటర్లు అంటున్నారు. వికెట్‌పై ఎక్కువగా పచ్చిక ఉండడం మంచు సమస్యకు విరుగుడని బీసీసీఐ మాజీ చీఫ్ క్యూరేటర్ దల్జీత్ సింగ్ చెప్పాడు. అదే సమయంలో అవుట్‌ఫీల్డ్‌లో తక్కువ పచ్చిక ఉండాలన్నాడు. తేమ బాగా ఉండనుండడంతో దానిని అధిగమించేందుకు ఈ మార్పులు తప్పనిసరని అతడు స్పష్టంజేశాడు. 'డే/నైట్ టెస్ట్‌లకు ప్రధాన అవరోధం మంచే. దానిని ఎదుర్కోవాలంటే అవుట్ ఫీల్డ్‌లో తక్కువ, వికెట్‌పై ఎక్కువ పచ్చిక ఉండాలి. నవంబరు 22కల్లా ఈడెన్‌గార్డెన్స్‌ను సిద్ధం చేయాలంటే 'పచ్చిక' పనులు ఇప్పటి నుంచే ప్రారంభించాలి' అని దల్జీత్ సూచించాడు. 'గులాబీ బంతి త్వరగా పాతబడిపోతుంది. అందుకే..పిచ్‌పై ఎక్కువగా పచ్చిక ఉండాలి. అడిలైడ్‌లో మొదటి డే/నైట్ (2017) టెస్ట్ జరిగినప్పుడు వికెట్‌పై 11 మి.మీ. మేర పచ్చిక ఉంచారు. ఈడెన్ గార్డెన్స్‌లోనూ అలానే చేయాలి' అని అన్నాడు. 'దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లపై మంచు ప్రభావం చూపింది. 7 మి.మీ, పచ్చిక కలిగిన పిచ్‌పై ఆ మ్యాచ్‌లు నిర్వహించారు. సాధారణ వికెట్‌లపై 2.5 నుంచి 4 మి.మీ. పచ్చికే ఉంటుంది. పచ్చిక అధికంగా ఉంటే బంతి ఎక్కువగా సీమ్ అవుతుంది' అని దల్జీత్ వివరించాడు. ఇక సాధారణ టెస్ట్‌ల మాదిరిగా ఈ మ్యాచ్‌కు రెండు, మూడు రోజుల ముందు అవుట్‌ఫీల్డ్‌ను తడపకూడదని అనుభవజ్ఞుడైన మరో క్యూరేటర్ సూచించాడు. 'సాధారణంగా అవుట్‌ఫీల్డ్‌లో పచ్చిక 7 నుంచి 8 మీ.మీ. ఉంటుంది. కానీ డే/నైట్ టెస్ట్‌లకు 6 మి.మీ.లే ఉండాలి. మంచు కురవడం సహజ ప్రక్రియ. దానిని ఇలాంటి చర్యలతో తగ్గించగలం' అని అన్నాడు.

### అది సమస్యే కాదు..

**మం**చు అంతగా అవరోధం కాబోదంటున్నాడు బెంగాల్ క్రికెట్ సంఘం క్యూరేటర్ సుజన్ ముఖర్జీ. 'మంచు సమస్యను ఎదుర్కొనేందుకు ఎన్నో చర్యలు చేపట్టనున్నాం. సాధారణంగా మంచు రాత్రి 8 లేదా 8.30కు ప్రారంభమై అర్ధరాత్రి వరకూ కురుస్తుంది. మ్యాచ్ త్వరగా మొదలవుతుంది కాబట్టి 8, 8.30కల్లా పూర్తవుతుంది. అందువల్ల మంచు సమస్యేకాదు' అని వివరించాడు.

### 72 గులాబీ బంతులు

**ఎస్జీకి బీసీసీఐ ఆర్డర్**



**న్యూఢిల్లీ:** భారత్ తొలిసారి డే/నైట్ టెస్ట్ ఆడుతున్న నేపథ్యంలో అందుకు అవసరమైన గులాబీ బంతులకు బీసీసీఐ ఆర్డరిచ్చింది. మొత్తం 72 గులాబీ బంతులను వచ్చేవారానికి సరఫరా చేయాలని ఎస్జీ కంపెనీకి బీసీసీఐ సూచించింది. భారత్‌లో మొదటిసారి జరుగుతున్న డే/నైట్ టెస్ట్‌కు బంతులను సిద్ధం చేయడం ఎస్జీకి సవాలే. గతంలో మూడు సీజన్లు దులీప్ ట్రోఫీని డే/నైట్‌లో నిర్వహించినా వాటికి కూకాబుర్రా బంతులను వాడారు. 'ఆరు డజన్ల గులాబీ బంతులకు బీసీసీఐ ఆర్డరిచ్చింది. వాటిని వచ్చేవారానికి సరఫరా చేయనున్నాం. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లో మా ఎర్ర బంతులు ఎంత నాణ్యంగా ఉన్నాయో అంతా చూశారు. గులాబీ బంతులనూ అంతే నాణ్యతతో తయారు చేస్తాం' అని కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. స్వదేశంలో గత సీజన్‌లో ఎర్ర బంతుల నాణ్యత విషయంలో ఎస్జీ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నది. ఈ బంతులు త్వరగా నునుపు కోల్పోతున్నాయని కెప్టెన్ కోహ్లీ అసంతృప్తి వ్యక్తంజేశాడు. కాగా కోల్‌కతా టెస్ట్‌కు అత్యుత్తమ నాణ్యత కలిగిన బంతులను అందిస్తామని ఎస్జీ ప్రతినిధి చెప్పారు.

## విచారణ విషయం మాకు తెలీదు

**బంగ్లా క్రికెట్ బోర్డు చీఫ్**

**షకీబల్‌కు అభిమానుల మద్దతు**



షకీబల్ హసన్

**ఢాకా:** ఫిక్సింగ్ వ్యవహారంలో స్టార్ ఆల్‌రౌండర్ షకీబల్ హసన్‌ను గత పది నెలల నుంచి ఐసీసీ విచారిస్తున్న విషయం తమకు తెలీదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అధ్యక్షుడు నజ్ముల్ హసన్ స్పష్టం చేశారు. గతేడాది భారత బుకీ దీపక్ అగర్వాల్ మూడుసార్లు సంప్రదించిన విషయాన్ని షకీబల్ ఐసీసీ ఏసీయూకు తెలపకపోవడంతో రెండేళ్ల నిషేధం పడిన విషయం తెలిసిందే. అయితే ప్రపంచ క్రికెట్‌ను నివ్వెరపరిచిన ఈ వ్యవహారం బీసీబీకి తెలియకుండానే సాగడంతో ఐసీసీ ఎంత గోప్యత పాటించిందో అర్థమవుతోంది. 'జనవరి నుంచి షకీబల్‌పై ఐసీసీ చేస్తున్న విచారణ గురించి నాతోపాటు బీసీబీలోని ఏ ఒక్కరికీ తెలీదు. ఏసీయూ నేరుగా షకీబల్‌తోనే మాట్లాడింది. ఇటీవలి ఆటగాళ్ల సమ్మెపై మాతో జరిపిన చర్చల సందర్భంగానే షకీబల్ ఈ విచారణ గురించి చెప్పాడు' అని నజ్ముల్ హసన్ తెలిపారు.

### కఠిన శిక్ష పడాల్సింది: మాజీలు

షకీబల్‌పై మాజీ ఆటగాళ్లు విమర్శలు గుప్పిస్తున్నారు. అతడికి మరింత కఠిన శిక్ష పడాల్సిందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అన్నాడు. నిబంధనల గురించి అవగాహన ఉన్నప్పటికీ అవినీతి సమాచారాన్ని షకీబల్ ఏసీయూకు తెలపకపోవడం విడ్డూరంగా ఉందని ఆసీస్ మాజీ బ్యాట్స్‌మన్ డీన్ జోన్స్ అన్నాడు. ఆట కన్నా ఎవరూ ఎక్కువ కాదని షకీబల్ వ్యవహారంలో తెలిసొచ్చిందని పాక్ మాజీ క్రికెటర్ రమీజ్ రాజా అన్నాడు.

### 2023 ప్రపంచకప్‌నకు అతడే సారథి: మోర్తజా

షకీబల్ కచ్చితంగా వచ్చే వన్డే వరల్డ్‌కప్‌లో తమను ముందుండి నడిపిస్తాడని బంగ్లాదేశ్ వన్డే జట్టు రెగ్యులర్ కెప్టెన్ మష్రఫే మోర్తజా ధీమా వ్యక్తం చేశాడు. 18 ఏళ్లుగా షకీబల్‌తో క్రికెట్ ఆడుతున్నానని, అతను లేకుండా మైదానంలో అడుగుపెట్టడాన్ని ఊహించలేకపోతున్నట్టు వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ తెలిపాడు.


### అభిమానుల ర్యాలీ

షకీబల్‌పై నిషేధం విధించగానే బంగ్లాదేశ్‌లో అభిమానులు భగ్గుమన్నారు. షకీబల్ స్వగ్రామమైన మగురాలో 700 మంది ఫ్యాన్స్ వీధుల్లో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ తీశారు. ఇదంతా కుట్రలో భాగమని, వెంటనే నిషేధం ఎత్తివేయాలంటూ డిమాండ్ చేశారు.

### ఎంసీసీకి గుడ్‌బై

ప్రఖ్యాత మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ)కు చెందిన ప్రపంచ క్రికెట్ కమిటీ నుంచి షకీబల్ తప్పుకొన్నాడు. ఈ విషయాన్ని అధికారికంగా ఎంసీసీ తెలిపింది. 2017, అక్టోబరులో షకీబల్ ప్రపంచ క్రికెట్ కమిటీలో సభ్యుడిగా చేరి సిడ్నీ, బెంగళూరులో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నాడు. ఈ కమిటీలో ప్రస్తుత, మాజీ ఆటగాళ్లతో పాటు అంపైర్లు కూడా ఉంటారు. క్రికెట్‌లో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు ఏటా రెండుసార్లు కమిటీ సమావేశమవుతుంది.

### తమీమ్‌నూ సంప్రదించాడు



**బు**కీ దీపక్ అగర్వాల్ బంగ్లాదేశ్ ఓపెనర్ తమీమ్ ఇక్బాల్‌ను కూడా సంప్రదించాడని ఐసీసీ పేర్కొంది. షకీబల్‌తోపాటు మరో ఆరుగురు క్రికెటర్లను ఐసీసీ ఏసీయూ విచారించింది. ఈ సందర్భంగా అగర్వాల్ విషయాన్ని తమీమ్ వారికి చెప్పాడు. అయితే అప్పట్లోనే అతడి వాట్సాప్ నెంబర్‌ను బ్లాక్ చేయడంతో పాటు బీసీబీ ఏసీయూకు కూడా తమీమ్ సమాచారమిచ్చాడు. దీంతో తమీమ్‌కు ఏసీయూ క్లీన్‌చిట్ ఇచ్చింది. కానీ విచారణ ఎదుర్కొన్న మిగతా నలుగురు ఆటగాళ్లెవరనేది తేలాల్సి ఉంది.

### మ్యాచ్ నిర్వహణ కన్నా కాలుష్యమే సమస్య



**న్యూఢిల్లీ:** క్రికెట్ మ్యాచ్ నిర్వహణకన్నా.. కాలుష్యమే ఢిల్లీ ప్రజల తీవ్ర సమస్యని టీమిండియా మాజీ ఆటగాడు గౌతమ్ గంభీర్ అన్నాడు. 'క్రికెట్ లేదా మరే క్రీడా పోటీకి ఆతిథ్యమివ్వడంకన్నా కాలుష్యమే ఢిల్లీ వాసులకు పెద్ద సమస్య' అని లోక్‌సభ సభ్యుడు కూడా అయిన గంభీర్ ట్వీట్ చేశాడు.


### ద్రావిడ్‌ను కలిసిన గంగూలీ

**బెంగూరు:** బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చీఫ్ రాహుల్ ద్రావిడ్‌ను కలిశాడు. స్థానిక చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్‌సీఏకు సరికొత్త రూపును తెచ్చేందుకు తీసుకోవాల్సిన రోడ్ మ్యాప్‌పై ఇరువురూ చర్చించారు. ప్రస్తుతం గాయపడిన ఆటగాళ్ల పునరావాస శిబిరంగానే ఎన్‌సీఏ ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. ఈ తరుణంలో యువ ఆటగాళ్లకు అత్యున్నత స్థాయిలో శిక్షణనిస్తూ రిజర్వ్ బెంచ్‌ను పటిష్ఠం చేయాలనుకుంటోంది. అలాగే ఎన్‌సీఏ అధికారులతో కలిసి నూతన కార్యాలయం కోసం కేటాయించిన భూమిని గంగూలీ పరిశీలించాడు. 40 ఎకరాల్లో మూడు మైదానాలతో పాటు ఇండోర్ నెట్స్, పరిపాలనా కార్యాలయాలు, హాస్టళ్లను నిర్మించాలనే ఆలోచనలో బీసీసీఐ ఉంది.

### స్కాట్లాండ్‌కు టీ20 వరల్డ్‌కప్ బెర్త్

**దుబాయ్:** స్కాట్లాండ్ జట్టు టీ20 వరల్డ్ కప్ బెర్త్ దక్కించుకుంది. వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 90 పరుగుల తేడాతో యూఏఈని చిత్తుచేసింది. తొలుత 198/6 స్కోరు చేసిన స్కాట్లాండ్ అనంతరం యూఏఈని 18.3 ఓవర్లలో 108 రన్స్‌కే ఆలౌట్ చేసింది. నమీబియా, నెదర్లాండ్స్, పపువా న్యూ గినియా, ఐర్లాండ్ ఇప్పటికే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించాయి.

## రవీందర్‌కు రజతం



**అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్**

**బుడాపెస్ట్:** అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్ రవీందర్ ఫైనల్లో ఓడి రజతంతో సరిపెట్టుకున్నాడు. బుధవారం జరిగిన 61 కిలోల ఫైనల్ బౌట్‌లో రవీందర్ 3-5తో ఉల్వుక్‌బెక్ జోలోస్‌బెకోవ్ (కిర్గిస్థాన్) చేతిలో ఓడాడు. మహిళల 50 కిలోల్లో జ్యోతి సెమీస్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్ పోరులో జ్యోతి 12-1తో మరియా లియోర్డా (మల్డోవా)ను మట్టికరిపించింది.

## మళ్లీ ఓడిన లంక

**ఆసీస్‌దే టీ20 సిరీస్**




**బ్రిస్బేన్:** డేవిడ్ వార్నర్ (60 నాటౌట్), స్మిత్ (53 నాటౌట్) అజేయ అర్ధ శతకాలతో అదరగొట్టడంతో.. శ్రీలంకతో రెండో టీ20లో ఆస్ట్రేలియా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. లంక నిర్దేశించిన 118 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 13 ఓవర్లలో... కేవలం ఒకే వికెట్ కోల్పోయి ఛేదించింది. తొలుత శ్రీలంక 19 ఓవర్లలో 117 పరుగులకే కుప్పకూలింది. స్టాన్‌లేక్, కమిన్స్, ఆస్టన్ అగర్, ఆడమ్ జంపా తలో రెండు వికెట్లు పడగొట్టారు. కుశాల్ పెరీరా (27) టాప్‌స్కోరర్. ఛేదనలో ఓపెనర్ ఆరోన్ ఫించ్‌ను మలింగ (1/23) డకౌట్ చేసి ఆసీస్‌కు షాకిచ్చాడు. కానీ మరో ఓపెనర్ వార్నర్, స్మిత్ రెండో వికెట్‌కు అజేయంగా 117 పరుగులు జోడించి.. మరో 42 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

## ఫైనల్లో శివ, పూజ

**నిఖత్‌కు కాంస్యమే**



**టోక్యో:** ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్‌లో భారత బాక్సర్లు శివ థాపా, పూజా రాణి, ఆశిష్ ఫైనల్ చేరుకున్నారు. అయితే, తెలుగు బాక్సర్ నిఖత్ జరీన్‌తో పాటు సిమ్రన్‌జిత్ కౌర్, సుమిత్, వహ్లింపుయా సెమీస్‌లో ఓడి కాంస్యాలకే పరిమితమయ్యారు. 51 కిలోల సెమీఫైనల్స్‌లో నిఖత్.. జపాన్ బాక్సర్ సనా కవానో చేతిలో ఓడింది. పూజా రాణి (75 కి).. బిట్రీజ్ సోరెస్ (బ్రెజిల్)పై గెలిచి ఫైనల్ చేరుకుంది. సిమ్రన్‌జిత్ కౌర్ (60 కి).. కజక్ బాక్సర్ రిమ్మా ఒలోసెంకో చేతిలో ఓడింది. సెమీస్ బౌట్‌లో జపాన్ బాక్సర్ డైసుకే నరిమట్సుపై శివ థాపా (63 కి) గెలిచి స్వర్ణ పోరుకు చేరుకున్నాడు. ఆశిష్ (69 కి).. హిరాకి కింజ్యోపై నెగ్గాడు.

## అట్లెటికోకు మరో గెలుపు




**చెన్నై:** డేవిడ్ విలియమ్స్ గోల్‌తో అట్లెటికో కోల్‌కతా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఐఎస్ఎల్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో అట్లెటికో 1-0తో చెన్నై ఎఫ్‌సీపై గెలిచింది. 48వ నిమిషంలో కోల్‌కతా ఫార్వర్డ్ డేవిడ్ విలియమ్స్ ఏకైక గోల్ సాధించాడు. కాగా, చెన్నైకు ఇది హ్యాట్రిక్ పరాజయం.

## ఒమన్ టీటీలో స్వస్తిక, కావ్యకు కాంస్యాలు

**మస్కట్:** ఒమన్ జూనియర్, కేడెట్ ఓపెన్‌లో భారత యువ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణులు స్వస్తిక ఘోష్, కావ్యశ్రీ భాస్కర్ కాంస్య పతకాలతో మెరిశారు. మహిళల సింగిల్స్ సెమీస్‌లో స్వస్తిక 1-4తో యి చెన్ సూ (చైనీస్ తైపీ) చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. మరో సెమీస్‌లో కావ్యశ్రీ 1-3తో స్యూన్ చెంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలైంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.